తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

ఆదివారం 15.06.2025 | సంపుటి : 11 | సంచిక : 327 | పేజీలు : 12 | వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






# జర్నలిస్టులకు సామాజిక బాధ్యత

## రైతు పోరాటాలకు మద్దతుగా నిలవడం

ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించడం తప్పెట్లా అవుతుంది?

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం

- జనంసాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి : అల్లం నారాయణ
- మీడియాను భయపెట్టే ప్రయత్నం జరుగుతోంది : దేవులపల్లి అమర్
- అరెస్టులకు వ్యతిరేకంగా పౌరసమాజం కూడా స్పందించాలి : కె శ్రీనివాస్
- ప్రజాస్వామ్యం-పత్రికాస్వేచ్ఛ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం 2

ప్రజాపోరాటాలకు మద్దతుగా నిలుస్తున్న జర్నలిస్టులపై ఇటీవల అనేక కేసులు పెడుతున్నారని, మీడియా సంస్థలపై ఒత్తిళ్లు, అణిచివేతలు కొనసాగుతున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, ప్రజల ఉద్యమాలకు మద్దతుగా నిలవడం జర్నలిస్టుల సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న ధోరణులకు వ్యతిరేకంగా పాత్రికేయులు సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం- పత్రికాస్వేచ్ఛ' అంశంపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ప్రభుత్వాలు జర్నలిస్టులను భయపెట్టేలా వ్యవహరిస్తున్నాయని, అప్రజాస్వామిక అరెస్టులకు పూనుకుంటున్నాయని తెలిపారు. ఇటీవల కొమ్మినేని అరెస్ట్, రహమాన్‌పై కేసుల విషయంలో ఈ విషయం స్పష్టం రూఢీ అవుతోందన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా జర్నలిస్టులంతా ముక్తకంఠం వినిపించాలనే అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి)

## పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వేర్వేరు కాదు


**దేవులపల్లి అమర్, సీనియర్ సంపాదకులు**



కొమ్మునేని శ్రీనివాసరావుపై పెట్టిన కేసు జర్నలిస్టులకు పాలకులు ఇచ్చిన ఒక సంకేతం. ఎంతటివారినైనా ఉపేక్షించబోమనే సందేశం దానివెనుకాల ఉంది. జర్నలిజంలోకి కొత్తగా వస్తున్న యువతరాన్ని ఈ రకమైన కేసులు భయాం దోళనకు గురిచేస్తున్నాయి. రాజకీయ నేతలు తమకు అనుకూలంగా ఉండే వార్తలే రాయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం మీడియా స్వతంత్రంగా లేదు. రాజకీయ పార్టీల మద్దతుతో కొనసాగు తున్న పరిస్థితి కనిపిస్తోంది. అయినప్పటికీ పాత్రికేయులు తమ పరిమితులకు లోబడి వాస్తవాలను మాత్రమే రాయాలి. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం రెండు వేరు వేరు కాదు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ భాగం. తెలంగాణలో కూడా పెద్దధన్వాడ విషయంలో వార్తలు ప్రచురించినందుకు జనంసాక్షి పత్రిక ఎడిటర్ ఎంఎం రహమాన్‌పై తప్పుడు కేసులు పెట్టడం అన్యాయమైన విషయం. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలి.

## ఎంతపెద్ద జర్నలిస్టునైనా అరెస్ట్ చేస్తామనే సంకేతాలు

**కే.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు**



కొమ్మినేని అరెస్టుతో ఎంతపెద్ద జర్నలిస్టునైనా అరెస్ట్ చేస్తామనే అభిప్రాయం ప్రజల్లోకి తీసుకెళ్లారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం ఖండించాల్సిన విషయం. గతంలో కేసీఆర్ పాలనలో ఏం జరిగిందో మనందరం చూశాం. ప్రస్తుతం రేవంత్ పాలన కూడా అంతకు తక్కువేం లేదు. మిత్రుడు ఎంఎం రహమాన్ మీద కేసు పెట్టడం అన్యాయమైన విషయం. దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి. మీడియా కూడా రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారడం వల్ల ఆయా పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష పార్టీకి సంబంధి ంచిన మీడియా మీద దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. పార్టీలకు తొత్తులుగా లేకుండా మీడియా మనగలిగే రోజు రావాలి. ఇంతకాలం సోషల్ మీడియాకు సంబంధించిన వారి విషయంలో రాజ్యం కేసులు పెట్టినప్పుడు అందరం లైట్ తీసుకున్నాం. ఇప్పుడు ప్రధాన మీడియా వరకు వచ్చింది. సమాచారాన్ని చేరవేసే అందరూ జర్నలిస్టులేనన్న విషయాన్ని ఇప్పటికైనా మనం అంగీకరించాలి. రహమాన్ మీద పెట్టిన కేసు విషయంలో పౌరసమాజం కూడా స్పందించాలి.

## పెద్దధన్వాడ విషయంలో పోరాడకుంటే తప్పు

**అల్లం నారాయణ, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్**



పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడకుంటే తప్పు. జనంసాక్షి ఎడిటర్ రహమాన్ రైతులకు మద్దతుగా నిలిచినందుకు ఆయనపై అక్రమ కేసులు పెట్టారు. గతంలోనూ పత్రికా స్వేచ్ఛ ను హరించేలా పాలకులు ప్రవర్తించారు. ప్రజల పక్షం వహించే జర్నలిస్టుల మీద ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేయడం ఏ పాలకులకైనా తగదు. కొమ్మినేని విషయంలో అటు ఆంధ్రప్రదేశ్ సర్కారు కూడా అన్యాయంగా అరెస్టు చేయించిందింది. ఇది అన్ని ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘించినట్టు లెక్క. ప్రతిపక్ష పార్టీల మీద కక్ష ఉంటే వారితో ఢీకొనాలి తప్ప ఇలా జర్నలిస్టులను టార్గెట్ చేయడం సబబు కాదు. దీనిమీద జర్నలిస్టులందరూ సామూహికంగా గొంతెత్తాలి. ఇలాంటి దుశ్చర్యలు రిపీట్ కాకుండా చూసుకోవాలి.



## కేసులకు భయపడం.. ఇకముందు కూడా ప్రజాగొంతు వినిపిస్తాం :

**ఎంఎం రహమాన్, జనంసాక్షి ఎడిటర్**

ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో రైతుల తరపున నిలబడ్డందుకు నాపై కేసులు పెట్టారు. పరిశ్రమ అత్యంత ప్రమాదకరమైనదని రైతులను చ్కెతన్యం చేసినందుకు ప్రజాందోళన పెల్లుబికింది. ఫ్యాక్టరీ యాజమాన్యం కక్షగట్టి తప్పుడు ఫిర్యాదులు చేసింది.

మూడున్నర దశాబ్దాల నా జర్నలిస్టు వృత్తిలో ఇది నాపై మొదటి కేసు. అయినా వార్తలు రాయడంలో వెనక్కి తగ్గేది లేదు. కేసులకు భయపడేది లేదు. ఇకముందు కూడా ప్రజల గొంతుకగా జనంసాక్షి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంది.

## కన్నుల పండువగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం

### ఉత్తమ నటుడు అల్లు అర్జున్..

**సీఎం రేవంత్ చేతుల మీదుగా అవార్డు**



**హైదరాబాద్, (జనంసాక్షి) :** తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం హైటెక్స్‌లో ఘనంగా మొదలైంది. సీఎం రేవంత్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌ఎసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌ఎసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సినీ మిగతా 2లో..

## మధ్యప్రదేశ్‌లో నలుగురు మావోయిస్టుల మృతి

**భోపాల్, జూన్ 14 (జనంసాక్షి) :** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగా



లను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో మిగతా 2లో..



## మన నీళ్లపై ఏపీ కుట్ర

**బనకచర్ల దోపిడీని అడ్డుకోవడంలో విఫలం**

- ముఖ్యమంత్రి, నీటిపారుదల మంత్రుల నిర్లక్ష్యం
- మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,జూన్14 (జనంసాక్షి) :** గోదావరి జలదోపిడీ జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. దీనిని తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో.. గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై హరీశ్‌రావు మిగతా 2లో..

## జి-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోడీ

**నేటినుంచి మూడ్రోజుల పాటు విదేశీ పర్యటన**



2

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు రెడీ

**19న స్పేస్ స్టేషన్‌కు ముహూర్తం ఖరారు**



## బనకచర్ల ప్రతిపాదన తిరస్కరించండి

**డిపిఆర్ నిలువరించండి.. టెండర్లు తక్షణమే నిలిపి వేయండి**

**కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ కు రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్, (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన ఫ్రీ-ఫీజుబిలిటి రిపోర్ట్(పి.ఎఫ్.ఆర్) ను తక్షణమే తిరస్కరించాల్సిందిగా తెలంగాణా రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్‌ను అడ్డు కోవడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను నిలువరించాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు శనివారం రోజున బహిరంగ లేఖ రాశారు.

1980లో గోదావరి జలాల ఒప్పందాన్నీ ఉల్లంఘించినట్లు అవుతుందని, గోదావరి జల వివాద ట్రిబ్యునల్ ను పరిగణనలోకి తీసుకోవడం తో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణా కు దక్కాల్సిన గోదావరి నది వాటా హక్కును ప్రత్యక్షంగా దిక్కరించడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం జూన్ 2 న నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖా అదనపు కార్యదర్శి సజ్జన్ యాదవ్ చేసిన సూచన ఇందుకు అద్దం పడుతోందన్నారు. అప్పటికే పిఎఫ్ఆర్ మిగతా 2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 జూన్ 2025
తెలంగాణ

### రైతు పోరాటాలకు మద్దతుగా నిలవడం..

# జర్నలిస్టులకు సామాజిక బాధ్యత

## జర్నలిస్టుల పరిస్థితి ఆందోళనకరం

**శైలేష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్**



ప్రజాస్వామ్యం మీడియా అవిభక్త కవలలు. కవల పిల్లలకు అవయవాలు వేర్వేరుగా ఉంటాయి. రూపం మాత్రం ఒక్కటిగానే ఉంటుంది. మీడియా ప్రజాస్వామ్యానికి గుండెకాయ మాత్రం ఒక్కటిగా ఉంది. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుంటేనే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. ప్రజా స్వామ్యం వర్ధిల్లాలంటే పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవాలి. వ్యవస్థలో అన్ని రంగాలు ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటున్నాయి. పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయస్థానాలు ఇలా అన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండేవే. దీంతో జర్నలిస్టులను అకారణంగా టెర్రరిస్టుల మాదిరిగా అరెస్టు చేసి వారికి బెయిల్ రాకుండా చూసే ప్రయత్నం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిని చూస్తుంటే జర్నలిస్టులకు రానున్నవన్నీ గడ్డు రోజులని కనిపిస్తోంది. జనంసాక్షి ఎడిటర్ రహమాన్‌పై పెట్టిన కేసు చాలా అన్యాయంగా ఉంది. దీనిని జర్నలిస్టులు ప్రజాస్వామికవాదులు ఖండించాలి. రాజ్యాంగంలోని 19(ఏ)లో పేర్కొన్నట్టు భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాలి.

## కొమ్మినేని అరెస్టుతోనే అసలు ఉద్దేశం బహిర్గతం

**కే.రామచంద్రమూర్తి, సీనియర్ సంపాదకులు**



సుదీర్ఘ కాలంగా జర్నలిజంలో ఉన్న వ్యక్తి కొమ్మినేని శ్రీనివాసరావు. ఆయన వివాదాస్పదంగా మాట్లాడే వ్యక్తి కాదు. అలాంటి వ్యక్తిని సంబంధం లేకుండా ప్రభుత్వం అరెస్టు చేయడం... కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా అదుపులోకి తీసుకోవడం దుర్మార్గం. మరోవైపు సాక్షి మీడియా కార్యాలయాలపైనా దాడికి ప్రభుత్వం ప్రోత్సహించినట్లుగా ఉంది. దాడులను అరికట్టాల్సిన ప్రభుత్వం ప్రోత్సహిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది. సమాజంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ఉంటుంది. కానీ మాట్లడనీయకుండా... బెదిరింపులకు గురిచేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్లే.

## ప్రమాదంలో మీడియా

**టంకశాల అశోక్, సీనియర్ సంపాదకులు**

ప్రస్తుతం ప్రతికాస్వేచ్ఛ ప్రమాదంలో పడింది. కొమ్మినేని శ్రీనివాస రావు అరెస్టు పూర్తిగా అప్రజాస్వామికం. ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయనప్పటికీ ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించడం చూస్తుంటే ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో స్పష్టం అవుతుంది. ప్రస్తుతం ప్రతికా స్వేచ్ఛనే కాదు... అన్ని స్వేచ్ఛలు హరించుకుపోతున్నాయి. నియంత పాలన మాదిరిగా ప్రభుత్వా లు నిర్వహిస్తున్నారు. వీటిని అధిగమించేందుకు, ప్రజాస్వామ్యా న్ని పరిరక్షించేందుకు ప్రజల మద్దతును కూడగట్టుకుని.. ప్రజల సహకారంతోనే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

### నవ్వితే కూడా తప్పా :

**విజయ్ బాబు, సీనియర్ సంపాదకులు**

కొమ్మినేని అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విచారణ సమయంలో న్యాయమూర్తులు నవ్వుతుంటారు. కొమ్మినేని నవ్వితే అరెస్టు చేయడాన్ని కక్ష సాధింపుగా కోర్టు అభిప్రాయపడింది. కానీ సుప్రీంకోర్టు సూచనలపైన కొందరు వ్యంగ్యంగా చర్చిస్తున్నారు. కొన్ని మీడియా సంస్థలు సెక్షన్లు తెలియకుండా చర్చలు పెట్టేస్తున్నా రు. ఇది మీడియా ఉనికికే అత్యంత ప్రమాదకరం.

### పత్రికా స్వేచ్ఛకు భంగం వాటిల్లుతోంది :

**దిలీప్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు**

రాజ్యం అధికార వ్యవస్థను ఉపయోగించుకుని అరెస్ట్ చేసింది. దీన్ని సుప్రీం కోర్టు కూడా తప్పుబట్టింది. ఇందులో అంతర్గత విషయం ఏంటంటే.. పత్రికా స్వేచ్ఛను భంగం చేసే పరిస్థితి ఉంది. కాబట్టి సంఘటితంగా జర్నలిస్టులు తమ స్వేచ్ఛను రక్షించుకోవాలి.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు కే.శ్రీకాంత్‌రావు, ట్రెజరర్ రాజేష్, సభ్యులు బాపూరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అనుకూల వార్తలు కోరుకుంటున్నారు

**ధనుంజయ రెడ్డి, సంపాదకులు, సాక్షి**



గతంలో ప్రభుత్వాలు వ్యతిరేక వార్తల పట్ల కొంత అసంతృ ప్తి చూపేవి. కానీ ఇప్పుడు అసహనం నుంచి కక్షసాధింపు వరకు వచ్చింది. ప్రభుత్వాలు పూర్తిగా అనుకూల వార్తలు కోరుకుంటు న్నాయి. అన్ని పత్రికలు ఇదే తీరును అనుసరిం చాలని కోరుకుంటున్నాయి. లిక్కర్ కేసు తో సంబంధం లేకపోయినా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మా ఇంటికొచ్చి పోలీసులు సోదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పత్రికలకు, ప్రజలకు ఏ మాత్రం మంచిది కాదు. పొలిటికల్ బాసులకు తలొగ్గి.. పోలీసులు, అధికారులు కూడా నిబంధ నలు పాటించకుండా వ్యవహరిస్తున్నారు.

## మన నీళ్లపై ఏపీ కుట్ర

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళుతుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా మేం మద్దతిస్తాం. మీరు ముందుకు రాకపోతే భారాస పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోంది. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప మరోటి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద.. తెలంగాణకు గుండు సున్నా. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే.. తెలంగాణకు సున్నా.. ఇదీ దిల్లీ పాలకుల వైఖరి అని విమర్శలు చేశారు. నిధుల్లో, నదుల్లో తెలంగాణ కు అన్యాయం జరిగినా ఈ రాష్ట్రంలో ఉన్న 8మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది భాజపా ఎంపీలు నోరు విప్పడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరి- బనకచర్లకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోంది. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు ఎవరు ఇచ్చారు. 2 టీ-ఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలం గాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే భారాసకు ముఖ్యం అన్నారు.

## జి-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్14 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాడు మూడు దేశాల పర్యటనకు వెళ్తున్నారు. ఈనెల 15-16 తేదీల్లో సైప్రస్ లో పర్యటిస్తారు. 16-17 తేదీల్లో కెనడాలోని జీ-7 సదస్సులో పాల్గొంటారు. 18న క్రొయేషియా లో పర్యటిస్తారు. కేంద్ర విదేశాంగ శాఖ శనివారంనాడు ఈ వివరాలను వెల్లడించింది. ఎంఈఏ వివరాల ప్రకారం, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ ఈనెల 15-16 తేదీల్లో ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. రెండు దశాబ్దాలుగా ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు మోదీ పర్యటన దోహదం కానుంది. అనంతరం కెనడాకు మోదీ బయలుదేరి వెళ్తారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో మోదీ పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి. సదస్సు సందర్భంగా పలు ద్వైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని పాల్గొంటారు. ప్రధాని తన పర్యటన చివర్లో క్రొయేషియాలో పర్యటిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాని పర్యటన ఒక మైలురాయి కానుంది. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు రెడీ

**న్యూఢిల్లీ,జూన్14 (జనంసాక్షి) :** ఇండియన్ ఆస్ట్రోనాట్ గ్రూపు కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 19వ తేదీన ఆయన అంతరిక్ష ప్రయాణం చేయనున్నారు. ఫాల్కన్ 9 రాకెట్‌లో ఇంటర్‌నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లనున్నారు. అక్కడే 14 రోజుల పాటు ఉండనున్నారు. ఈ రాకెట్ గత నెలలోనే అంతరిక్షంలోకి వెళ్లాల్సి ఉండింది. అయితే, పలు కారణాల వల్ల ఐదుసార్లు ప్రయాణం వాయిదా పడింది. అన్ని అవరోధాలను దాటుకుని మరికొన్ని రోజుల్లో ఫాల్కన్ 9 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. ఫాల్కన్ 9 అంతరిక్ష ప్రయాణంపై ఇస్రో ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'ఫాల్కన్ 9లో లిక్విడ్ ఆక్సిజన్ లీకేజ్ సమస్య ఉందని గుర్తించాము. దాన్ని సరిచేశాము. జూన్ 19వ తేదీన ఫాల్కన్ అంతరిక్షంలోకి వెళ్లనుంది' అని పేర్కొంది. త్వరలో ఫాల్కన్ 9 రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళుతున్న శుభాన్షు శుక్లాకు నాసా మాజీ ఆస్ట్రోనాట్ 64 ఏళ్ల డాక్టర్ విట్సన్ సాకారం అందిస్తున్నారు. డాక్టర్ విట్సన్‌కు 650 రోజులు అంతరిక్షంలో ఉన్న అనుభవం ఉంది. ఆమె శుభాన్షుకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఒక వేళ శుభాన్షు విజయవంతంగా అంతరిక్షంలోకి వెళితే.. ఆయన పేరిట రికార్డు నెలకొననుంది. భారతదేశం నుంచి అంతరిక్ష ప్రయాణం చేసిన రెండో వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారు. 1984లో మొదటి సారి భారత్‌కు చెందిన రాకేష్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు.

## కాళేశ్వరం ఓ పనికిరాని ప్రాజెక్ట్

- దానికోసం డబ్బులు వృథా చేయరాదు :
- విమర్శలు గుప్పించిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

**హన్మకొండ,జూన్14 (జనంసాక్షి) :** ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరానికి అన్నీ తానే అన్న మాజీ సిఎం కెసిఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఎల్లంపల్లి ద్వారానే పంటలకు నీళ్లు అందుతున్నాయని తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు కూనంనేని సాంబశివరావు. కేంద్రప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోందని, మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. తాజాగాకూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో.. తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెలకు రూ.8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## వరుసగా రెండోరోజూ ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

### జలుబు తదితర కారణాలతో వైద్య పరీక్షలు

**హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్న కెసిఆర్ ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. శుక్రవారం కూడా ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న కెసిఆర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు- నందీనగర్ నివాసంలో కేసీఆర్ ఉండనున్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి కేసీఆర్ తరచుగా వెళ్తుండేవారు. అయితే ఈసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. నిన్న సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసం నుంచి హైదరాబాద్ వచ్చిన కేసీఆర్.. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించారు. మళ్లీ ఈరోజు కూడా రావాల్సిందిగా వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నేడు ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసంలోనే ఉంటు-న్నారు. అందుబాటు-లో ఉండాలని వైద్యులు చెప్పిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోనే ఉండనున్నారు. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈనెల 11న మాజీ సీఎం హాజరైన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తనకు జలుబు ఉందని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు చెప్పారు. ఓపెన్ కోర్టులో విచారణ వద్దని కేసీఆర్ కోరగా.. ఆయన వినతిని పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్ బహిరంగ విచారణను రద్దు చేశారు. ఇండోర్‌లోనే కేసీఆర్‌ను కమిషన్ ముఖాముఖిగా విచారించింది. ఇక అప్పటి నుంచి కూడా అనారోగ్యంతో కేసీఆర్ బాధపడు తున్నారు. ఈ క్రమంలో వైద్యపరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్ వెళ్లారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే పద్మ పురస్కారాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన వారు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 2025 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు/సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార పోర్టల్ https://awards.gov.in ద్వారా స్వీకరిస్తారు. నామినేషన్లను జులై 31 లోగా పోర్టల్ లో వున్న ఫార్మాట్ లో దరఖాస్తు చేసుకోవాలి.

## నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు

### వేగంగా పనులు పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్

**హైదరాబాద్:** నగరంలోని నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని, నాలా ఆక్రమణలుంటే తొలగించాలన్నారు. శుక్రవారం చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. చింతలబస్తీలో మూడ్రోజుల క్రితం తొలగించిన నాలా ఆక్రమణల కింద భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించాలన్నారు. శంకర్ పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూకాలనీ, షేక్ పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హఖీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలటరీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వరదనీరును తీసుకువస్తుంది.

## కన్నుల పండువగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం

(ప్రముఖులు బాలకృష్ణ, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, నాగ్ అశ్విన్, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరు లు సందడి చేశారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. మెమెంటోతోపాటు నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందించారు.

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్
ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్
ప్రథమ ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ
ద్వితీయ ఉత్తమ చిత్రం: పొట్టేల్
తృతీయ ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్
ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: ఆయ్: మేం ఫ్రెండ్సండీ
ఉత్తమ సహాయ నటుడు: ఎసే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్య (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిధ్ శ్రీరామ్: ఊరు భైరవ కోన (నిజమే నే చెబుతున్నా)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్: పుష్ప2 (సూసేకి అగ్గిరవ్వ మాదిరి..) (హాజరు కాలేదు)
ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేష్ ఆచార్య (దేవర-ఆయుధపూజ)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రఫీ: చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్స్టర్)

**స్పెషల్ అవార్డ్స్**

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు : నందమూరి బాలకృష్ణ
పైడి జైరాజ్ అవార్డు: మణిరత్నం
బీఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డు: సుకుమార్
నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు అట్లూరి పూర్ణ చంద్రరావు
కాంతారావు ఫిల్మ్ అవార్డు: విజయ్ దేవరకొండ
రఘుపతి వెంకయ్య అవార్డు: యండమూరి వీరేంద్రనాథ్

ఈ సందర్భంగా జ్యూరీ కమిటీనీ సత్కరించారు. మురళీ మోహన్, జయసుధ తదితరులు పురస్కారాలు అందుకున్నారు. వేదికపై పలువురు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను మెప్పించాయి.

## మధ్యప్రదేశ్‌లో నలుగురు మావోయిస్టుల మృతి

భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహి స్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయి స్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టు-కోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారం టూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు- తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయి స్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మవోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు- కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

## విచారణకు ఐదుగురు సభ్యుల కమిటీ


### విమాన ప్రమాద ఘటనపై వివిధ రంగాల నిపుణులతో ఉన్నతస్థాయి దర్యాప్తు



- బ్లాక్‌బాక్స్ విశ్లేషించాక అసలు విషయాలు గుర్తింపు
- భవిష్యత్‌లో ప్రమాదాలు జరక్కుండా లోతుగా అధ్యయనం
- కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, జూన్14 (జనంసాక్షి) :** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన దుర్ఘటనను పౌర విమాన యాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రత పై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం దిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టినట్లు తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే మంటలార్పి.. మృతదేహాలను అక్కడి నుంచి తరలించాం. దుర్ఘటనపై విచారణకు తక్షణమే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే మరికొంత మంది సభ్యులనూ బృందంలో చేరుస్తాం. శుక్రవారం సాయంత్రం ఘటనాస్థలిలో బ్లాక్సబాక్స్ దొరికింది. దానిని విశ్లేషించిన తర్వాత ఏం జరిగిందనేది పూర్తిగా తెలుస్తుందని అన్నారు. అందులో ఏముందో తెలుసుకునేందుకు మేమూ ఆతృతగా ఎదురుచూస్తున్నాం. దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాల బాధను అర్థం చేసుకోగలను. నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. ఆ బాధ నాక్కూడా తెలుసు. హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. ప్రత్యేక అధికారులతో, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ సభ్యులు దోహదపడతారు. నిపుణుల విచారణ పూర్తయ్యాక తగిన సమయంలో మీడియాకు సమాచారమిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని భావిస్తున్నాం. అంతేకాకుండా బోయింగ్ 787 సిరీస్‌ను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని.. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటు-ంబం అనుభవించే బాధ తనకు ప్రత్యేకంగా తెలుసన్నారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాదం స్థలాన్ని పరిశీలించాను. గుజరాత్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని... అందులో ఉన్న సమాచారం కీలకంగా మారనుందని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం రానున్న రోజుల్లో కీలకమని చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో కమిటీ- వేసినట్లు- తెలిపారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రెటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్లు చెప్పారు. విమానాశ్రయం నుంచి 2 కి.మీ దూరం వెళ్లిన తర్వాత.. 650 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడే విమానం కూలిపోయినట్లు- పౌరవిమానయాన శాఖ కార్యదర్శి తెలిపారు. అహ్మదాబాద్ ఏటీసీకి పైలట్ మేడే కాల్ ఇచ్చారు. విమాన సిబ్బందిని ఏటీసీ సంప్రదించినా స్పందన రాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయబృందాలు ఘటనాస్థలికి చేరాయి. రెండు గంటల్లో ఉన్నతాధికారుల బృందమంతా ఘటనాస్థలికి చేరుకుంది. గుజరాత్ ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించింది. సాయంత్రం 6 గంటలయ్యేసరికి అగ్నిమాపక శాఖ మంటలార్పేసింది. ఎస్‌వోపీ ప్రకారం.. తక్షణమే విచారణకు ఆదేశాలు ఇచ్చాం అని ఆయన వివరించారు. అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన యవత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రమాదంలో మొత్తం 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు.

## బనకచర్ల -గోదావరి పిఎఫ్ఆర్‌ను తిరస్కరించండి



ఆమోదించినట్లు భావించాల్సి వచ్చిందన్నారు. ఇందుకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్ సమర్పించడం అంటే కేంద్ర జల వనరుల సంఘం ఆమోదించి నట్లు అవుతుందా అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబాటు తనాన్ని అడ్డు పెట్టుకుని ప్రాజెక్ట్ కోసం కేంద్రాన్ని నిధుల కోసం వత్తిడి చేసిన అంశాన్ని జనవరి 22,2025 న కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ తో పాటు ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ కు లేక రాసిన సందర్భన్నీ ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు కోసం 2024, నవంబర్ 15 న,డిసెంబర్ 29 న కేంద్రప్రభుత్వాన్ని ఆశ్రయించారన్నారు. మొత్తం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం 80,113 కోట్లు కాగా గోదావరి నుండి కృష్ణా వరకు 13,511 కోట్లు అవుతుందని,క్రిష్ణా నుండి బొల్లపల్లి రిజర్వాయర్ కు 28,560 కోట్లు ఖర్చు అవుతుందని ఆయన ఆ లేఖలో వివరించారు. అదేవిదంగా బోళ్లపల్లి నుండి బనకచర్ల హెడ్ రెగ్యులెటరీకీ 38,041 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. కేంద్ర జలవనరుల కమిషన్ తో పాటు గోదావరి-కృష్ణా నది బోర్డులు 9ఏపేక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఈ ప్రాజెక్టు ప్రక్రియ ముందుకు సాగిందని ఆయన మండిపడ్డారు. జీ. డబ్ల్యూ.డి.టి అవార్డు ప్రకారం చూసినా 1,486 టి.యం.సి లలో 968 టి.యం.సి లు తెలంగాణా కు కేటాయించ బడ్డాయని,ఈ నీటి వాటలలో తెలంగాణా కేటాయింపులకై కేంద్ర జల వనరుల సంఘం,గోదావరి నది మేనేజ్మెంట్ బోర్డు ఆమోదం కోసం వేచి చూస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టుల ను ఎలా ప్రతి పాదిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టులు నిర్మించే నైతికత ఆంధ్రప్రదేశ్ కు ఎక్కడిదని ఆయన నిలదీశారు. వాస్తవానికి గోదావరి నది జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్ ప్రకారం వరద నీరు అనే ప్రస్తావన లేనే లేదని ఉంటే గింటే నది సరిహద్దుల్లో ఉండే రాష్ట్రాలకు సరి సమాన హక్కు ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ ఇచ్చిన లేఖలో సైతం ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలు మాకు అందలేదు అని రాసిన లేఖను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ఉటంకించారు. కేంద్ర జలవనరుల సంఘము మార్గదర్శాకలు ట్రిబ్యునల్ నిర్ణయాలు అంతర్ రాష్ట్ర ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసు కుంటామాన్నారు. అయితే అదే సమయంలో కేంద్రం తీసుకునే నిర్ణయాలు తెలంగాణా ప్రాంతాన్ని గందరగోళంలోకి నెట్టి వేస్తున్నాయాని నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై జోక్యం చేసుకుని టెండర్ల ప్రక్రియను నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే జరిగితే తెలంగాణ రాష్ట్రం పై జరిగిన దాడి గా పరిగణించడంతో పాటు న్యాయబద్ధంగా జరగాల్సిన నీటి కేటాయింపులకు భగ్నం వాటిల్లె ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

# జనంసాక్షి ఎడిటర్ రహమాన్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలి

- జగిత్యాల జిల్లాలో జర్నలిస్టుల నిరసన



జగిత్యాల (జనంసాక్షి) : జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా తాహసిల్ చౌరస్తా వద్ద శనివారం రోజున జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రెస్ క్లబ్ నుండి తాహసిల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు జిల్లా అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి చీటి శ్రీనివాసరావు మురపల్లి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘటనతో ఏటువంటి సంబంధంలేని జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటాన్ని జనంసాక్షి పత్రికలో కథనాలు ప్రచురిస్తే ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పుడు ఫిర్యాదు ఇచ్చి, అక్రమంగా ఎడిటర్ పై కేసులు పెట్టారన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కటం ఏమిటని మీడియా సభ్యులు మండిపడ్డారు. తక్షణమే జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి లతోపాటు పాత్రికేయులు పాల్గొన్నారు.

# నూనె శ్రీధర్ కేసులో కూపీ లాగుతున్న ఎసిబి

- ఉన్నతాధికారి ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు గుర్తింపు



హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) : అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన కాళేశ్వరం ఎస్‌ఈసీ నూనె శ్రీధర్ వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నూనె శ్రీధర్ వ్యవహారంలో మరి కొంతమంది ఇరిగేషన్ అధికారుల పాత్ర ఉన్నట్టుగా ఏసీబీ దర్యాప్తులో బయటపడింది. 2024 జూన్ 27న నూనె శ్రీధర్‌ను ఇరిగేషన్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఆదేశించారు. అయితే ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలను కూడా నూనె శ్రీధర్ పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ కూడా ఏడాది పాటు చొప్పదండిలోనే ఈఈగా శ్రీధర్ పని చేస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈఎన్‌సీ అనిల్ ఆదేశాల మేరకే శ్రీధర్ అక్కడే పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూనె శ్రీధర్‌కు ఈఎన్‌సీ అనిల్‌కు ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఇరిగేషన్ చీఫ్‌గా ఉండి ప్రిన్సిపాల్ సెక్రటరీ చేసిన ట్రాన్స్‌ఫర్‌ను కూడా ఆపినట్టు– అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నూనె శ్రీధర్‌ను కస్టడీకి తీసుకుని విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అలాగే ఈఎన్‌సీ అనిల్ పాత్రపైనా ఏసీబీ విచారణ జరిపే అవకాశం ఉంది. అక్రమాస్తుల కేసులో నూనె శ్రీధర్‌ను ఏసీబీ అరెస్ట్ చేయగా.. ఆయన చంచల్ గూడ జైలులో ఉన్నారు. శ్రీధర్‌కు సంబంధించిన అంశాలపై ఏసీబీ అధికారులు చాలా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎవరెవరితో సత్సంబంధాలు ఉన్నాయి, ఇరిగేషన్ శాఖ అధికారులతో నూనె శ్రీధర్‌కు ఉన్న సంబంధాలు ఏంటి.. ఇతనికి ఎవరైనా సహకారం అందించారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల శ్రీధర్‌కు సంబంధించి సుమారు 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో కీలకమైన పత్రాలు, ఆస్తుల చిట్టాను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎంతో గ్రాండ్‌గా శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపించారు. హైదరాబాద్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్లు నిర్వహించగా.. థాయిలాండ్‌లో వివాహం జరిపించారు. ఇందుకోసం శ్రీధర్ కోట్లు కుమ్మరించినట్లు తెలుస్తోంది. అయితే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు ఇంత భారీ మొత్తంలో ఆస్తులు, ఆదాయం ఎలా సమకూరింది అనే అంశాలపై ఏసీబీ దృష్టి సారించింది.



## కాంగ్రెస్ తోనే రాజ్యాంగ పరిరక్షణ

- మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ (జనంసాక్షి) : భారత రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు సంగినేనిపల్లి గ్రామంలో మంత్రి జూపల్లి పాదయాత్ర చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి, పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రోగ్రామ్ ను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని విలువలను గౌరవిస్తూ.. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుందని చెప్పారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజలను చైతన్య పరిచారని తెలిపారు. భారత జాతి ముద్దుబిడ్డ డా.బీఆర్, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే అందరికి సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు.

# ఇజ్రాయిల్ మారణహోమ యుద్ధాన్ని తక్షణమే ఆపాలి

- 19న పాలస్తీనా సంఘీభావ దినాన్ని జయప్రదం చేయండి
- వామపక్ష పార్టీల డిమాండ్



హైదరాబాద్ (జనంసాక్షి) : ఇజ్రాయిల్ మారణహోమ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని,, 19న పాలస్తీనా సంఘీభావ దినాన్ని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వామపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. ఈ సమావేశానికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షత వహించారు. సిపిఐ నుండి పశ్య పద్మ, సిపియం నుండి జూలకంటి రంగారెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రమేష్‌రాజా, ఎస్‌యుసిఐ (సి) మురహరి పాల్గొన్నారు. 20 నెలలుగా గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ నిరంతర బాంబు, వైమానిక దాడులకు పాల్పడుతున్నది. మారణహోమాన్ని సృష్టిస్తూ యుద్ధానికి పూనుకున్నదని, ఇప్పటికే దాదాపు 50వేల మంది మరణించారు. మౌలిక సదుపాయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, మహిళలు, పిల్లలు, శరణార్థుల ఆశ్రయాలను లక్ష్యంగా చేసుకుని వేలాదిమందిని పొట్టన పెట్టుకుంటున్నదని, కనీసం ఆహారాన్ని అందించడానికి కూడా ఆటంకాలు కల్పిస్తున్నదని తెలిపారు. ఐక్యరాజ్య సమితితో పాటు, ప్రపంచవ్యాపితంగా ఈ దుశ్చర్యను వ్యతిరేకిస్తున్నా, అమెరికా దాని కొన్ని మిత్రదేశాల మద్దతుతో ఇది కొనసాగిస్తున్నదని, దీంతోపాటు ఇటీవల ఇరాన్‌పై కూడా యుద్ధాన్ని ప్రకటించి భీభత్సం సృష్టిస్తున్నది. అంతర్జాతీయ చట్టం, మానవహక్కులు కాలరాస్తున్నదని తెలిపారు. ఈ దురహంకార మారణహోమ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని, ఇజ్రాయిల్‌తో అన్ని సైనిక మరియు భద్రతా సహకారాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించాలని అఖిలభారత వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ పిలుపు మేరకు వామపక్ష పార్టీలు, ప్రపంచశాంతిని కోరుకునే ప్రజాస్వామ్య,లౌకిక శక్తుల పిలుపు మేరకు దేశవ్యాపితంగా ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశాయి.

## రక్తదాన ప్రోత్సాహంలో విశేష సేవలు

- పెద్దపల్లి ఎసిపి గజ్జికృష్ణకు మోటివేటర్ అవార్డు
- గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందజేత



పెద్దపల్లి, జూన్14 (జనంసాక్షి) : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఏసీపీగా గజ్జి కృష్ణ యాదవ్ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు– చేయడంతో పాటు– రక్తదాతలను ప్రోత్సహించడం, ఆయన గతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ– సిఫారసు మేరకు రాజ్ భవన్ వర్గాలు ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ సేవలను గుర్తించి, బెస్ట్ మోటివేటర్ అవార్డుకు ఎంపిక చేయడంతో ప్రజలకు విశేష సేవలు అందించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ కు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## బస్సును ఢీకొన్న రెడ్ మిక్స్ వాహనం

- పలువురికి గాయాలు

ఖమ్మం, జూన్14 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్రిగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్‌టిసి బస్సు– రెడీమిక్స్ వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఇరువురు డ్రైవర్లకు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలు రోడ్డు ఇరువైపులా ఉండడంతో తీవ్ర ట్రాఫిక జామ్ ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ఎమ్మెల్యే వంటమనిషి ఆత్మహత్య

యాదగిరిగుట్ట, జూన్14 (జనంసాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో సైదాపురం గ్రామానికి చెందిన రవి (38) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను ఎమ్మెల్యే ఐలయ్య ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తూ పై అంతస్థులోనే ఎన్నో ఏళ్లుగా ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడు రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని స్థానికులు తెలిపారు.

## పాదురు శ్రీనివాస్‌రెడ్డి సేవలు ఎనలేనివి : ఎంపీ చామల

నల్లగొండ(జనంసాక్షి) : రిటైర్డ్ విద్యాధికారి, దివంగత పాదూరి శ్రీనివాస్ రెడ్డి సేవలు ఎనలేనివని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని చంద్రగిరి విల్లాస్‌లో పాదూరి శ్రీనివాస్‌రెడ్డి దశ దిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. శ్రీనివాస్ రెడ్డి మండల విద్యాధికారిగా, ప్రధానోపాధ్యాయుడిగా అనేక సేవలందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు కొనియాడారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుంది

- కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా



సిద్దిపేట, జూన్14 (జనంసాక్షి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెదక్ జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే సిద్దిపేట రంగదాంపల్లి వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు మంత్రి వివేక్ వెంకటస్వామి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ శ్రేణులు మెదక్ జిల్లాలో ఇంతటి ఘనస్వాగతం పలకడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. సన్నబియ్యం, నూతన రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై అపూర్వ స్పందన వస్తోందని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికలనూ దృష్టిలో పెట్టు–కొని గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని అన్నారు. విభేదాలను పక్కన పెట్టి సమస్యలు పరిష్కారం చేసుకుందామని కోరారు. సిద్దిపేటలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మాటిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుందాం, వారానికి ఒక్కసారి సిద్దిపేటకి వస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.

# వరుసగా రెండోరోజూ ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

- జలుబు తదితర కారణాలతో వైద్య పరీక్షలు



హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్న కెసిఆర్ ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. శుక్రవారం కూడా ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న కెసిఆర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు– నందీనగర్ నివాసంలో కేసీఆర్ ఉండనున్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి కేసీఆర్ తరచుగా వెళ్తుండేవారు. అయితే ఈసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. నిన్న సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసం నుంచి హైదరాబాద్ వచ్చిన కేసీఆర్.. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించారు. మళ్లీ ఈరోజు కూడా రావాల్సిందిగా వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నేడు ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసంలోనే ఉంటు–న్నారు. అందుబాటు–లో ఉండాలని వైద్యులు చెప్పిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోనే ఉండనున్నారు. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈనెల 11న మాజీ సీఎం హాజరైన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తనకు జలుబు ఉందని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు చెప్పారు. ఓపెన్ కోర్టులో విచారణ వద్దని కేసీఆర్ కోరగా.. ఆయన వినతిని పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్ బహిరంగ విచారణను రద్దు చేశారు. ఇండోర్‌లోనే కేసీఆర్‌ను కమిషన్ ముఖాముఖిగా విచారించింది. ఇక అప్పటి నుంచి కూడా అనారోగ్యంతో కేసీఆర్ బాధపడు తున్నారు. ఈ క్రమంలో వైద్యపరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్ వెళ్లారు.

# గద్దర్ అవార్డులు-పొరపాట్లు

**'రజాకార్ సినిమా' తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించిన సినిమా అనీ, మత ఘర్షణలను ఉసిగొలిపేలా ఉన్నదనీ, ప్రముఖ సామాజిక రచయితలు, చరిత్రకారులు తమ వ్యాసాల్లో ఉపన్యాసాల్లో విశ్లేషించారు. అలాంటి సినిమాకు ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం, చారిత్రక సినిమా విభాగంలో రాష్ట్ర ప్రభుత్వ అవార్డును ప్రకటించి అవార్డు ఇస్తున్నప్పుడు.. ఆ వక్రీకరించిన చరిత్ర వాస్తవమేనని, ప్రభుత్వమే నిర్ధారించినట్లు కాదా? పైగా గద్దర్ లాంటి విప్లవకారుడి పేరుతో ఈ అవార్డు ఇవ్వడం, సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు? దేశంలోనే మాది లౌకిక పార్టీ అని చెప్పుకునే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం,ఈ విధంగా, ఈ విషయంలో ఇలా వ్యవహరించడం, చారిత్రక తప్పిదమే అవుతుంది!**

"పుష్ప 2" సినిమాలో స్మగ్లర్ పాత్ర పోషించి, అశ్లీల అంశాలలో లీనమై, పోలీస్ అధికారులను కించ పరిచిన పాత్రధారికి రాష్ట్రం అవార్డు రావడం తో ప్రభుత్వం యువతకు ఏ సంకేతం ఇద్దాం అనుకుంటున్నది? ఏ మార్గం చూపుతుంది ? ఇది అక్రమాన్ని, దుర్మార్గాన్ని, అవినీతిని, ప్రేరేపిస్తున్నట్లు కదా? బాధ్యతా యుతమైన పోలీస్ వ్యవస్థను కించపరిచినట్లు కాదా? ప్రభుత్వాలు ఇలాంటివాటి కోసం అవార్డులు ప్రకటిస్తే నేర ప్రవృత్తిని ప్రోత్సహించినట్లే కదా? ఇది అవార్డుల నిబంధనలకు విరుద్ధం!! ఇది దేనికి సంకేతం??

బెస్ట్ క్రిటిక్ ఎంట్రీ ఏ రాలేదని, ఆ విభాగానికి అవార్డు లేదని ప్రకటించి, హఠాత్తుగా ఒక రోజు ముందు బెస్ట్ క్రిటిక్ 'పొన్నం రవిచంద్ర' అని డిక్లేర్ చేయడం సబబా? ఇది చూస్తుంటే ఏవిధంగా, ఏ అండర్ స్టాండింగ్ తో అవార్డులు పంచేసుకున్నారో అర్థం అవుతూనే ఉన్నది. ఉర్దూ సినిమాలకు కూడా అవార్డులు ప్రకటిస్తాం అన్న మీరు, ఉర్దూ భాష తెలిసిన వారితో జ్యూరీ కూడా ఒకటి పెట్టాలికదా? 10 సంవత్సరాల అవార్డులలో ఉర్దూ సినిమాల వారికి అవార్డులు ఎందుకు ప్రకటించలేదు?

2024 సంవత్సరం లో తీసిన సినిమాలకు దరఖాస్తులను ఆహ్వానించి, 2014 నుండి 2023 వరకు ఎంపికచేసే సినిమాలకు దరఖాస్తులు ఎందుకు సేకరించలేదు? ఒకవేళ సెన్సార్ అయిన దాదాపు 2000 సినిమాలను ఒక్క నెలలోనే ఎలా చూసారు? సినిమాలను చూడకుండా ఎంపికచేయడం, చట్ట విరుద్ధం కాదా? ఇష్టం వచ్చినోళ్లకు ఇస్తామొచ్చినట్లు ఇచ్చుకున్నట్లే కదా? ఇది ఎంత అన్యాయం! ఆ పది సంవత్సరాలు సినిమాల్లో పనిచేసిన కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అవార్డులు ఇవ్వకుండా వట్టి నిర్మాతలకే ఎందుకు ఇచ్చినారు? అవార్డుల లక్ష్యం కళాకారులను ప్రోత్సహించడానికే కదా? వారిని విస్మరించి, పెట్టుబడిదారులకు మాత్రమే ప్రజా సొమ్మును ఎందుకు ధారపోసినట్లు? టీఎఫ్డీసీ చైర్మన్ నిర్మాత కాబట్టేనా? ఇందులో ఏం మతలబు ఉన్నదో తెలియాలి? పదేండ్లు వివిధ శాఖల్లో పనిచేసిన సినీ కళాకారులకు సమాధానం చెప్పాలి. టీఎఫ్డీసీ చైర్మన్ కి సంబంధించిన నాలుగు సినిమాలు ఎంపిక చేసుకునుడు ఏంది? సినిమాల్లో పనిచేసిన వాల్లే జ్యూరీలో ఉండడం, వారి సినిమాలకు వారే అవార్డులు ఇచ్చుకోవడం ఎంత అన్యాయం. నిబంధనలకు విరుద్ధం. అవార్డులకు అరహత కలిలిగిన ఎన్నో సినిమాలు ఉన్నాయి. వాటిని ఎందుకు చూడలేదు జ్యూరీ కమిటీలు? అన్ని గన%శీ% సినిమాలు 15 - 20 రోజుల్లో చూడడం ఎలా సాధ్యమౌతుంది? అవకతవకలు జరిగినట్లే కదా? మీరు ఎంపిక చేసిన విధానం, ఎంపికైన సినిమాలే ఈ వ్యవహారానికి సాక్ష్యాలు. ఇలాంటి తొందరపాటు నిర్ణయాలవల్ల, ప్రభుత్వ ఖజానా తో ఒక జిగేల్ మనిపించే కార్యక్రమం చేసుకోవచ్చు కానీ, దానికి తగిన ఫలితం కన్నా ప్రజల్లో వ్యతేరేకతనే కొని తెచ్చుకుంటున్నారు. అవసరమా ఇదంతా? తెలంగాణ తెచ్చుకున్నందుకు తెలంగాణా సినిమా పాలసీ తయారు చేసుకొని, మంచి కళాత్మక సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించాక, బహుమానాలు ఇచ్చుకునే పని పెట్టుకుంటే బాగుంటది.



తెలంగాణా కళాకారుల పారలల్ సినిమాలే లేవు, గద్దర్ స్ఫూర్తికి నిదర్శనమయ్యే సినిమాలే లేవు. మీదికెల్లి, ఎవరి పేరు మీద ఐతే అవార్డులున్నాయో, ఆయనకు, తీసుకునే వాళ్లకు, ఏమన్నా సంబంధం ఉన్నదా అసలు ? నా సద్విమర్శను నిమ్మళమైన మనసుతో ఒకసారి ఆలోచించుకోండి. మీ శ్రేయోభిలాషిని కాబట్టే, తెలంగాణను ప్రేమించే వాడిని కాబట్టే నా ఈ ఆవేదన!

**-రఫీ, ఫిల్మ్ డైరెక్టర్**

## మా బంగారుదైవం

గుండెల్లో రగిలే అగ్గిరవ్వల్ని
హిమ శకలాలుగా మార్చి
తియ్యని లడ్డూలా
కన్న బిడ్డల కడుపు నింపే
నిత్య శ్రామికుడు

తను చిరిగిన చొక్కా వేసుకుని
పిల్లల్ని రంగవల్లుల్లా చూడాలని
రంగు రంగుల అంగీలు కుట్టించి
చూసి మురిసిపోయే ఆనందుడు

తనేమో జోళ్ళు వేసుకోకుండా
చిన్నారుల పాదాలు కందకుండా
భుజాలపై పల్లకీలా మోసే సేవకుడు

పిల్లలు తింటుంటే చూస్తూ
వారి ఆనందాన్ని అన్నంగా భావిస్తూ
తన ఉదరం నింపుకునే ఉదారుడు

ఎన్నెన్ని కష్టాలు అవాంతరాలెదురైనా
ప్రతీక్షణం పిల్లల సంక్షేమం కోసం
తాను కొవ్వొత్తిలా కరుగుతూ
వెలుగులు పంచే దివ్యదీపుడు.

**రచన : నాగముని.యం (నాగ్)**
**9490856185**
**గుత్తి. ఆర్.యస్,**
**అనంతపురం జిల్లా**
**ఆంధ్రప్రదేశ్**

## చదువులమ్మ ఒడి

సర్కారు బడి చదువులమ్మ ఒడి
సర్కారు బడి సకల సౌఖ్యాల బడి
ప్రతి బడి ఓ ఆశల కుటీరం
ప్రతి విద్యార్థి వెలుగుకు కారకం!!

మన ఊరు సర్కారు బడి
ఆటపాటల నాట్యాల బడి
ప్రకృతి ఒడిలో ప్రగతి వైపు బడి
సరస్వతి నిలయం సర్కారు బడి!!


విద్యా ప్రగతికి సోపానం
జ్ఞానాలయాలు సర్కారు బడి
ప్రభుత్వ బడులు ప్రగతికి సోపానాలు
పైసల లేకుండా ప్రగతి బడి!!

బడిబాట భవిష్యత్తుకు బాట
బడిబాట భావితరాలకు బాట
ప్రభుత్వ పాఠశాల ప్రగతి బాట
శత శాతం ఉత్తీర్ణత బడి
సక్సెస్ బడి సర్కారు బడి!!

**దేవులపల్లి రమేశ్**
**నంగునూర్, సిద్దిపేట**
**9963701294**

# ప్రజాస్వామిక పరిపాలనలో ఎదురుదెబ్బలు తప్పవు

**ప్రజాస్వామిక రాజ్యాంగ వ్యవస్థలో ప్రభుత్వ పరిపాలన వ్యవహారం ఎత్తు పల్లాలతోనూ, విమర్శలు, ఎదుర్కొనడం పరిపాటి అయినప్పటికీ. ప్రభుత్వం ప్రజాస్వాంబిక వ్యవస్థ అన్న ఆలోచనలో ప్రజా రంజకమైన పరిపాలన వ్యవస్థను రూపొందించుకొని ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామిక పాలన వ్యవస్థలో రాజకీయ విమర్శలు ఎదురు కాక తప్పదు. అయితే వీటిని సద్వినియోగం చేసుకొని ప్రజా అభిప్రాయాల మేరకు పాలనను కొనసాగించాలి. కేవలం మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రభుత్వాలు ముందుకు పోతే ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగానే గౌరవిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పాలకులు ప్రతిపక్షాలను గౌరవిస్తూ విమర్శలు ప్రతి విమర్శలు స్వీకరిస్తూ ప్రజలకు మేలు చేసే పరిపాలన విధానాన్ని కొనసాగించాలి. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ ముఖ్యంగా వ్యవసాయరంగాన్ని కాపాడాల్సిన బాధ్యత రైతును రాజులు చేసే పరిపాలన వ్యవస్థ కావాలని ప్రజలు అంటున్నారు.**




ప్రజలను పాలించే ప్రభుత్వం ఏ రూపంలో ఉన్న భిన్న అభిప్రాయాలు, విమర్శను ప్రజలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల నుండి ఎదుర్కొనక తప్పదు. సమాజంలో అన్ని వృత్తుల లాగానే పాలకులుగా ప్రజల మధ్యకు వచ్చే వివిధ ప్రజాప్రతినిధులు కూడా ప్రజల మధ్యన ప్రజల కోసం పనిచేయవలసిన ఒక వృత్తి కళాకారులు గానే భావించాలి. ఒక నాటకంలో పాత్రధారులు తన పాత్రకు సహజ సిద్ధమైన రీతిలో న్యాయం చేస్తున్నారా లేదా అని గమనించేవాళ్లు ప్రేక్షకులు అలాగే పాలకులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేసే క్రమములో నిష్పక్షపాతంగా నిబద్ధతతో వ్యవహరిస్తున్నారా లేదా అని నిర్ణయించేది ప్రజలే. అందుకే ప్రజలంటే ప్రభువులు ప్రజల కేంద్రంగా సాగేదే పాలన అని ప్రజలతో పాటు పాలకులు కూడా అంగీకరించి తీరాలి. లేకుంటే సముద్రంలో ప్రవాహానికి ఎదురు ఈది నట్లే అనుకోని ఆపదలను కోరుకునే తెచ్చుకోవడమే అవుతుంది.

**ప్రభుత్వ వైఫల్యాలకు కొన్ని బలమైన కారణాలు :**

ఆర్థికంగా సహజంగా వనరుల పరంగా ప్రాంతాల మధ్య అభివృద్ధిలో తేడా ఉండే అవకాశం ఉంటుంది మొత్తం మీద నాయకత్వం సమర్థవంతమైనదైతే ప్రజల భాగస్వామ్యాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిపక్షాల సద్వి మర్శలను స్వీకరించి చట్ట సభలను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలు మెచ్చే పాలన అందించవచ్చు. కానీ ప్రధానంగా అధికార పార్టీకి సంబంధించినటువంటి వ్యవహారంలో అడుగడుగునా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నం ఆ పార్టీ నాయకులే చేయడాన్ని కూడా మనం గమనించవచ్చు. బలమైన ఒక వర్గం తమ వారికే బాధ్యతలు మంత్రి పదవులు రావాలని ఆశించే క్రమంలో రాజీనామాలకు కూడా తెగించే దుర్మార్గపు ఆలోచనతో ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రమాదాలు ఉన్నాయి. ఇది కూడా ప్రభుత్వ వైఫల్యానికి ప్రధాన కారణం. ఇక ప్రతిపక్షాలు కేవలం ఇచ్చిన హామీల పైననే విమర్శలు కుప్పించడం తప్ప సద్విమర్శ, సమాలోచన, విశ్లేషణ, రాష్ట్ర దేశ ప్రయోజనాల పైన లోతైన అవగాహన లేని కారణంగా అధికార పార్టీని బదనాం చేయడానికి చేసే ఎత్తుగడలు నిజమైన ప్రతిపక్ష పాత్ర అనిపించుకోదు ఇటీవల కాలంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఇష్టారాజ్యంగా సన్నాసి, వాడు, వీడు, దొంగ, బజారు మనిషి అంటూ ఒక ముఖ్యమంత్రిని పట్టుకొని మాట్లాడటం అపచారం కాదా! ప్రజలను ప్రభుత్వం మీదకి రెచ్చగొట్టే విధానాలను మానుకొని ప్రజల ఆకాంక్షల పైన శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తే తప్పులేదు ఇప్పటికీ ఉచిత విద్యా ఉచిత వైద్యం మీద సమగ్రమైన అవగాహన ప్రభుత్వ ప్రతిపక్షాలకు లేకపోవడం విచారకరం. నిబద్ధత ఉంటే ఈ రెండింటిని ఉచితంగా అందించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి చేస్తే ప్రజల సంతోషిస్తారు కానీ ఊకదంపుడు హామీలు అమలు చేయమని కోరడం అది కేవలం ఘర్షణ కోసమే తప్ప ప్రజల కోసం కాదు.

ఇక ప్రజల ఆకాంక్షలను ఆలోచనలను పెడచెవిన పెట్టిన ప్రభుత్వాలు వాళ్ల డిమాండ్లను పరిష్కరించకపోగా అనేక సందర్భాల్లో నిర్బంధాలతో హింసించిన సందర్భాలు ఉన్నాయి. ప్రజల పక్షాన పని చేస్తున్నటువంటి బుద్ధి జీవులు మేధావులు ప్రజాసంఘాలు, ఉద్యమకారులపై రోజూ కొనసాగుతూనే వుంది .ఆ రకంగా ప్రజలు ప్రజాస్వామ్యవాదుల అభిప్రాయాలను తృణీకరించడం కూడా ప్రభుత్వాలు విఫలం కావడానికి ప్రధాన కారణం. అంతేకాదు ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారి విధానానికి వంట పాడుతూ ప్రైవేటీకరణను పెంచి పోషించే ప్రభుత్వాలకు ప్రజలు ఎప్పుడూ కూడా శత్రువులు గానే కనిపిస్తారు. ఇది నిరంతర ఘర్షణకు, ఉద్యమాలకు,రాజ్యహింసకు దారితీస్తున్న విషయాన్ని పాలకులు ఇప్పటికైనా ఆలోచించాలి.

ఇక ప్రభుత్వాల బాధ్యతరాహిత్యం చెప్పనలవి కాదు. ఉదాహరణకు విద్యారంగంలో 59 ఏళ్ల క్రితం ఈ దేశంలో కామన్ స్కూల్ ప్రవేశపెట్టాలని కొఠారీ కమిషన్ సూచిస్తే ఇప్పటికి దిక్కులేదు. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిపోతే పేదలు ప్రైవేట్ రంగంపై ఆధారపడక తప్పడం లేదు. తద్వారా పేదలు తమ కొనుగోలు శక్తిని కోల్పోయి పేదరికం మరింత పెరిగిపోతున్నది. ఇది నిజంగా ప్రభుత్వాల యొక్క బాధ్యత రాహిత్యం, సామాజిక బాధ్యతను విస్మరించడం, పేద వర్గాలకు ద్రోహం చేయడం, సంపన్న వర్గాలకోసమే అన్నట్లవుతుంది.

విమర్శలకు అతీతంగా సుపరిపాలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు: ప్రధానంగా ఒక ప్రభుత్వం సఫలం కావాలంటే జన రంజక పరిపాలన అందించాలంటే రాజకీయ యంత్రాంగం తో పాటు ఉద్యోగ వర్గంలో కూడా అవినీతిని కూకటి వేళ్ళతో పెకిలించాలి. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ అవినీతి నిర్మూలన సంస్థలు మరింత స్వయంప్రతి పత్తిగా వ్యవహారించాలి. ముందు అవినీతికి దూరంగా ఉండాలని, ప్రజల సంపదకు తాము కాపలాదారులమని, ప్రజలే తమకు ప్రభువులని భావించి ఉద్యోగులు అవినీతిపరులైతే ఉక్కు పాదం మోపడానికి సిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే అవినీతికి తావులేని ప్రజలకు అనుకూలమైన పరిపాలన అందించడానికి అవకాశం ఉంటుంది. అక్కడ ప్రజలకు పీడనలేని స్వేచ్ఛ పరిస్థితులు లభిస్తాయి. ఇక పెట్టుబడిదారీ వర్గ స్వభావం ప్రభుత్వానికి ఉంటే సంపన్నులు కార్పొరేట్లకే వంత పాడే అవకాశం ఉంటుంది గత పది ఏళ్లలో భారతదేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగం నుండి బ్యాంకులు 16 లక్షల కోట్ల రూపాయలను మాఫీ చేసినా అది కేంద్ర ప్రభుత్వ కనుసనల్లో జరిగినదే కదా.!

పీడన, దోపిడీ, అణచివేత, ఆకృత్యాలు, అత్యాచారాలు, రాజ్య హింస, వివక్షత, పేదరికం విచ్చలవిడిగా కొనసాగుతూ ఉంటే అవేమీ తమకు పట్టనట్లు ప్రభుత్వాలు పేదరికం తగ్గిందని, 4వ ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో స్థానం సంపాదించుకున్నామని, భారతదేశ వెలిగిపోతున్నదని, బంగారు తెలంగాణ సా కారం అవుతుందని పాలకులు పదేపదే వల్లిస్తూ ప్రజలనుభ్రమల్లో ముంచుతారు. ఇది నిజంగా ప్రజల పట్ల ప్రభుత్వాలకు ఉన్న అమానవీయ ఆలోచనకు తార్కానం. మానవీయ సమాజాన్ని నిర్మించాలనుకున్నప్పుడు పాలకులలో మానవీయత, తోటి మనిషిని సాటి మనిషిగా చూసే స్వభావం అవసరం. ఆ క్రమంలో మానవత్వాన్ని చాటుకుంటేనే ప్రభుత్వానికి ఉనికి సాధ్యమని గుర్తించాలి లేకుంటే ఆ స్థాయిలో ప్రతిఘటన తప్పదని కూడా గుర్తిస్తే మంచిది. ఇక సామాజిక న్యాయాన్ని సాధించే క్రమంలో పాలకులు అనేక సామాజిక వర్గాల ఒత్తిడికి గురై మంత్రివర్గంలో రాజకీయ పార్టీలో కార్యవర్గంలో ఎక్కడ చూసినా ఆధిపత్య వర్గాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న విషయం, అది పరోక్షంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు ఆగ్రహం రావడానికి కారణం అవుతున్నది. మరికొన్ని చోట్ల మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు ఇప్పటికే మెజారిటీ సభ్యులు ఉన్న ఆ వర్గానికి అవకాశం ఇవ్వకపోతే సభ్యులు ఆ వర్గానికి చెందినటువంటి కార్యకర్తలు నాయకులు రాజీనామా చేస్తామని బెదిరించడం ఈ దేశంలో రివాజుగా మారింది. పదవుల కోసం కాదు ప్రజల కోసమే రాజకీయాలకు వచ్చినామని అంగీకరించే పార్టీ నాయకులు ఎవరైనా పార్టీ క్రమశిక్షణను అంగీకరించాలి. సామాజిక న్యాయాన్ని గుర్తించాలి పెట్టుబడిదారులమని, సంపద బాగా ఉన్నదని, పదవులు మాకే కావాలంటే తిరుగుబాటు తప్పదని గుర్తించాలి. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సమతూకంగా వ్యవహరిస్తే కొంతకాలం అధికారంలో ఉండే అవకాశం ఉంటుంది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

## ఓ నా నేస్తాలు

కుక్కలు కుక్కలు
అందమైన కుక్కలు
స్నేహానికి ప్రతీకలు
అందుకే విగ్రహాలు

వేట జాగీలాలు
వీధి సింహాలు
పోలీసు శ్వానాలు
కాపల కాలభైరవాలు
విశ్వాస గృహమృగాలు

శునకాల స్నేహం
విడదీయరాని బంధం
ఇంటికి నమ్మిన బంటు
జనజీవనంలో ఓ భాగం

శునకం తో భారతం మొదలు
నవలల్లో కథలల్లో
రకరకాల పాత్రలలో
రక్తికట్టించె కధనాలు

మాటలలో సజీవంగా దొర్లె
జనజీవన సామెతలు
మంచివి చెడ్డవి మరచిపోనివి
గుండెలకు తాకేవి మరి ఎన్నో

పొడవైన కాలభైరవాలు
కురుచైన జాగిలాలు
గిన్నిస్ రికార్డు పొందినవి
విశ్వమంతా విస్తరించినవి
గ్రామ సింహాలు

వివిధ పేర్లతో
వివిధ రకాలతో
వివిధ రంగులలో
తోట లోని పూల లాగ
అందాలతో ఆకట్టు కునేవి
విశ్వాస శ్వానాలు
మనం మనం తో
వాటి జీవితాలు

**రేడియమ్**
**9291527757**

# ఇరాన్ అణు స్థావరాలపై దాడుల బెదిరింపులు

**పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ – ఇరాన్ ల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్, ఇరాన్ యొక్క అణు స్థావరాలపై దాడులు చేసేందుకు సన్నాహాలు చేస్తోందని, ఇరాన్ కూడా యుద్ధ సన్నద్ధతలో ఉందని తాజాగా వార్తలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రపంచ శాంతికి ముప్పుగా మారనుంది. ఈ వ్యాసం ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య చారిత్రక సంబంధాలు, విరోధాలు, ప్రస్తుత ఉద్రిక్తతలు అలాగే అమెరికా పాత్రను సమగ్రంగా పరిశీలిస్తుంది.**

**చారిత్రక నేపథ్యం:**

ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య సంబంధాలు ఒకప్పుడు సౌహార్దపూర్వకంగా ఉండేవి. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం జరిగే వరకు, షా మహ్మద్ రెజా పహ్లవీ పాలనలో ఇరాన్ ఇజ్రాయిల్‌తో స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉండేది. ఇజ్రాయిల్‌ను గుర్తించిన మొదటి ముస్లిం దేశాలలో ఇరాన్ ఒకటి. అయితే, 1979లో ఆయతుల్లా ఖొమేనీ నాయకత్వంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ స్థాపించబడిన తర్వాత, ఇరాన్ విధానాలు ఇజ్రాయిల్‌పై వ్యతిరేకత వైపు మళ్లాయి. ఇరాన్ ఇజ్రాయిల్‌ను "ఆక్రమిత పాలస్తీనా"గా పరిగణించి, దాని ఉనికిని గుర్తించడాన్ని నిరాకరించింది. ఈ విధానం ఇరాన్‌ను హెజ్బొల్లా, హమాస్ వంటి ఇజ్రాయిల్ వ్యతిరేక సమూహాలకు మద్దతుదారుగా మార్చింది.

**ఇరుదేశాల మధ్య నిరోధానికి మూలాలు :**

ఇజ్రాయిల్ – ఇరాన్ మధ్య విరోధాలు రాజకీయ, మతపరమైన అలాగే భౌగోళిక రాజకీయ కారణాలపై ఆధారపడి ఉన్నాయి. ఇరాన్ (షియా ఇస్లాం) ఆధిపత్య దేశంగా, ఇజ్రాయిల్‌ను పశ్చిమాసియాలో పాశ్చాత్య దేశాల (ముఖ్యంగా అమెరికా) ప్రాక్సీగా భావిస్తుంది. ఇరాన్ అణు కార్యక్రమం ఇజ్రాయిల్‌కు ప్రధాన ఆందోళనగా మారింది, ఎందుకంటే ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తే, అది ఇజ్రాయిల్ ఉనికికి పెను ముప్పుగా పరిగణించబడుతుంది. మరోవైపు, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని శాంతియుత విద్యుత్ శక్తి ఉత్పత్తి కోసమని వాదిస్తుంది, కానీ ఇజ్రాయిల్ – అమెరికా దీనిని అణ్వాయుధ అభివృద్ధిగా భావిస్తాయి. ఇజ్రాయిల్ కూడా ఇరాన్‌పై రహస్య దాడులు, సైబర్ దాడులు (స్టక్స్‌నెట్ వైరస్ వంటివి) చేస్తూ ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇరాన్, హెజ్బొల్లా ద్వారా లెబనాన్‌లో, హమాస్ ద్వారా గాజాలో ఇజ్రాయిల్‌పై పరోక్ష దాడులకు మద్దతు ఇస్తోంది. ఈ పరస్పర శత్రుత్వం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది.

**ప్రస్తుత ఉద్రిక్తతలు :** 2025 జూన్‌లో, ఇజ్రాయిల్ ఇరాన్ అణు స్థావరాలపై దాడులు చేసేందుకు సిద్ధమవుతోందని, ఈ దాడులకు అమెరికా మద్దతు ఇస్తోందని వార్తలు వెలువడ్డాయి. ఇజ్రాయిల్ ఈ దాడులను ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధించేందుకు చేపడుతున్నట్లు పేర్కొంది. ఈ దాడులు టెహ్రాన్‌లోని అణు స్థావరాలు, బాలిస్టిక్ క్షిపణి కర్మాగారాలు మరియు సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాన్ కూడా ఈ బెదిరింపులకు ప్రతిస్పందనగా యుద్ధ సన్నాహాలు చేస్తోంది, దీనివల్ల పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి.

ఇటీవల ఇరాన్ ఇజ్రాయిల్‌పై 200 బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసిన సంఘటన, హెజ్బొల్లా మరియు హమాస్ నాయకులను ఇజ్రాయిల్ హత్య చేయడానికి ప్రతీకారంగా జరిగింది. ఈ దాడులను అమెరికా సహాయంతో ఇజ్రాయిల్ అడ్డుకుంది. కానీ, ఈ ఘటన రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌పై సైనిక చర్యలు తీసుకోవద్దని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును హెచ్చరించినప్పటికీ, ఇజ్రాయిల్ దాడులకు సన్నద్ధమవుతోందని తెలుస్తోంది.

**అమెరికా పాత్ర :** అమెరికా ఇజ్రాయిల్‌కు దీర్ఘకాల మిత్రదేశంగా, ఆయుధాలు, ఆర్థిక సహాయం అలాగే రాజకీయ మద్దతును కూడా అందిస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించడానికి అమెరికా ఇజ్రాయిల్‌కు సైనిక సాయం చేస్తోంది. అయితే, అమెరికా ఇరాన్‌తో సంపూర్ణ యుద్ధంలోకి వెళ్లడానికి మాత్రం ఇష్టపడటం లేదు, ఎందుకంటే ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది, ముఖ్యంగా చమురు సరఫరా ఆగిపోతుంది.ఆయిల్ ధరలు విపరీతంగా పెరుగుతాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత ట్రంప్ పాలనలో, ఇజ్రాయిల్‌కు మద్దతు మరింత బలపడినప్పటికీ, ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు అవకాశం ఇవ్వాలని కూడా ట్రంప్ సూచించారు.

**ప్రభావాలు, భవిష్యత్తు :** ఇజ్రాయిల్ ఇరాన్ అణు స్థావరాలపై దాడి చేస్తే, అది పశ్చిమాసియాలో సంపూర్ణ యుద్ధానికి దారితీయవచ్చు. ఇరాన్ మద్దతుగల హెజ్బొల్లా, హమాస్ వంటి సమూహాలు ఇజ్రాయిల్‌పై ప్రతీకార దాడులు చేయవచ్చు. ఇది ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది మరియు రష్యా, చైనా వంటి దేశాలు ఇరాన్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా ఈ సంఘర్షణ ప్రపంచ స్థాయికి విస్తరించవచ్చు. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) ఇరాన్ అణు నిబంధనలను ఉల్లంఘిస్తోందని పేర్కొన్నప్పటికీ, దౌత్యపరమైన పరిష్కారాలకు ఇంకా అవకాశం ఉందని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


**ఇజ్రాయెల్ – ఇరాన్ సైనిక శక్తి, ఆయుధ బలాల పోలిక :**


మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఈ రెండు దేశాల సైనిక శక్తి, ఆయుధ బలం, బలాబలాలను పోల్చడం ద్వారా ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ఆర్టికల్‌లో ఇజ్రాయెల్, ఇరాన్ సైనిక సామర్థ్యాలను విశ్లేషిస్తాము.

**1. సైనిక బలం (మిలిటరీ బలం)**

ఇజ్రాయెల్ – సైనిక సంఖ్య : ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)లో సుమారు 1,70,000 సైనికులు ఉన్నారు. రిజర్వ్ ఫోర్స్‌తో కలిపితే ఈ సంఖ్య 4,65,000కు చేరుతుంది. ఇజ్రాయెల్‌లో 18-21 సంవత్సరాల మధ్య వయస్సు గల అందరూ తప్పనిసరి సైనిక సేవ చేయాలి.

**శిక్షణ :** ఇజ్రాయెల్ సైనికులు అత్యాధునిక శిక్షణ, యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. ఐ.డీ.ఫ్. (ఐడీఎఫ్) అత్యంత క్రమశిక్షణ గల సైన్యంగా పరిగణించబడుతుంది.





**సాంకేతికత :** ఇజ్రాయెల్ సైన్యం అమెరికా మద్దతుతో అధునాతన టెక్నాలజీని ఉపయోగిస్తుంది. ఎఫ్-35 యుద్ధ విమానాలు, ఐరన్ డోమ్ (మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్), డేవిడ్ స్లింగ్ వంటి సాంకేతిక ఆయుధాలు ఇజ్రాయెల్ బలాన్ని పెంచుతాయి.

**ఇరాన్ – సైనిక సంఖ్య :** ఇరాన్ సైన్యంలో సుమారు 5,80,000 సైనికులు ఉన్నారు, ఇందులో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐ.ఆర్.జీ.సీ. ) (ఐఆర్జీసీ) 1,25,000 మంది ఉన్నారు. రిజర్వ్ ఫోర్స్‌తో కలిపితే ఈ సంఖ్య 10 లక్షలకు చేరవచ్చు.

**శిక్షణ :** ఇరాన్ సైనికులు గెరిల్లా యుద్ధం మరియు అసమసమ యుద్ధ వ్యూహాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారు. ఐఆర్జీసీ హిజ్బుల్లా, హౌతీల వంటి ప్రాక్సీ సమూహాల ద్వారా ప్రాంతీయంగా శక్తిని ప్రదర్శిస్తుంది.

**సాంకేతికత :** ఇరాన్ స్వదేశీ ఆయుధ తయారీలో పురోగతి సాధించింది. బాలిస్టిక్ మిస్సైళ్లు, డ్రోన్లు, మరియు సైబర్ యుద్ధ సామర్థ్యాలు ఇరాన్ బలంగా నిలుస్తాయి.

పోలిక : సైనిక సంఖ్యలో ఇరాన్ ముందుంది, కానీ ఇజ్రాయెల్ సాంకేతికత మరియు శిక్షణలో అగ్రస్థానంలో ఉంది. ఇజ్రాయెల్ యొక్క క్రమశిక్షణ మరియు అమెరికా మద్దతు దాని సైనిక బలాన్ని బలోపేతం చేస్తాయి.

**2. ఆయుధ శక్తి**

**ఇజ్రాయెల్ -వైమానిక శక్తి :** ఇజ్రాయెల్ వైమానిక దళం (ఐఏఎఫ్)లో 350కి పైగా యుద్ధ విమానాలు ఉన్నాయి, ఇందులో ఎఫ్-35, ఎఫ్-15, ఎఫ్-16 వంటి అధునాతన విమానాలు ఉన్నాయి. ఐఏఎఫ్ మధ్యప్రాచ్యంలో అత్యంత శక్తివంతమైన వైమానిక దళంగా పరిగణించబడుతుంది.

**మిస్సైల్ డిఫెన్స్ :** ఐరన్ డోమ్ షార్ట్-రేంజ్ మిస్సైళ్లను 90% విజయ రేటుతో అడ్డుకుంటుంది. డేవిడ్ స్లింగ్ మరియు యారో సిస్టమ్స్ మీడియం మరియు లాంగ్-రేంజ్ మిస్సైళ్లను నిరోధిస్తాయి.

**అణ్వాయుధాలు :** ఇజ్రాయెల్ అణ్వాయుధాలను కలిగి ఉందని భావిస్తారు, అయితే దీనిని అధికారికంగా ధృవీకరించలేదు. అంచనాల ప్రకారం, 80-200 అణు వార్‌హెడ్‌లు ఉండవచ్చు.

**సైబర్ యుద్ధం :** ఇజ్రాయెల్ సైబర్ యుద్ధంలో ప్రపంచంలోనే అగ్రగామి. స్టక్స్‌నెట్ వైరస్ ద్వారా ఇరాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బతీసిన ఘనత ఇజ్రాయెల్‌కు ఉంది.

**ఇరాన్ – వైమానిక శక్తి :** ఇరాన్ వైమానిక దళం సాపేక్షంగా బలహీనం. 300-350 యుద్ధ విమానాలు ఉన్నాయి, కానీ చాలా వరకు పాత మోడళ్లు (F-4, F-14, మిగ్-29). రష్యా నుండి సు-35 విమానాలను కొనుగోలు చేసే ప్రయత్నంలో ఉంది.

**మిస్సైళ్లు :** ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్ దాని ప్రధాన బలం. షహాబ్-3, ఖయామ్, మరియు ఖోర్రమ్‌షహర్ మిస్సైళ్లు 2,000 కిమీ పరిధిలో ఉన్నాయి, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకోగలవు. 2024 ఏప్రిల్‌లో ఇజ్రాయెల్‌పై 110 బాలిస్టిక్ మిస్సైళ్లతో దాడి చేసింది.

**డ్రోన్లు :** ఇరాన్ స్వదేశీ డ్రోన్ల తయారీలో బలంగా ఉంది. షహెద్-136 డ్రోన్లు తక్కువ ఖర్చుతో దాడులకు ఉపయోగపడతాయి.

**అణ్వాయుధాలు :** ఇరాన్ అణు కార్యక్రమం వివాదాస్పదం. యురేనియం శుద్ధీకరణలో పురోగతి సాధించినప్పటికీ, అణ్వాయుధాలు తయారు చేసిందని ధృవీకరణ లేదు.

**సైబర్ యుద్ధం :** ఇరాన్ సైబర్ దాడులలో నైపుణ్యం కలిగి ఉంది, కానీ ఇజ్రాయెల్‌తో పోలిస్తే సామర్థ్యం తక్కువ.

**పోలిక :** ఇజ్రాయెల్ వైమానిక శక్తి, మిస్సైల్ డిఫెన్స్, మరియు సైబర్ యుద్ధంలో ఆధిపత్యం కలిగి ఉంది. ఇరాన్ బాలిస్టిక్ మిస్సైళ్లు మరియు డ్రోన్లలో బలంగా ఉంది, కానీ వైమానిక దళంలో వెనుకబడి ఉంది.

**3. బలాబలాలు :**

**ఇజ్రాయెల్ – బలాలు :** అధునాతన సాంకేతికత మరియు అమెరికా మద్దతు ($3.8 బిలియన్ వార్షిక సైనిక సహాయం). ఐరన్ డోమ్ వంటి రక్షణ వ్యవస్థలు శత్రు మిస్సైళ్లను అడ్డుకుంటాయి.సిరియా, లెబనాన్‌లో ఖచ్చితమైన దాడుల ద్వారా వ్యూహాత్మక ఆధిపత్యం.

**బలహీనతలు :** చిన్న దేశం (20,770 చ.కి.మీ), భౌగోళికంగా దాడులకు గురయ్యే అవకాశం ఎక్కువ. జనాభా తక్కువ (9.2 మిలియన్), దీర్ఘకాల యుద్ధంలో సైనిక సంఖ్య పరిమితం.

**ఇరాన్: బలాలు :** విస్తారమైన భూభాగం (1.65 మిలియన్ చ.కి.మీ) మరియు జనాభా (92 మిలియన్). హిజ్బుల్లా, హౌతీలు, హమాస్ వంటి ప్రాక్సీ సమూహాల ద్వారా ప్రాంతీయ ప్రభావం. బాలిస్టిక్ మిస్సైళ్లు మరియు డ్రోన్ల ద్వారా దీర్ఘ దూర దాడి సామర్థ్యం.

**బలహీనతలు :** ఆర్థిక ఆంక్షలు సైనిక ఆధునీకరణను పరిమితం చేశాయి.వైమానిక దళం బలహీనం, ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలను ఛేదించే సామర్థ్యం తక్కువ.

**4.సైనిక యుద్ధ వ్యూహాలు**

**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్ "ప్రివెంటివ్ స్ట్రైక్" వ్యూహాన్ని అనుసరిస్తుంది. శత్రువు బలం పెరగకముందే దాడి చేస్తుంది (ఉదా: 1981లో ఇరాక్ ఒసిరక్ రియాక్టర్‌పై దాడి). సిరియా, లెబనాన్‌లో ఇరాన్ ఆయుధ రవాణాను నిరోధించడానికి ఖచ్చితమైన వైమానిక దాడులు. అమెరికా, యూరోపియన్ దేశాలతో దౌత్య సంబంధాలు ఇజ్రాయెల్‌కు అనుకూలం.

**ఇరాన్ :** ఇరాన్ "అసమసమ యుద్ధం" (అస్సేమెట్రిక్ వార్ ఫేర్) వ్యూహాన్ని అనుసరిస్తుంది. ప్రాక్సీ సమూహాల ద్వారా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెస్తుంది. బాలిస్టిక్ మిస్సైళ్ల ద్వారా దీర్ఘ దూర దాడులు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం (ఉదా: చమురు కేంద్రాలు). రష్యా, చైనాతో సంబంధాలు ఇరాన్‌కు మద్దతునిస్తాయి, కానీ పాశ్చాత్య ఆంక్షలు ప్రభావం చూపగలవు.

**5. యుద్ధం సంభావ్య పరిణామాలు:**

**ఇజ్రాయెల్ విజయం :** ఇజ్రాయెల్ అధునాతన రక్షణ వ్యవస్థలు, వైమానిక శక్తి ఇరాన్ మిస్సైళ్లను అడ్డుకోగలవు. అయితే, దీర్ఘకాల యుద్ధం ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఇరాన్ ప్రతిస్పందన :** ఇరాన్ ప్రాక్సీ సమూహాల ద్వారా లెబనాన్, యెమెన్, ఇరాక్ నుండి దాడులు చేయవచ్చు. హొర్ముజ్ జలసంధిని మూసివేస్తే, ప్రపంచ చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయి.

**ప్రాంతీయ సంక్షోభం :** ఈ యుద్ధం సిరియా, లెబనాన్, ఇరాక్‌లను కలిగి ఉండవచ్చు, మధ్యప్రాచ్యంలో అస్థిరతను పెంచుతుంది.

చివరిగా... ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చారిత్రక, రాజకీయ, భౌగోళిక రాజకీయ కారణాల వల్ల ఏర్పడ్డాయి. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ దాడులకు సన్నద్ధమవుతున్నప్పటికీ, ఈ సంఘర్షణ ప్రపంచ శాంతికి ముప్పుగా మారే అవకాశం ఉంది. దౌత్యపరమైన చర్చలు, అంతర్జాతీయ సంస్థల జోక్యం ద్వారా ఈ ఉద్రిక్తతలను తగ్గించడం అవసరం. ప్రస్తుత పరిస్థితులు పశ్చిమాసియా శాంతికి అలాగే స్థిరత్వానికి కీలకమైనవి, ప్రపంచ యుద్ధ మేఘాలు ముసురుకున్న వేళ అన్ని పక్షాలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఇజ్రాయెల్ సాంకేతికత, రక్షణ వ్యవస్థలు, మరియు అంతర్జాతీయ మద్దతులో బలంగా ఉంది, అయితే ఇరాన్ సైనిక సంఖ్య, బాలిస్టిక్ మిస్సైళ్లు, మరియు ప్రాక్సీ యుద్ధ వ్యూహాలలో ఆధిపత్యం కలిగి ఉంది. రెండు దేశాల మధ్య యుద్ధం తీవ్రమైన ప్రాంతీయ మరియు ఆర్థిక పరిణామాలను తెస్తుంది. దౌత్యపరమైన పరిష్కారాలు మాత్రమే ఈ సంక్షోభాన్ని నివారించగలవు.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# బెల్‌చౌరస్తా నుండి అమీన్‌పూర్ రోడ్డు పనులను తక్షణమే చేపట్టండి





**శేరిలింగంపల్లి, జూన్ 14 (జనంసాక్షి) :** లింగంపల్లి బెల్ చౌరస్తా నుండి అమీన్పూర్ బంధం కొమ్ము కనెక్టివిటీ రోడ్డు పనులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ మారబోయిన రవికుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బిహెచ్ఎల్ చౌరస్తానుండి అమీన్ పూర్ బంధం కొమ్ము కనెక్టివిటీ రోడ్ పనులను వెంటనే ప్రారంభించాలని ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో అధికారంలో ఉన్న పార్టీలలో చేరుతూ ఏ ఎండకు ఆ గొడుగు పడతారని, చేసేది తక్కువ చెప్పుకునేది ఎక్కువ అని ఆయన ఎద్దేవా చేశారు. పేపర్లలో ఫోటోల కోసం ప్రతిరోజు ఏదో ఓ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించే ఎమ్మెల్యే ప్రారంభోత్సవ కార్యక్రమాల అనంతరం అటువైపు తిరిగి చూడకపోవడం అలవాటుగా మార్చుకున్నారని, ప్రజా ప్రతినిధిగా ఆయన వ్యవహరించే విధానం సరికాదన్నారు. చందానగర్ డివిజన్ పరిధి శ్రీదేవి థియేటర్ నుండి అమీన్పూర్ బంధంకొమ్ము వరకు కలిపే కనెక్టివిటీ రోడ్ నిర్మాణపు పనులకు 2018 లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇప్పటికీ దాదాపు 7 సంవత్సరాలు కావొస్తున్నా పనులు ప్రారంభించక పోవడం విడ్డూరంగా ఉందని, మరోవైపు సరైన రోడ్డు మార్గం లేకపోవడం వల్ల ప్రజలు రోజూ నరకయాతన అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై పరిసర ప్రాంతాల ప్రజలు తనను కలిసి తమ కష్టాలను వెల్లబోసుకోవడం జరిగిందని, ఓ ప్రజా నాయకుడిగా వారి సంక్షేమానికి పెద్ద పీట వేయాలని రోడ్డు విషయంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. శ్రీదేవి థియేటర్ బంధం కొమ్ము రోడ్డును తక్షణమే ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని శేరిలింగంపల్లి బిజెపి ఇన్చార్జి తదితరులు ప్రభుత్వానికి సూచించారు. శ్రీదేవి థియేటర్ నుండి అమీన్ పూర్ వరకు రోడ్ గతంలో 4 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ద్వారా రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదంటే ఇది ముమ్మాటికి ఎమ్మెల్యే అసమర్థతకు నిదర్శనమని రవికుమార్ యాదవ్ బీయబట్టారు. ఇంతకుముందు పంచాయతీగా ఉన్న సమయంలోనే ముంబై - నాగపూర్ హైవే కొరకు 150 ఫీట్ రేడియల్ రోడ్ ప్రపోజల్ ఉన్న రహదారి ఇదని, అసలు బిహెచ్ఎల్ నుండి శ్రీదేవి థియేటర్ మార్గంలో అమీన్ పూర్-బంధం కొమ్ము వరకు జీహెచ్ఎంసి 45 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ఈ నిధులతోపాటు గత ప్రభుత్వంలో టియుఎఫ్ఐడిసి ద్వారా 17 కోట్లు, ఎస్డిఎఫ్ ద్వారా మరో 7 కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా పటాన్ చెరువు ఎమ్మెల్యే తన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుండగా... శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మాత్రం 2 కిలోమీటర్ల మేర రోడ్డు పనులను ముందుకు కదిలించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడని భాజపా నేతలు దుమ్మెత్తి పోశారు. తక్షణమే అమీన్పూర్ బంధం కొమ్ము రోడ్డు పనులను ఎమ్మెల్యే అరికపూడి ప్రారంభించని పక్షంలో చందానగర్ ప్రజలతో కలిసి ధర్నాలు రాస్తారోకోలను నిర్వహించడంతోపాటు ఎమ్మెల్యే ఏంటిది ముట్టడించడం జరుగుతుందని రవి కుమార్ యాదవ్ హెచ్చరించారు. ప్రస్తుత శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో వరిగేదేమీ లేదని, ఇక తామే ప్రత్యక్షంగా ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావుతో మాట్లాడి వారితో కలసి పర్యటించి వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, రవీందర్రావు, రాఘవేంద్రరావు, నాగులు గౌడ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, రాధాకృష్ణ యాదవ్, డాక్టర్ వంశీ, సింధూ రెడ్డి, చారి, జితేందర్, రాజుశెట్టి, పద్మ, వినయ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, జూన్ 14 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు బాచుపల్లి ప్రధాన రహదారిలో డాక్టర్ రెడ్డీస్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాలని, సిసి రోడ్డు పనులు, పార్కుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేస్తారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి విడుదలవారీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా క్రమ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కాకతీయ నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ప్రశాంత్, మేనేజర్ పవన్, డి ఈ వసంత, మేనేజర్ జయరాజ్, శానిటేషన్ ఇంచార్జ్ సుకృత రెడ్డి, విద్యుత్ ఏఈ శశిధర్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బోర్ర దేవి, చందు ముదిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబశివ రెడ్డి, స్వామి, ప్రవీణ్, అనిల్, సతీష్ రెడ్డి కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి వినోద్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- చరవాణిలు స్వాధీనం



**పాపన్నపేట, జూన్ 14 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి శివారులో బొమ్మ బోడుసు ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు రైడ్ నిర్వహించారు.జూదం ఆడుతున్న 13 మందిని అదుపు లోకి తీసుకొని వారి పై కేసు నమోదు చేశారు. రూ.14.330 నగదు,3 చరవాణి లు స్వాధీనం చేసుకొని పాపన్నపేట ఠాణాలో అప్పగించినట్లు సీసీ ఎస్ ఇన్స్ పెక్టర్ డి.రాజా రెడ్డి తెలిపారు. ఈవిషయంపై జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడారు.యువత ఆన్ లైన్ బెట్టింగ్,క్రికెట్ బెట్టింగ్,జూదం,పేకాట ఆడుతూ అత్యాశకు పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు,ఆర్థికంగా నష్ట పోవడం,కేసులు నమోదయితే ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని సూచించారు.పేకాట,ఆన్ లైన్ మట్కా,జూదం,క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం తెలియజేయాలని,వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈటాస్క్‌లో పీసీలు నాగరాజు, దత్తు, చిట్టిబాబు, సిహెచ్.ప్రశాంత్, బి.ప్రశాంత్ ఆంజనేయులు పాల్గొన్నారు.

# చేవెళ్ల బీజాపూర్ హైవే రోడ్డు కాదు యమపురికి రహదారి

- నిద్రపోతున్న ఆర్ అండ్ బి శాఖ
- చోద్యం చూస్తున్న రాజకీయ నాయకులు
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే. రామస్వామి



**చేవెళ్ల, జూన్ 14 (జనంసాక్షి) :** చేవెళ్ల బీజాపూర్ హైవే రోడ్డు కాదు యమపురికి రహదారి మారిందని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి వాపోయారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో కేజిఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర ప్రమాదకరంగా మారిన గుంతల మయంగా మారిన రోడ్డును పార్టీ నాయకులతో కలిసి వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంవత్సరాలు గడుస్తున్న చేవెళ్ల పట్టణ కేంద్రంలోనీ కేజీర్ ఫంక్షన్ హాల్ దగ్గర గుంతల మయంగా మారిన రోడ్డు పరిస్థితి మాత్రం చాలా దారుణంగా ఉందని, ప్రతినిత్యము ప్రజలు, రైతులు పండించే కూరగాయలు పూలు హైదరాబాద్ మార్కెట్ కు తరలించేందుకు ఇదే రహదారి నుండి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. వర్షాకాలం రాకముందే గుంతల మయంగా మారిపోయిందని, రోజు ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని అధికారులు చోద్యం చూస్తున్న రాజకీయ నాయకులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని గతంలో కొంతమంది యువకులు తమ సొంత డబ్బులతో మరమ్మత్తులు చేసిన వేయడం లేకుండా పోయిందన్నారు. సుమారు 500 మీటర్ల మేర రోడ్డు పరిస్థితి చాలా అద్వానంగా ఉందని వాపోయారు. ప్రతినిత్యము ఈ రోడ్డు పైనుండే స్థానిక ఎమ్మెల్యే ప్రయాణం చేస్తారు, కానీ ఎమ్మెల్యేకు మాత్రం గుంతల మయంగా మారిన ప్రమాదకరంగా మారిన రోడ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు వెంటనే రోడ్డును బాగు చేయించకపోతే 500 మంది కర్షకులతో కార్మికులతో రైతులతో ప్రజాసంఘాల నాయకులతో పార్టీ శ్రేణులతో హైదరాబాద్ బీజాపూర్ హైవేను దిగ్బంధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం ప్రభలింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి మల్గారి సత్తిరెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, లలిత పడమటి పెంటయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గుడ్ మార్నింగ్ మణికొండ రంగారెడ్డి జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుంది



**రాజేంద్రనగర్, జూన్ 14 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారాస గుడ్ మార్నింగ్ మణికొండ చేపట్టిన కార్యక్రమం రంగారెడ్డి జిల్లా లోనే ఆదర్శం గా నిలిచిందని మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీ.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు రాజేందర్ నగర్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి లు పేర్కొన్నారు.శనివారం గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమం దిగ్విజయంగా 100 రోజులు పూర్తి చేసుకొన్న సందర్భముగా శనివారం అల్కాపూర్ టౌన్షిప్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో మున్సిపాలిటీ బిఆర్ ఎస్ అధ్యక్షుడు సీతారాం దులిపాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని 2025 మార్చి 3 న మొదలుపెట్టి నుండి ప్రజల వద్దకు చేరుకుని వారితో మమేకమై పలు మాలిక వసతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని గత భారాస ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, దేశంలోనే ఎక్కడ లేని విధంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి అన్ని విధాలా సుసంపన్నంగా మార్చితే అమలు కానీ హామీలతో ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చేత గాక ధీవాల తీసిందని, అధికారంలోకి వచ్చిన 16 నెలలకే అన్ని రంగాలలో విఫలమైందని, రాష్ట్ర ప్రజలంతా మరల మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ పాలనను కోరుతున్నారని రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.అనంతరం మొదటి నుంచి పార్టీలో కష్టపడి అంకుఠిత దీక్షతో పార్టీ బలోపేతంకు కృషి చేసిన వారికి గుర్తించి మహిళా కార్యకర్తలకు నాయకులకు నూతన పోస్టులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపేంద్ర నాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్, జి. ధనరాజ్ సంగం శ్రీకాంత్, ఏర్పుల శ్రీకాంత్, షేక్ అరీఫ్, బొడ్డు శ్రీధర్, మహిళా నాయకురాలు రూపా రెడ్డి,సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దక్షత సమితి విద్యాసంస్థల్లో బిబిఎ కోర్సు

- ప్రారంభించిన తెలంగాణ ప్రథమ మహిళ సుధాదేవ్ జీ వర్మ



**ఖైరతాబాద్, జూన్ 14 (జనం సాక్షి) :** కెరీర్ ఆధారిత విద్యతో యువతులను సాధికార పరచడంలో గణనీయమైన ముందడుగులో, సుమన్ జూనియ ర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, విడి.బజాజ్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, మహిళా దక్షత సమితి, బన్సీలాల్ మలా నీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లతో కూడిన మహిళా దక్షత సమితి విద్యా సంస్థలు శనివారం గంగారంలో తమ బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబి ఎ) కోర్సును ప్రారంభించాయి. గౌరవ అతిథులుగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేష నల్ సొసైటీ(టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శి డాక్టర్ విఎస్.అళగు వర్షిణి ఐఎఎస్, ఇన్ఫోసిస్ వైస్ ప్రెసిడెంట్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ హెడ్ మనీషా సబూ, టెక్ మహీంద్రా చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పల్లవి కటియార్ హాజరయ్యారు. మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ మహిళా దక్షత సమితి బ్యానర్ కింద ఉన్న జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల, వృత్తి శిక్షణా కేంద్రం వంటి వివిధ కళాశాలల గురించి వివరించారు.

# మెటల్‌కుంటలోని బీసీ కాలనీలో నీటి ఎద్దడి నివారణకు చొరవ



**న్యాల్‌కల్, జూన్ 14 (జనం సాక్షి) :** గత కొన్ని సంవత్సరాలుగా మెటల్ కుంట గ్రామంలోని బీసీ కాలనీలో నెలకొన్న త్రాగునీటి ఎద్దడి నివారణకు స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ పీటర్ రాజు, తదితరులు ప్రత్యేక దృష్టి సారించారు. కాలనీలో నీటి సౌకర్యం ఏర్పాటు కోసం అవసరమకు నిధుల కోసం స్థానిక ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సురేష్ కుమార్ చొరవతో కాలనీలో త్రాగునీటి సమస్యను శాశ్వతంగా తీర్చేందుకు శనివారం చర్యలు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఉదయం బోరు మోటారుకు ప్రత్యేక పూజలు చేసి కాలనీలో ప్రత్యేకంగా దాదాపు 350 అడుగులకు పైగా బోరుబావిని తొవ్వించారు. బోరు బావి తవ్వించడంతో పుష్కలంగా నీరు వచ్చి చేరిందని, మరో రెండు మూడు రోజుల్లో బోరు మోటర్ ను ఏర్పాటు చేసి కాలనీ వాసులకు త్రాగునీటి ఎద్దడిని తీర్చేందుకు స్థానిక పంచాయతీ అధికారులు, అధికార పార్టీ శ్రేణులు దృష్టి సారించారు. సంవత్సరాల తరబడి త్రాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్న కాలనీ వాసులకు బోరు బావిని తవ్వించడంతో దాదాపు 50 కుటుంబాలకు పైగా త్రాగునీటి సమస్య తీరనుంది. ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ అవసరమగు నిధులను మంజూరు చేయడం పట్ల స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాణిక్ రెడ్డి, నరేందర్, బాబు, సంజీవ్, పాండు రంగారెడ్డి, గొల్ల మైపాల్, శేఖర్, సాల్మన్ పాల్గొన్నారు.

# సాంకేతికతలో భారత్ ను అగ్రగామిగా నిలబెట్టాలి

- అరోరా కాలేజి వార్షికోత్సవంలో మోటివేషనల్ స్పీకర్ అకెలా రాఘవేంద్ర



**బోడుప్పల్, జూన్ 14 (జనంసాక్షి) :** సాంకేతికంగా భారత్ ను అగ్రగామిగా నిలపడంలో ఇంజనీర్లు పాత్ర కీలకమైందని మోటివేషనల్ స్పీకర్ అకెలా రాఘవేంద్ర అన్నారు.అరోరా టెక్నాలజీ,రీసెర్చ్ కాలజీ వార్షికోత్సవం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిదిలోని పళని గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా మోటివేషనల్ స్పీకర్ అకెలా రాఘవేంద్ర,విశిష్ట అతిదిగా సౌమ్య నటరాజన్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అకెలా రాఘవేంద్ర మాట్లాడుతూ భారత దేశం సాంకేతికంగా ఎంతో పురోగతి సాదించిందని దానికి నిదర్శనం ఇటీవల పాకిస్తాన్ తో జరిగిన యుద్దం సిందూర్ ఆపరేషన్ అని అన్నారు.మీరంతా భావి భారత ఇంజనీర్లని మీ సేవలు దేశానికి గర్వకారణంగా నిలవాలని ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్దులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విశిష్ట అతిది సౌమ్య నటరాజన్ జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా అన్నింటిని అదిగమించుకొని ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని విద్యార్దులకు తెలిపారు.ప్రముఖ అతిది భారతీయ్ సత్యవాణి మాట్లాడుతూ ప్రపంచం మీముందు మంచితో పాటు చెడును కూడ చూపిస్తుంది వాటిని చూసుకుంటు మంచి వైపు పయనించి సమాజంలో గొప్ప వ్యక్తులుగా వెలుగొందాలని అప్పుడే మనల్ని కన్న తల్లిదండ్రుల కలలు సాహకారమవుతాయని అన్నారు.కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ చదువు మిమ్మల్ని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతుంది కాబట్టి ప్రతి సబ్జెక్టుపై పట్టు సాదించాలన్నారు. ప్రపంచానికైనా, దేశానికైన అత్యంత అవసరమైన వారు ఇంజనీర్లని మీ జీవితం రోజు ఒక సెలబ్రేషన్ లాగా గడపడడంతో పాటు భాద్యతగా మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వినోద్ చౌహాన్,విద్యార్దులు పాల్గొన్నారు.

# పుస్తక ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీ ఈటల



**నాచారం, జూన్14 (జనంసాక్షి) :** ఓబీసీల పోరుబాట పుస్తక రచయిత పి నరహరి పృథ్వీరాజ్ సింగ్ పుస్తక ఆవిష్కరణ సభలో పాల్గొన్న ఈటెల రాజేందర్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కులాలకు అతీతంగా బీసీలందరూ ఏకమవ్వాలని తెలంగాణ రాష్ట్రం సాధించినట్లుగానే మనం బీసీల రాజ్యాధికారం సాధించాలని ఇందుకు అందరు కలిసి రావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీ సంఘాలు, బీసీ కులాలు... కులానికి ఎన్ని సంఘాలు ఉన్న అందరూ కలిసి రావాలని మనం ఐకమత్యంతో పోరాటం చేయాలని ఉద్యమ బాటనే మనకు ముఖ్యమని బీసీలందరికి దారి చూపుతున్న మన ఐఎఎస్ అధికారి నరహరి పృథ్వి సింగ్ రాసిన ఓబీసీ పోరుబాట మనకు మార్గదర్శకమని పోరాడి న్యాయమైన మన ఆర్థిక రాజకీయ సామాజిక అన్నింట న్యాయం జరిగే వరకూ పోరాటం చేద్దామని ఇందులో కార్యకర్తలు బీసీ నాయకులు, బీసీలందరూ ఏకమై అధికారం వచ్చేవరకు ఉద్యమం చేద్దామని అడుక్కుంటే అధికారం మనకు ఎవరు ఇవ్వరని మన ఓట్లు మనం వేసుకుంటే బీసీలు అదే అధికారం వస్తుందని అదే రాజ్యాధికారమని బీసీల అందరికీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ 42% స్థానిక ఎన్నికల్లో తప్పక రిజర్వేషన్ ఇవ్వాలని ఇది రాష్ట్రానికి సంబంధించిన అంశమని కాంగ్రెస్ పార్టీకి హెచ్చరిస్తూ డిమాండ్ చేయడం జరిగింది. బేరి రామచందర్ యాదవ్ రెండు మూడు డిమాండ్లను పిసిసి అధ్యక్షుల మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. కేవలం కులగణన జనగణన చేస్తే సరిపోదు విద్యా ఉద్యోగము వైద్యం ఉపాధి మరియు అన్నింట వైద్యం తో పాటు బడ్జెట్లో 42 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బీసీలకు జరుగుచున్న అన్యాయాల గురించి ఏ కరువు పెడుతూ పాఠశాలల విద్య గ్రామీణ ప్రాంతంలో పేదలకు అందుబాటులో లేదు వైద్యం ఈరోజు లక్షలతో కూడుకున్న అంశం ఇది బీసీలకు అందుబాటులో లేదు పేదలైన నిరుపేదలైన గ్రామీణ ప్రాంతాల వారికి న్యాయం జరగాలంటే పోరాటం చేయాలని బహుజనులారా ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ అందరు కూడా ఈ పోరుబాటలో పాల్గొనాలని చదువుకున్న ప్రతి ఒక్క బహుజన బిడ్డ అన్నా నరహరి రాసిన ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని చదవాలని విప్ల రూపంలో ఉద్యమించి అధికారం సాధించాలని అందులో మీరందరూ భాగస్వాములు కావాలని బీసీలకు ఎస్సీ, ఎస్టీ మైనారిటీ అందరికీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సందవేణి మహేందర్ యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, వనపర్తి జిల్లా గొర్రెల మేకల సహకార సంఘం అధ్యక్షులు మధు యాదవ్, మురళీధర్ దేశ్ పాండే, యాదవ్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మీ యాదవ్, బెంగళూరు బీసీ నాయకులు లక్ష్మణ్ యాదవ్, బేరి చంద్రశేఖర్ యాదవ్, బి. సి. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 జూన్ 2025

# నిజమైన హీరో నాన్నే..!

- బిడ్డలకు మొదటి స్నేహితుడు తండ్రే
- తల్లిదండ్రులను గౌరవించినప్పుడే సమాజంలో గుర్తింపు
- నేడు ఫాదర్స్ డే

**రాజోలి, జూన్ 14 (జనంసాక్షి) :** మనల్ని ప్రపంచానికి పరిచయం చేసింది అమ్మ అయితే..మనకు ప్రపంచాన్ని పరిచయం చేసేది నాన్న..తల్లి మాటలతో ధైర్యం చెబితే నాన్న చేతలతో మనలో ధైర్యం నింపుతాడు..మన మొదటి గురువు, తొలి స్నేహితుడూ నాన్నే..మనల్ని తీర్చిదిద్ది..మన భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు అహర్నిశలూ శ్రమిస్తూ నాన్న ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటాడు. ప్రతి కొడుకు..కూతురు జీవితాల్లో నిజమైన హీరో నాన్నే. తల్లికి భూదేవంత ఓపిక ఉంటే, పిల్లలపై తండ్రికి ఆకాశమంత క్షమాగుణం ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. తండ్రి ఎంత బిజీగా ఉన్నా పిల్లల కోసం మనస్సు పరితపిస్తుంది. తాను ఎన్ని విజయాలు సాధించినా..పిల్లల గెలుపే తండ్రికి నింగిని గెలిచినంత ఆనందంగా ఉంటుంది. కుటుంబపెద్ద పాత్రతోపాటు బిడ్డలకు ఒక స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా నిలిచే తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి బిడ్డపై ఉంది. నేడు ఫాదర్స్ డే సందర్భంగా "జనంసాక్షి" అందిస్తున్న ప్రత్యేక కథనం..

### బిడ్డలకు మారదర్శకుడిగా..



ప్రతి తండ్రి ఎంత ఒత్తిడి ఉన్నా తన పిల్లలను చూసి ఆనందం పొందుతుంటాడు. పిల్లలే లోకంగా భావిస్తూ వారి బంగారు బాటకు పునాదులు వేస్తుంటాడు. చిన్నప్పుడు వేలుపట్టుకొని నడక నేర్పుతాడు. పెద్దయ్యాక తప్పుడు అడుగులు వేస్తే మంచి మార్గాన్ని చూపిస్తూ ముందుకు సాగుతాడు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం శ్రమించే గొప్ప వ్యక్తి తండ్రి.

### తండ్రికి కూతురితో అనుబంధం..

తండ్రికి కొడుకుతో కన్నా కూతురుతో ఉండే అనుబంధాన్ని ప్రత్యేకంగా చెప్పాలి. ఏ విషయాన్నైనా తండ్రికి షేర్ చేయడానికి కొడుకు భయపడితే.. కూతురు ధైర్యంగా చెప్పగలుగుతుంది. ఎంతో గారాబంగా అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు మెట్టినింటికి వెళ్లిపోతుంటే తల్లి పైకి వెక్కి వెక్కి ఏడుస్తుంటే తండ్రి లోలోపల కుమిలిపోతాడు. కొడుకు పట్ల అమితమైన ప్రేమ ఉన్నా.. బాధ్యతలు నేర్పడంలో కాస్త కఠినంగా ప్రవర్తిస్తాడు తండ్రి . అయినా బిడ్డలంటే తండ్రికి పంచ ప్రాణాలు.

### తండ్రి కష్టం గురించి..

నిజంగానే నాన్న కష్టం గురించి మాట్లాడుకుంటే సమాజంలో పెద్దగా చర్చ జరగదు. కుటుంబాన్ని పోషించడం కోసం తండ్రి పడే కష్టం కంటికి కనిపించదు. పిల్లలు, చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు అంటూ ఒక్కొక్క బాధ్యతల్ని పూర్తి చేసి వారికి మంచి భవిష్యత్ అందించేదాకా తండ్రి పడే కష్టం మాటల్లో చెప్పలేనిది. ఆడవారితో కంపేర్ చేస్తే మగవారి జీవితం ఎక్కువగా బయట ప్రపంచంలోనే గడిచిపోతుంది. పిల్లలతో గడపడం వారితో సంతోషాలు, సరదాలు తక్కువ అనే చెప్పాలి. కుటుంబాన్ని పోషించడానికి రోజంతా శ్రమ పడి వచ్చి కాసేపు తన బిడ్డలతో గడిపే సమయం అరుదుగా దొరుకుతుంది. తండ్రి అంటే పిల్లలకు ఎక్కడో చిన్న భయం ఉంటుంది. తండ్రి పెట్టే ఆ భయం వెనుక అతను ఇచ్చే భద్రత, క్రమశిక్షణ దాగి ఉంటాయి.

### తండ్రిని గౌరవించినప్పుడే..

కష్టాలకోర్చి, తమ జీవితాన్నంతా ధారపోసి ఉన్నతులుగా తీర్చిదిద్దిన అమ్మానాన్నలపై వృద్ధాప్యంలో పిల్లలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఘటనలు తరచూ చూస్తున్నాం. తల్లిదండ్రులను గౌరవించినప్పుడే ప్రతిబిడ్డకూ సమాజంలో గుర్తింపు వస్తుంది. చేతగాని సమయంలో తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటేనే మన పిల్లలు కూడా మనల్ని ఆదర్శంగా తీసుకుంటారనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం.

## మూడు నెలల రేషన్‌తో ప్రతి ఇంట్లో పండుగ

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్, జూన్ 14 (జనం సాక్షి) :** మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ మున్సిపాలిటీలోని ఒకటో వార్డ్ ఔరంగాబాద్ లోని రేషన్ షాపును జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... మూడు నెలల సన్న బియ్యం జూన్ నెలలోనే సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున అధికారులు సన్న బియ్యం పంపిణీలో జాప్యం చేయరాదని వేగవంతం చేయా లన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం గతంలో ఎన్నడు లేని విధంగా దేశంలో ఎక్కడ పంపిణీ చేయని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని నిరుపేదలకు ఈ సంవత్సరం ఉగాది పర్వదినం నుండి ప్రారంభం కావడంతో జిల్లాలో సన్న బియ్యం తీసుకుంటున్న ప్రతి నిరుపేద కుటుంబాలలో సంబరాలు నెలకొన్నాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 2,16,716 రేషన్ కార్డులు ఉన్నాయని. వీటి ద్వారా నెలకు 520 ఎఫ్‌పీ షాపుల ద్వారా సుమారు 4,522 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయబడుతుందని తెలిపారు. మూడు నెలల కోటా కలిపి మొత్తం 13,922 మెట్రిక్ టన్నులు అవసరం. ఇందులో 8,800 మెట్రిక్ టన్నులు (సుమారు 65%) ఇప్పటికే జిల్లాలోని 7 ఎమ్ఎల్‌పీ స్టోరేజీ పాయింట్ నుంచి 520 రేషన్ షాపులకు తరలించబడిందన్నారు. మూడు నెలలకు సరిపడా బియ్యం ఈనెల 1వ తేదీ నుండి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగించనున్నారు. మూడు నెలల బియ్యాన్ని తీసుకున్న ప్రతి నిరుపేద కుటుంబం ఇంట్లో పండుగ వాతావరణం నెలకొందని వివరించారు. పేదల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం ఎంతో గొప్ప విషయమని నిరుపేద కుటుంబాల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి బీఆర్ఎస్ పార్టీ అండ



**మెదక్, జూన్ 14 (జనం సాక్షి) :** పార్టీ కోసం పని చేసే వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మదేవేందర్ రెడ్డి అన్నారు. రామాయంపేట మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పరుపుగాళ్ల. నర్సింలు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందడంతో పార్టీ ప్రమాద బీమా పథకం కింద 2 లక్షల రూపాయల చెక్కును మంజూరు చేపించి బాధితుడి భార్య పరుపుగాళ్ల. లావణ్యకు మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ,గ్రామా స్థాయి నుంచి పార్టీని పటిష్టపర్చడంలో కార్యకర్తల పాత్ర క్రియాశీలకమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ ఎల్లప్పుడూ ఉంటుంది అని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ బాదే. చంద్రం, నిజాంపేట్ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ బిక్షపతి, మాజీ ఎంపిటిసి హైమద్, రామయంపేట మండల యూత్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, నాయకులు మార్కు ధాత్తు, పోచమల. ఐలయ్య,మల్లేశం,రాములు, అసనుద్దీన్,నాగర్జున్ ,కృష్ణ గౌడ్, రమేష్ తదితరులు ఉన్నారు.

## నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

- డిఎస్పీ ఎన్. లింగయ్య


**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 14 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించాలని నారాయణపేట డిఎస్పీ ఎన్.లింగయ్య సూచించారు. శనివారం జిల్లా నారాయణపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులకు డిఎస్పీ ఎన్ లింగయ్య తన కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరి గే నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. పెండింగ్ లో ఉన్న కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ, ఎస్ఐ లను అడిగి తెలుసు కొన్నారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతు గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగే షన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలన్నారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలనీ ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలనీ. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలనీ అన్నారు.కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి



సమూలంగానిర్మూలించాలనీ ఆదేశించారు.ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరిత గతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలనీ ఆదేశించారు ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతిరోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేసులను అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలనీ, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలనీ పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలనీ అన్నారు. చాలెంజిగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ శివ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాముడు, రాజు, మహేశ్వరి, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**కొల్చారం, జూన్ 14 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో వివిధ కారణాలచే మృతి చెందిన కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి శనివారం పరామర్శించారు. ఏడుపాయల మాజీ డైరెక్టర్, టిఆర్ఎస్ నాయకులు నంగునూరి గౌరీ శంకర్ మాతృమూర్తి నంగునూరి బాలమణి అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే సునీత రెడ్డి అంతక్రియల్లో పాల్గొన్నారు. అలాగే శనివారం ఉదయం గుండెపోటుతో మరణించిన దాది వెంకట్ నారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



పరామర్శించి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ అంత్యక్రియలో ఆయా పార్టీల నాయకులు పైడి శ్రీధర్ గుప్తా,ముత్యం గారి సంతోష్ కుమార్, కోనాపూర్ సంతోష్ రావు, కరెంట్ రాజా గౌడ్, యాద గౌడ్, చిట్యాల యాదయ్య, సాయిని సిద్ధిరాములు, గడ్డమీది నర్సింలు, పోచయ్య, దుర్గేష్, గజిని వెంకట్ గౌడ్, రాజేష్, రమణ ముదిరాజ్ పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 8195 కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత




**గద్వాల నడిగడ్డ, జూన్ 14 (జనం సాక్షి) :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శనివారం గద్వాల కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్‌లో 8,195 కేసులు పరిష్కరించినట్లు లోక్ అదాలత్ న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జిల్లా న్యాయమూర్తి ఎన్. ప్రేమలత తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 17 క్రిమినల్ కేసులు, బ్యాంక్ ఫ్రీలిటిగేషన్ కేసులు 4, మోటారు వాహన ప్రమాద కేసులు 2,సైబర్ కేసులు 10 పరిష్కరించారు. కేసుల నుండి కక్షిదారులు మొత్తం. 63,69,410. రూపాయలను వసూలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల వారు రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రశాంతంగా బతకడానికి ఇది మంచి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జిల్లా జడ్జి ఎస్. రవికుమార్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ .వి.శ్రీనివాస్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి. లక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.వి.హెచ్.పూజిత, ఏ.పి.పి సంజన, సైబర్ క్రైమ్ సీ.ఐ. రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోదాచారి, గవర్నమెంట్ వకీలు వరలక్ష్మి, లీగలైడ్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్, డిఎల్ఎస్ సూపర్నెంట్ శోభ, సీనియర్ న్యాయవాదులు ఇస్మాయిల్, శ్రీకాంత్, ఎస్సైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, జూన్ 15 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల సంగినేనిపల్లి గ్రామంలో సింగోటం గోపల్ దీన్నే లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి, జూపల్లి కృష్ణారావు భూమి పూజ చేసి కెనాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ లింక్ కెనాల్ నిర్మాణానికి రూ120 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చి హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని మంత్రి జూపల్లి అన్నారు.ఈ కెనాల్ నిర్మాణం ద్వారా చిన్నంబావి, వీపనగండ్ల మండలాలు సస్యశ్యామలంగా



మారనున్నాయి అన్నారు. రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూడాలన్న తపనతో మొదలైన ఈ ప్రాజెక్ట్ భవిష్యత్ తరాలకు ఒక మార్గదర్శకంగా ఉంటుంది అన్నారు. ఈ కెనాల్ ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బంది కలకూడదని అధికారులతో మాట్లాడిన మంత్రి జూపల్లి త్వరగా పనులు ప్రారంభించి పనులు పూర్తి చేసే విధంగా చొరవ తీసుకోవాలని కాంట్రాక్టర్లను కోరారు. మంత్రి జూపల్లి.ఈ కార్యక్రమంలో లింకు కెనాల్ ఈఈలు డి ఈ లు, ఏఈలు, ఉమ్మడి మండల మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ్య మార్గం

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి) :** రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి రమాకాంత్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ స్టేషన్స్ జడ్జ్ మరియు చైర్మన్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, సివిల్ కేసులు,ఎక్సైజ్ కేసులు ,ఎలక్ట్రిసిటీ కేసులు, బ్యాంకు కేసులు ,పెట్టి కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు.భార్య భర్తలకు సంబంధించిన చిన్న చిన్న గొడవలు ఒకరికొకరి మధ్య సమన్వయం లేకపోవడం వలన ఇద్దరు విడిపోయి కోర్టులలో విడాకుల వరకు వెళుతున్నారని, ఇద్దరు ఒకరినొకరు అర్థం చేసుకుని సామరస్యంగా ఉంటే వారి సంసార జీవితం సాఫీగా సాగుతుందని అన్నారు. ముఖ్యంగా క్రిమినల్ కేసుల్లో గొడవలకు కారణాలు భూ తగాదాల వల్ల ఏర్పడుతున్నాయని, భూతగాదాలకు సంబంధించిన కేసుల్లో ఎక్కువగా అన్నదమ్ములు అక్కచెల్లెళ్ల మధ్య భూ పంపకాల విషయంలో మనస్పర్థలు ఏర్పడి కోర్టు దాకా వస్తున్నారని, అందులో ఎవరో ఒకరు పెద్ద మనసు చేసుకొని లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.భార్యాభర్తలు మనస్పర్థలతో విడిపోవడం వల్ల భార్య ఒక చోట భర్త ఒకచోట




ఉండడం వల్ల వారి పిల్లలు చదువుకోలేక నష్టపోతున్నారన్నారు. ఈ పరిణామాలు వారిలో అశాంతి నెలకొల్పుతుందని, వారి పిల్లలు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఇరువురు సర్దుకొని కలిసి జీవించినట్లయితే వారు వారి పిల్లలు సుభిక్షంగా సంతోషదాయకంగా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మధ్యవర్తుల ద్వారా గాని పెద్దల ద్వారా గాని కోర్టులకు వెళ్ళకముందే సివిల్, క్రిమినల్ సమస్యలను పరిష్కరించుకోవచ్చు దానివల్ల సమాజానికి ఎంతో తోడ్పాటునిస్తుంది రాజీమార్గమే రాజ్యమార్గం లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయాభావం ఖర్చులు ఆదా అవుతాయి ఎన్నో సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిరగడం కన్నా సమస్యను పరిష్కరించుకుంటే ఇరు కుటుంబాలు సంతోషంగా జీవిస్తాయి అన్నారు. శ్రీమతి నసీమా సుల్తాన సెక్రెటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ గారు మాట్లాడుతూ బ్యాంకుల్లో రైతులకు సంబంధించిన రుణాలు కొన్ని అనివార్య కారణాలవల్ల కొంతమంది రైతులు కట్టలేకపోతున్నారు ఈ లోక్ అదాలత్ ద్వారా సెటిల్ చేసుకున్నట్లయితే బ్యాంకు వారు వడ్డీతో పాటు అసలు కూడా కొంతవరకు మాఫీ చేసే అవకాశం ఉందని అన్నారు. కావున ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరచుకోగలరు కుటుంబ వ్యవస్థలో ఆస్తి తగాదాలకు సంబంధించి అక్క చెల్లెలు అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి ప్రశాంత వాతావరణంలో ఆలోచించి మన రక్త సంబంధీకులు కాబట్టి ఎవరో ఒకరు సర్దుకుపోతే సమస్యలు పరిష్కారం అవుతాయి సమావేశం అనంతరం లోక్ అదాలాత్ ద్వారా భూ తగాదాలకు సంబంధించిన అవార్డు కాపీలను కక్షిదారులకు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా 17,495 కేసులు పరిష్కారం అయ్యాయని, కాంపౌండింగ్ ఫీజు 58,37,519 వసూలు చేయబడిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కుమారి ఎన్ శ్రీనిధి, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, రామేశ్వర్, అడిషనల్ సూపర్ ఇండెంట్ అఫ్ పోలీస్ నాగర్ కర్నూల్ ,శ్రీ కె రవి కాంతారావు ప్రెసిడెంట్ బార్ అసోసియేషన్ నాగర్ కర్నూల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అఫీషియల్స్, ఎక్సైజ్ అఫీషియల్స్, న్యాయశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పట్లోళ్ల సంగమేశ్వర్‌కు ఘన సన్మానం



**సంగారెడ్డి, జూన్ 14 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా నియమించిన పట్ల సంగమేశ్వర్‌కు వీరశైవ లింగాయత్ లింగవలిజ సంఘం సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా రుద్రారంలో గల గణేష్ టెంపుల్ లోప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వీరశైవ లింగాయత్ లింగవలిజ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు అధ్యక్షులు పృథ్వీరాజ్, గౌరవ అధ్యక్షులు ధనంజయ, కోశాధికారి గోపురాజు, ఉపకోశాధికారి శివకుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వర స్వామి, సంగిశెట్టి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కంకర పోశారు....తారు మరిచారు..!

- తారురోడ్డుకు మోక్షమెప్పుడో..?
- అసంపూర్తిగా రోడ్డునిర్మాణ పనులు
- దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**మంగపేట జూన్ 14(జనంసాక్షి) :** మండలంలోని బోరు నర్సాపురం నుంచి నర్సాయిగూడెం గ్రామం వరకు సుమారు 7 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణ పనులకొరకు నిధులు మంజూరు కాగా మొదటి దఫ్వా కింద బోరు నరసాపురం గ్రామం నుండి చెరుపల్లి (కొత్తపేట) రోడ్డు అలాగే తిమ్మంపేట క్రాస్ రోడ్డు నుండి తిమ్మంపేట అంబేద్కర్ సెంటర్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేరకు గ్రామీణ ప్రాంతాల రోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ4 కోట్ల రూపాయల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి %ఽ% స్త్రీ శశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సుమారు 4 నెలల క్రితం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి కంకర, చూర పోసి వదిలివేయడంతో రోడ్డు నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచి పోయింది. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు దుమ్ము ధూళి లేవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. అలాగే వ్యవసాయ పనులకు వెళ్లే రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ధుమ్ము ధూళితో అనేక ఇబ్బందులు పడుతున్నామని బోరు నరసాపురం, చెరుపల్లి (కొత్తపేట) నరసాయిగూడెం గ్రామాల మధ్యనున్న ప్రజలు అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై కంకర తెలి ఉండడంచే వాహనాలు వెళ్లుతుంటే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తారు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చూడాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



## క్యాన్సర్‌తో యువకుడి పోరాటం

- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



**భీమదేవరపల్లి జూన్ 14(జనం సాక్షి) :** రెక్కాడితే గాని డొక్కాడని కడు పేద కుటుంబం,కూలి పని చేస్తే గాని పూటగడవని కుటుంబం.ఇంట్లో కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తల్లి,నా కొడుకు షేక్ ఇమామ్ (32) క్యాన్సర్ బారిన పడి చికిత్స చేయించే స్తోమత లేక మంచానికే పరిమితమై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని, శనివారం తల్లి షేక్ షాంది తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామం కాశ కాలనీకి చెందిన షేక్ ఇమామ్(32) నాలుగు నెలల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తల్లి అప్పు చేసి ఆసుపత్రిలో చూపించగా క్యాన్సర్ అని డాక్టర్లు చెప్పారు. కుమారుని ప్రాణాలు కాపాడుకునేందుకు ఇప్పటికే 10 లక్షలు అప్పు చేసి వైద్యం చేయించమన్నారు.అయినా వ్యాధి నయం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ చేస్తే గాని నయం కాదని, ఆపరేషన్ చేయించాలని వైద్యులు సూచించారు. అందుకు రూ.8లక్షలు నుండి రూ.10లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు.కానీ ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేక క్యాన్సర్ వ్యాధితో పోరాటం చేస్తున్నాడు.ఇప్పుడు 15 రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే అతని ప్రాణానికి ప్రమాదమని డాక్టర్లు చెప్పారు.అసలే పేద కుటుంబం, నా భర్త షేక్ వలి గత రెండు సంవత్సరాల నుండి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. షేక్ షాంది,భర్తను కొడుకును కూలి పని చేస్తూ ఆ కుటుంబాన్ని పోషిస్తుంది.అంత డబ్బు ఎక్కడి నుండి తేవాలని చేతికి అందవచ్చిన కుమారుడి పరిస్థితి చూసి,అటు భర్త పరిస్థితి చూసి, తల్లి తల్లడిల్లుతున్నాది. డబ్బులు లేక దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.ప్రభుత్వం,దాతలు సహాయం చేసి తమ కుమారున్ని బ్రతికించాలని ఆపన్నా హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

సంబంధిత వైద్యం కోసం దాతలు కింది నంబర్ ను సంప్రదించాలని కోరారు.గూగుల్ పే,ఫోన్ పే నంబర్ 8374998208( షేక్ ఇమామ్) నంబర్ ను ఎవరైనా దాతలు ముందుకు వచ్చి నా కొడుకును బ్రతికించాలని తల్లి వేడుకుంటుంది.

## కిక్కిరిసిన మేకల సంత



**సారంగాపూర్ (జనంసాక్షి) :** సారంగాపూర్ మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం రోజున అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద మేకలను బలిస్తూ మొక్కులు తీర్చుకుంటారు. అదేవిధంగా తాతయ్య పండుగ ఉండడం వల్ల మేకల సంతలో సందడి నేలకొంది. మహారాష్ట్ర నుండి కూడా వ్యాపారులు చుట్టుపక్కల తండావాసులు పెద్ద మొత్తంలో స్వర్ణ సంతకి హాజరవుతారు. రహదారికి ఇరువైపులా క్రమ విక్రయాలు జరగడంతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. ఒకరోజున లక్షల్లో లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

## రక్తదాతలందరూ ప్రాణదాతలే..

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



**వరంగల్ ప్రతినిధి, జూన్ 13(జనంసాక్షి):** రక్తదాతలందరూ ప్రాణదాతలని, ఇది సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా శనివారం వరంగల్ లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హల్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రక్తదానం అనేది అన్ని దానాల కంటే గొప్ప దానం అని అన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చినప్పుడే ఆపద సమయంలో ఉపయోగ పడుతుందని, రక్తం ఏ సమయంలో ఎప్పుడు అవసరం అవుతుందో ఎవరికి తెలియదన్నారు. ప్రమాదాల బారిన పడిన సమయంలో, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఇలా రకరకాల సమయాల్లో రక్తం అవసరమవుతుందని, ఐఎం ఏ, స్వచ్ఛంద సంస్థలు రక్తదానాల శిబిరాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆపదలో ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని, జిల్లాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు రక్తదానం శిబిరాలు నిర్వహించటం అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరం ఉంటే స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారని అన్నారు.రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్త దానం చేసిన 52 మంది డాక్టర్లు, మెడికల్ రిప్రజెంటేటివ్ లకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జున రెడ్డి, జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజిత్ భాషా, ట్రెజరర్ డాక్టర్ శిరీష్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్,యువ నేతాజీ ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ్, రాజుతదితరులు పాల్గొన్నారు.

## కంపెనీ క్వార్టర్లు లేని ఉద్యోగులకు హెచ్ఆర్ఏ చెల్లించాలి



**బెల్లంపల్లి, జూన్ 14 (జనంసాక్షి) :** సింగరేణి కంపెనీ క్వార్టర్లు లేని ఉద్యోగులకు హెచ్ఆర్ఏ చెల్లించాలని శనివారం కేకే ఓపెన్ కాస్ట్ ఉద్యోగులు గని మేనేజర్ రామరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని ఇతర గనులలో చెల్లిస్తున్న విధంగానే 9 శాతం హెచ్ఆర్ఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలో ఎక్కువ క్వార్టర్లు ఉన్నాయనే సాకుతో కేకే ఓసీపీ కార్మికులకు మాత్రమే హెచ్ఆర్ఏ చెల్లించక పోవడం దారుణం అన్నారు. మందమర్రి ఏరియాలో కేకే ఓసీపీ మినహా మునిసిపాలిటీ పరిధిలోని మిగిలిన గనులు, డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు సంస్థ 9 శాతం చెల్లింస్తుందని అన్నారు. మందమర్రి ఏరియాలోని ఇతర గనులు, డిపార్ట్మెంట్ లకు లేని ఎక్కువ క్వార్టర్లు కేకే ఓసీపీ కార్మికులకు మాత్రమే చూపించి హెచ్ఆర్ఏ ఇవ్వకపోవడం మాపై పక్షపాతం చూపించడమేనని అన్నారు. యాజమాన్యం వివక్ష చూపడం వల్ల తాము నష్టపోతున్నామని, వెంటనే హెచ్ఆర్ఏ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్మికులు శ్రీనివాస్, తిరుపతి, శ్రీధర్, రాజేశ్వర్, మల్లేష్, శశ్రీనివాస్, కేకే ఓసీపీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులు ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సన్నద్ధం

- ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి





**ములుగు బ్యూరో,జూన్14(జనం సాక్షి):** ములుగు జిల్లాలో వరదలు మొదలగు ప్రకృతి విపత్తులు ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సన్నద్ధంగా ఉన్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్.పి ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రానున్నది వర్షాకాలమైనందున అతిగా వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలలో హఠాత్తుగా వరదలు ఏర్పడి ముంపుకు గురయ్యే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర సేవలు అందించేందుకు గాను ములుగు జిల్లాలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ములుగు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలలో గల లోతట్టు ప్రాంతాలను, ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజల సహాయార్థం ఇట్టి బృందాలను ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించడం జరుగుతుందని తెలియజేశారు. కావున ముంపు ప్రాంతాల ప్రజలు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ఏదైనా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నట్లయితే వెంటనే వారి పోలీస్ స్టేషన్లకు లేదా 100 కు కాల్ చేసి సమాచారం అందించాలని తద్వారా తక్కువ సమయంలో ప్రజలను ముంపు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించడం సులభం అవుతుందని అన్నారు.అలాగే వరదలు ముంచెత్తిన సమయంలో ప్రజలకు ఏ విధంగా సహాయమందించాలనే విషయంపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రామప్ప చెరువులో ఆర్ఐ తిరుపతి ఆధ్వర్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు.

## గంజాయి ముఠా అరెస్ట్




**శాయంపేట, జూన్ 14 ( జనం సాక్షి) :** శాయంపేట మండలం ఆరేపల్లి గ్రామంలో ఎస్సై పరమేశ్వర్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంలో కొంతమంది వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకొని విచారించగా, వారి వద్ద 1కేజీ 100 గ్రాముల ఎండు గంజాయి లభించిందని దాని విలువ దాదాపు 55000/-ఉంటుందని తెలిపారు. నిందితులు శాయంపేట గ్రామానికి చెందిన అంగునూరి రోహిత్, గోవిందు సృజన కుమార్ , మారేపల్లి నితీష్ ఆత్మకూరు గ్రామానికి చెందిన కక్కు అఖిల్ అని తెలిపారు. తక్కువ ధరకి గంజాయి కొని ఎక్కువ ధరకి అమ్ముకుందామని ,మేము అందరమూ అచ్చటకు చేరి పంచ కుందామనే క్రమంలో అక్కడికి శాయంపేట పోలీసులు వచ్చి మమ్మల్ని పట్టుకున్నారు నిందితులు తెలిపారు అని సిఐ రంజిత్ రావు అన్నారు.

## లోక్ ఆధాలాత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి) :** జాతీయ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకుని ప్రజలు తమ కోర్టు కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎస్. శ్రీవాణితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేసులు సంవత్సరాలుగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజలు మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలు రాజీకి వచ్చి త్వరితంగా న్యాయం పొందవచ్చని తెలిపారు. కోర్టు చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, పలు క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, ఆస్తి గొడవలు వంటి కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులు ప్రజలను లోక్ అదాలత్‌కు ప్రోత్సహించాలన్నారు. అనంతరం, లోక్ అదాలత్ ద్వారా తమ విడాకుల కేసును పరిష్కరించుకున్న భార్యాభర్తలను కలెక్టర్, న్యాయమూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, అడిషనల్ ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరేందర్, కోర్టు అధికారులు, న్యాయవాదులు,సాదు జనార్ధన్ రెడ్డి, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల పురుగుమందుల దందా



**కాటారం, జూన్ 15 (జనంసాక్షి) :** కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మహా ముత్తారం మహాదేవపూర్, మలహార్, పలిమెల మండల పరిధిలో రైతుల అమాయకత్వాన్ని ఆసరా గా చేసుకుని నకిలీ విత్తనాలను పురుగుమందుల దందాను కొనసాగిస్తున్నారు. డివిజన్ వ్యాప్తంగా రైతులు పంట పెట్టుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఎరువులు విత్తనాలు కొనుగోలును ఆసరా చేసుకుని నకిలీ విత్తనాలు లేబుల్ లేని పురుగు మందులు అమ్ముతూ తక్కువ సమయంలో ఎక్కువ సంపాదిస్తున్నారు. సామాన్య రైతులు నష్టపోతున్నారు. అనేక చోట్ల వ్యవసాయంపై అవగాహన లేని వ్యక్తులు షాపులను నిర్వహిస్తున్నట్లు ఆరోపణ ఉన్నాయి. షాపు యజమాను లు అధికారులను మేనేజ్ చేసుకొని సర్టిఫికెట్లు దొడ్డి దారిన సంపాదించుకొని దర్జాగా షాపులను నడుపుతున్నట్లు ఆరోపణ సైతం వే లువెత్తుతున్నాయి. వీరు రైతులకు సరైన సలహాలు ఇవ్వకుండా వారికి తోచిన తక్కువ ధరకు లభించిన మందులను ఎక్కువ ధరకు అంటగడుతూ సావు యజమానులు లబ్ధి పొందుతున్నారు.

వ్యవసాయ అధికారులు నిపుణులు కండ్లగప్పి మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి నాసిక పురుగుమందులు జిల్లాలోకి అక్రమంగా తరలించి రాత్రి వేళలో సరిహద్దు చెక్ పోస్ట్ లను దాటి మారుమూల గ్రామాల కు తరలిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఈ మూటతో చేతులు కలిపి రైతులను మోసం చేస్తున్నారు. పేరు మోసిన కంపెనీ లేబుళ్లను నకిలీ సీసాలపై అతికించి అడ్డగోలుగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ ధరకే రైతులు కూడా కొనుగోలు చేసి పంట రాక తీవ్రంగా నష్టపోతున్నారు. నకిలీ మందుల వ్యాపారం అక్రమంగా సాగుతున్నప్పటికీ లాభసాటి వ్యాపారంగా మారింది. కొందరు సబ్ డీలర్ గా ఏర్పడి నకిలీ మందులను లేబుళ్లు ఏర్పరిచి ఫర్టిలై షాపులకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.

వ్యవసాయ అధికారులు పోలీసులు జూన్ మాసం మొదలు కాగానే ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తారు. రైతులు అంతకుముందే మే మాసంలోనే విత్తనాలు దొరికాయని వ్యాపారులు చెప్పే మాయమాటలకు ముందుగానే కొనుగోలు చేసి ఇంటి అందు దాచిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా ఎంత నిగా ఉంచిన నకిలీలు ఈ నకిలీ వ్యాపారం కొనసాగుతూనే ఉంది ఇలా కాకుండా నకిలీ అనే విత్తనం తీసుకొచ్చినట్లయితే పీడీ యాక్ట్ ప్రకారం కేసు పెట్టాలని రైతులు ప్రజలు కోరుకుంటున్నారు.

# అవినీతికి తావులేకుండా అభివృద్ధి చేస్తా

- నియోజకవర్గ పరిధిలో 50 లక్షల నిధులతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా.
- మంచిర్యాల జిల్లాలో మంత్రి వివేక్ కు ఘనస్వాగతం
- గజమాలతో సత్కరించిన కాంగ్రెస్ శ్రేణులు



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 14 (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపిస్తుందని,విద్యారంగంపై ప్రత్యేక దృష్టి కేటాయించిందని అందులో భాగంగానే చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లి గ్రామంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం పనులు జరుగుతున్నాయని కార్మిక ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో కార్మిక శాఖ మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా పర్యటించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు వివేక్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంచిర్యాల జిల్లాలోని ఇందారం గోదావరి బ్రిడ్జి దగ్గర ఘనంగా స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చి , భారీ గజమాలతో కాంగ్రెస్ శ్రేణులు సత్కరించారు. ఇందారం, రసూలుపల్లి, జైపూర్,భీమారం మీదుగా చెన్నూర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఇక్కడ పక్షపాతం అవినీతి లేకుండానే అభివృద్ధి పనులను కొనసాగిస్తామని అన్నారు. కాకా వెంకటస్వామి పేరు ప్రతిష్ఠలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను తరతమ భేదం లేకుండా నిష్పక్షపాతంగా అందిస్తానని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని మీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని అక్రమ ఇసుక రవాణాను పకడ్బందీగా నివారించమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని సూచించారని ఆయన ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణా అదుపు చేశామని తెలిపారు. ఇసుక అవసరం ఉన్న వారికి ఇసుక అవసరం ఉన్నవారు అధికారులు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ లలో తీసుకెళ్లాలని తెలిపారు. ఇసుక రాయల్టీ ద్వారా వచ్చే ఆదాయంతో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని అన్నారు. గత ప్రభుత్వం లాగా ప్రజా ప్రభుత్వంలో ఎవరిపై అక్రమ కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురి చేసే సంస్కృతి మాది కాదని తెలిపారు. ఎక్కడ కూడా అన్యాయంగా అరెస్ట్ చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు . ప్రతీ గ్రామానికి 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఫ్రీ బస్, 500 లకే గ్యాస్ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇస్తా అని మోసం చేసిందని మా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరుపేద ప్రజలు కూడా సంపన్నులతోపాటు సన్నబియ్యం తినాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డు లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన మీ అందరితో ఉంటానని, మీ అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 జూన్ 2025

# లోక్ అదాలత్‌లో ఒక్కటైన భార్యాభర్తలు

- **లోక్‌అదాలత్‌కు భారీ స్పందన**



**తుంగతుర్తి, జూన్ 14 (జనం సాక్షి) :** వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కొన్ని రోజులుగా బాగానే కలిసి కాపురం చేశారు. ఏమైందో ఏమో గానీ వారి కాపురంలో కలహాలు మొదలయ్యాయి. చివరికి విడిపోయే వరకు పరిస్థితులు వచ్చాయి. వాళ్ళిద్దరూ కోర్టుల చుట్టూ తిరిగారు. తర్వాత న్యాయవాదులు, న్యాయమూర్తుల సమక్షంలో వివాదాలు మర్చిపోయి కలిసి జీవిస్తామని ఒక్కటై తమ ఇంటికి వెళ్లిపోయారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ కోర్టులో లోక్ అదాలత్ సందర్భంగా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ విషయం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన శ్రీవాణి, తిరుమలగిరికి చెందిన పర్వతం మధులకు 2021లో పెద్ద మనుషుల సమక్షంలో వివాహం జరిగింది. వీరి కుమారుడు జన్మించారు. వీరి కాపురంలో మనస్పర్ధలు ఏర్పడడంతో విడిపోయారు. దీంతో శ్రీవాణి తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో తన భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఇరువురు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎండి.గౌస్ పాషా దంపతులిద్దరికీ కౌన్సిలింగ్ చేశారు. దీంతో వాళ్ళిద్దరూ కలిసి జీవించాలని నిర్ణయానికి రావడంతో తమ కేసులకు రాజీపడి జడ్జి సమక్షంలో కలిసి జీవిస్తామని ఇరువురు పూల దండలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి ఎండి.గౌస్ పాషా మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని, రాజీతో ఇరుపక్షాల వారు గెలిచిన వారవుతారని, సమయం, ధనం వృథా కాకుండా ఉంటుందని, సివిల్, క్రిమినల్, వెహికల్ యాక్ట్, గృహహింస, విద్యుత్, చెక్ బౌన్స్, బ్యాంకు కేసులకు సంబంధించి పరిష్కారమయ్యే కేసులు పరిష్కరించుకోవచ్చని, లోక్ అదాలత్ కేసులు-60, అడ్మిషన్ కేసులు-62, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు- 684, ఈ-పెట్టి కేసులు-650, సైబర్ క్రైమ్ కేసులు-6 పరిష్కారం చేసినట్లు, సైబర్ క్రైమ్ కేసుల్లో ఫ్రీజింగ్ అయిన అమౌంట్ రూ.1,08,815 బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జి గౌస్ పాషా, న్యాయ సేవ అధికార సంస్థ సభ్యులు వంగాల నాగరాజు, వజీర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్, ఉపాధ్యక్షులు కారింగుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ పర్వీన్, సీనియర్ న్యాయవాదులు కుమారస్వామి, తాళ్లపల్లి సత్యనారాయణ, రాజారాం, సూపరింటెండెంట్ శ్రీను, సీఐలు శ్రీనివాసరావు, వివిధ మండలాల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు తెలిపేందుకు వస్తే రైతులను అరెస్ట్ చేస్తారా..?

- **బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.కురువ విజయ్ కుమార్**



**గద్వాల నడిగడ్డ, జూన్ 14 (జనంసాక్షి) :** 'గద్వాల జిల్లా సీడు పత్తి రైతుల సమస్యలు రైతు కమిషన్ చైర్మన్‌కు వివరించడానికి వస్తే అక్రమంగా అరెస్టు చేస్తారా..?' అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.కురువ విజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సీడ్ కంపెనీలకు, ఆర్గనైజర్లకు గద్వాల జిల్లా కాంగ్రెస్ నాయకులు అమ్ముడుపోయారని ఆరోపించారు. అలంపూర్ ప్రజలు తిరస్కరించినా చిల్లర రాజకీయాలకు సంపత్ కేరాఫ్‌గా మారారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.కురువ విజయ్ కుమార్ గద్వాల జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. సీడు పత్తి కంపెనీలు, ఆర్గనైజర్లు ఒక ముఠాగా ఏర్పడి సీడు పత్తి రైతులు వారు పండించిన పంటను పాస్ అయినప్పటికీ ఫెయిల్ చేస్తూ రైతులను మోసగిస్తున్నారని అన్నారు. న్యాయం కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లో రైతు కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే.. బీఆర్ఎస్ ఫిర్యాదుకు స్పందన వచ్చిందని తెలిపారు. కోదండరెడ్డి గద్వాల జిల్లాకు వచ్చినా రైతులను కలవనీయకుండా కాంగ్రెస్ ర్యాలీ చేశారని ఆరోపించారు. సీడు పత్తి రైతులకు అన్యాయం చేసే విదంగా కోట్లాది రూపాయలకు అమ్ముడుపోయిన జిల్లా కాంగ్రెస్ నాయకులు, సీడు కంపినీలు, సీడు ఆర్గనైజర్లు,అధికారులు కుమ్మక్కయ్యారని తెలిపారు. సమస్య ఉన్న ధరూర్, మల్దకల్, గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో జరగాల్సిన కమీషన్ పర్యటనను సంబందం లేని పూటాంపల్లి గ్రామానికి మార్చారని, ముందస్తు పథకం ప్రకారం కమీషన్ ను పక్కదారి పట్టించేవిదంగా వ్యవహరించారని అన్నారు. తక్షణమే సీడు పత్తి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రైతులతో కలిసి రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ తరుపున రాష్ట్ర ఉన్నత న్యాయస్థనం హైకోర్టును కూడా ఆశ్రయించి రైతులకు న్యాయం జరిగిలే కృషి చేస్తామన్నారు.

## రవి కుటుంబానికి ఐదు కోట్ల నష్టపరిహారం చెల్లించాలి

- **బిఆర్ఎస్ నాయకుల డిమాండ్**



**యాదగిరిగుట్ట, జూన్ 14 (జనం సాక్షి) :** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నివాసంలో పనిచేస్తున్న గంధమల్ల రవి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టి, రవి కుటుంబానికి 5 కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. రవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన రాత్రికి రాత్రే తహసిల్దార్ తో పంచనామా చేయించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపడంపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. పోలీసులపై ఎమ్మెల్యే ఐలయ్య ఒత్తిడి తీసుకువచ్చినట్లు తమ దగ్గర సమాచారం ఉందని చెప్పారు. రవిది ఆత్మహత్యన, లేక హత్యనా అనే దానిపై స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఎమ్మెల్యేతో పాటు అధికారులపై ఉందని గుర్తు చేశారు. మృతుడు రవి పిల్లల చదువులు, వివాహం బాధ్యత ఎమ్మెల్యే వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మదర్ డైరీ డైరెక్టర్ ఒగ్గు బిక్షపతి, నాయకులు సయ్యద్ బాబా, పేరబోయిన సత్యనారాయణ, కోన్యాల నరసింహ రెడ్డి, గాదపాక క్రాంతి, సారాజి రాజేష్, దావుదూ, యాకూబ్, దండేబోయిన వీరేష్, వాసం రమేష్, లింగం, ఉపేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జనంసాక్షి ఎడిటర్‌పై కేసుల విషయంలో ఎడిటర్స్ గిల్డ్ స్పందించాలి

- **టీయూడబ్ల్యూజే అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లం నారాయణ, ఆస్కాని మారుతీసాగర్**

**హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) :** పత్రికా భావప్రకటన స్వేచ్ఛను కాలరాసేలా జనంసాక్షి ఎడిటర్ రహమాన్‌పై అక్రమంగా పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లం నారాయణ, ఆస్కాని మారుతీసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎడిటర్స్ గిల్డ్ స్పందించి చొరవ తీసుకోవాలని న్యూఢిల్లీకి లేఖ రాశారు. ఎలాంటి విచారణ చేపట్టకుండా ప్రధాన నిందితుల జాబితాలో రహమాన్‌ను చేర్చారని లేఖలో పేర్కొన్నారు. ప్రజల తరపున, ఉద్యమాల వార్తలను కవర్ చేసినందుకు అక్రమ కేసులు బనాయించడం భయభ్రాంతులకు గురిచేయడమేనని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల పట్ల వేధింపులు ఆపాలని, రహమాన్‌పై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని, ప్రజాప్రయోజన విషయాలను ప్రచురించే హక్కులను రక్షించాలని బహిరంగంగా ప్రకటించాలని ఎడిటర్స్ గిల్డ్‌ను కోరారు. వీటన్నింటిపై తక్షణమే స్పందించి ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## పార్టీ నామినేటెడ్ పదవుల్లో పెరికలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) :** ఎమ్మెల్సీ నియామకాల్లో, మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించి, కామారెడ్డి డిక్లరేషన్ అమలు దిశగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పెరిక కులానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ,దాని అనుబంధ సంఘాలలో, రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని పెరిక కుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) జాతీయ అధ్యక్షులు విజ్ఞప్తి చేసారు. ఈ రోజు సాయంత్రం శంకర్ నగర్ కాలనీ లోని పెప్సీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పెప్సీ, జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 20నియోజకవర్గాల్లో మంచిర్యాల, హుజుర్ నగర్, కోదాడ, సూర్యాపేట, ములుగు, వరంగల్ తూర్పు ,భూపాల్ పల్లి, పరకాల, పాలకూర్తి, సిద్దిపేట, జూబ్లీహిల్స్, ఎల్బీ నగర్, ఉప్పల్ ,హుజురాబాద్ ,హుస్నాబాద్, రామగుండం, పెద్దపల్లి తదితర నియోజకవర్గాల్లో ప్రభావితం చేయకలిగే బలం ఉన్న పెరిక కులానికి ప్రాతినిధ్యం ఉన్న నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వలేదు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివిధ కేటగిరిల్లో అర్హత కల్గిన స్వసంఘీయులకు అవకాశం కల్పించాలని సమావేశం తీర్మాణం చేసింది. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాం వీరయ్య అధ్యక్షత వహించారు.రాష్ట్ర న్యాయ సలహాదారులు గుమ్మళ్ల మల్లికార్జున్ ,రాష్ట్ర కోశాధికారి అప్పని సతీష్ కుమార్, చింతం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ముడిదే వెంకటేశ్వర్లు, వరంగల్ కోశాధికారి బోళ్ల వీరప్రతాప్, పెప్సీ నాయకులు, ఆవిరే వెంకటేశ్వర్లు, సందసాని నరేశ్, బేరే కేదారి తదితరులు పాల్గొన్నారు.



## 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

- **సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) :** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడు తున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ.8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

## గంజాయి సేవించడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరం

- **డిఎస్పీ ప్రసన్న కమార్**
- **నిందితుల వివరాలు తెలుపుతున్న పోలీసు అధికారులు**



పెన్‌పహాడ్, జూన్ 14 (జనం సాక్షి) : గంజాయి సేవించడం సరఫరా చేయడం చట్టరీత్యా నేరమని డిఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం సూర్యపేటలోని సబ్ డివిజన్ కార్యాలయంలో పెన్ పహాడ్ మండలంలో గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన నిందితుల వివరాలు వెల్లడించారు.మండల పరిధిలోని అనంతారం ఎక్స్ రోడ్డు వద్ద స్థానిక ఎస్సై గోపికృష్ణ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వెళుతున్న ఐదుగురిని తనిఖీ చేయగా ఒక్కొక్కరి వద్ద 100 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.500గ్రాముల గంజాయిని,ఐదు బైక్ లు, మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని ఏ వన్ గా బొమ్మకంటి గోపి తండ్రి దుర్గయ్య మాచారం గ్రామం,ఏ 2 పేరం శ్రీకాంత్ తండ్రి వెంకన్న మాచారం గ్రామం, ఏ 3 ఇంద్రవెల్లి జీవన్ కుమార్ తండ్రి డేనియల్ పెన్ పహాడ్ గ్రామం, ఏ ఫోర్ పేరం శివ తండ్రి జానయ్య మాచారం గ్రామం, ఏ ఫైవ్ గా పర్సబోయిన రమేష్ తండ్రి తిరుపతయ్య నారాయణగూడెం గ్రామం అను వ్యక్తులు ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయిని కొనుక్కొని తమ వద్ద దాచుకున్నారని ఎస్ఐ తెలిపారు.ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై గోపికృష్ణ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐదో అంతస్థు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

- **కుటుంబ కలహాలే కారణమంటున్న పోలీసులు**

**హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) :** సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు- పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం... ఆత్మహత్య చేసుకున్న మహిళ పేరు కొక్కినీ శ్రావణి (30), ఆమె తిమ్మాపురం, ఏలూరు జిల్లా వాసిగా గుర్తించారు. . కొద్ది నెలల క్రితమే హైదరాబాద్‌కు వలసవచ్చి, జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్టు- తెలుస్తోంది. ఆమెకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాలే ఆమె ఆత్మహత్యకు కారణమై ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు- పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో అపార్ట్‌మెంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విప్లవ వీరుడు చేగువేరా..



**రామన్నపేట, జూన్ 14 (జనంసాక్షి) :** గుండెల్లో దాగి ఉన్న నిప్పుతో, కళ్ళల్లో ధైర్యపు జ్యోతితో, అణగారిన ప్రజల కోసం, పోరాడిన విప్లవ వీరుడు చేగువేరా అని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటి సభ్యులు మాజీ వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మెట్టు శ్రవణ్ అన్నారు. చేగువేరా జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేగువేరా మాటలు ఒక శక్తి చేతలు ఒక స్ఫూర్తి. ఆ పేరు ఒక నినాదం. అయన జీవితం ఒక పాఠం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లల పెంటయ్య,సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వనం ఉపేందర్,బల్గూరి అంజయ్య, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, వేముల సైదులు,గొరిగె సోములు,మునుకుంట్ల లెనిన్, రషీద్,పులి బిక్షం, శానగొండ వెంకటేశ్వర్లు, గంటేపాక శివకుమార్ డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రాము, గోగు లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి ఘన స్వాగతం

- **నిబద్ధతో, నిజాయితీగా పని చేస్తా..**
- **అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం**
- **రాష్ట్ర కార్మిక, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**రామకృష్ణాపూర్, జూన్ 14 (జనంసాక్షి) :** రాష్ట్ర కార్మిక, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి చెన్నూరు నియోజవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీ వచ్చిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి పురపాలిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సింగరేణి కార్మిక విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం భగత్ సింగ్ నగర్, గంగాకాలనీ మీదుగా సూపర్ బజార్ సెంటర్ నుండి రామాలయం అమర వీరుల స్థూపం వరకు నాయకులు, కార్యకర్తలు మంత్రికి స్వాగత ర్యాలీ నిర్వహించారు. రామాలయం చౌరస్తాలో నిర్వహించిన సభ సమావేశంలో మంత్రి వివేక్ మాట్లాడారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నానని, మంత్రిగా మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నంబర్ వన్ నియోజకవర్గంగా చెన్నూరును తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు.ఇచ్చిన మాట ప్రకారం క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించామన్నారు. క్యాతనపల్లి ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేస్తానని, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఇతర అభివృద్ధి పనులు పట్టణంలో కొనసాగుతున్నాయని తెలియజేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. త్వరలోనే స్మశాన వాటిక, డంపింగ్ యార్డ్ నిర్మిస్తామని, జీవో నంబర్ 76 ద్వారా సింగరేణిలో ఇండ్లు నిర్మించుకున్న వారికి ఇండ్ల పట్టాలు ఇస్తామని బరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలు లేకుండా నిష్పక్షపాతంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వోడ్నాల శ్రీనివాస్, నాయకులు గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయం కోసం రోడ్డెక్కిన కుటుంబసభ్యులు



**గంభీరావుపేట, జూన్ 14 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల లింగన్నపేట గ్రామంలో నిన్నటి రోజు శుక్రవారం రోజున సాయంత్రం మండే సతీష్ యాదవ్ వయసు (32) గ్రామ శివారులో ఎల్లమ్మ ఆలయ సమీప కెనాల్ పక్కన దారుణ హత్యకు గురయ్యాడు. దీనికి గాను శనివారం రోజు సాయంత్రం మృతుడి కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. న్యాయం చేయాలంటూ ప్రధాన రహదారి అయినటువంటి కామారెడ్డి సిద్దిపేట రహదారిపై న్యాయం కొరకు రోడ్డుపై బైఠాయించారు. ఇట్టి విషయంలో డి.ఎస్.పి, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇట్టి విషయంలో బాధితుని కుటుంబానికి న్యాయం చేస్తామని నిందితున్ని పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



# గోల్డ్ లోన్లు మరింత కఠినతరం

## రుణగ్రహీతలకు కొత్త సవాళ్లుగా మారిన ఆర్బీఐ కొత్త నిబంధనలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం, వెండి తాకట్టు రుణాలపై కఠిన నియం త్రణలను విధించింది. మనీలాండరింగ్ నిరోధం, రుణ దుర్వినియోగం అరికట్ట డం కోసం ఈ నిబంధనలు రూపొందించ బడ్డాయి. అయితే, ఈ కొత్త మార్గదర్శకా లు రైతులు, మహిళలు, యువత వంటి గోల్డ్ లోన్ ఆశ్రయించే వారికి ఆర్థిక ఒత్తిడిని తెచ్చిపెట్టే అవకాశం ఉంది.

**కొత్త నిబంధనల వివరాలు**

ఆర్బీఐ ప్రకారం, ఒక వ్యక్తి గరిష్ఠంగా 1 కిలో బంగారు ఆభరణాలు, 10 కిలోల వెండి ఆభరణాలను మాత్రమే తాకట్టు పెట్టవచ్చు. బంగారు నాణేలు/ బిస్కెట్లు 50 గ్రాములు, వెండి 500 గ్రాములకు మించకూడదు. రుణ మొత్తం ఆభరణాల విలువలో 85% (రూ.2.5 లక్షల లోపు), 80% (రూ.2.5-5 లక్షలు), లేదా 75% (రూ.5లక్షలకు మించి) వరకు మాత్రమే ఇవ్వాలి. రుణం 12 నెలల్లో వడ్డీతో సహా చెల్లించాలి, ఆర్బిఐ రుణాలకు 36 నెలల వరకు గడువు ఉంది. గతంలో ఏటా పునరుద్ధరణ సౌకర్యం ఉండగా, ఇప్పుడు రుణం చెల్లించిన తర్వాత మరుసటి రోజు కొత్త రుణం కోసం దరఖాస్తు చేయాలి. చెల్లింపు విఫలమైతే, బంగారం రెండు దశల్లో (జిల్లా స్థాయి, ఆన్‌లైన్/పొరుగు జిల్లా) వేలం వేయబడుతుంది. రుణం చెల్లించినా, రెండేళ్లలో ఆభరణాలు తీసుకోకపోతే, బ్యాంకు రుణగ్రహీత లేదా వారసులకు సమాచారం అందజేయాలి.


బ్యాంకులు ఆభరణాల సొంతదారిత్వాన్ని రసీదుల ద్వారా ధృవీకరించాలి, లేకపోతే రాతపూర్వక పత్రం తీసుకోవాలి. బహుళ రుణాలు తీసుకుంటే తనిఖీ చేయాలి, రుణ మొత్తం బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. "సులభ గోల్డ్ లోన్" వంటి మోసపూరిత ప్రకటనలు నిషిద్ధం.

**రుణగ్రహీతలపై ప్రభావం**

గోల్డ్ లోన్లు వైద్యం, విద్య, వ్యవసాయం, వ్యాపార అవసరాల కోసం ఆకర్షణీయ ఎంపికగా ఉన్నాయి. కానీ, 12 నెలల గడువు, తగ్గిన ఎల్‌టివి నిష్పత్తి, పునరుద్ధరణ సౌలభ్యం రద్దు వంటివి రుణగ్రహీతలకు ఒత్తిడిని పెంచుతాయి. వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు బ్యాంకుల వారీగా మారుతాయికొన్ని 8% వడ్డీ, మరికొన్ని ఎక్కువ లేదా తక్కువ వసూలు చేస్తాయి. రూ.3 లక్షల వరకు కొన్ని బ్యాంకులు ఫీజు మినహాయిస్తున్నా, మరికొన్ని వసూలు చేస్తున్నాయి. ఆర్బీఐ నిబంధనలు మనీలాండరింగ్ నిరోధం, పారదర్శకత కోసం అవసరమైనవే.

అయితే, ఈ కఠిన షరతులు గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఆర్థిక అవసరాల కోసం గోల్డ్ లోన్లపై ఆధారపడే వారికి సవాళ్లను తెస్తాయి. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు ఈ రుణాలను సులభంగా తీసుకునే అవకాశం తగ్గవచ్చు. ఆర్బీఐ ఈ నిబంధనల అమలును పర్యవేక్షిస్తూనే, రుణగ్రహీతల ఆర్థిక ఒత్తిడిని తగ్గించే సమతుల్య విధానం అవలంబించాలి. రుణగ్రహీతలు తమ ఆర్థిక సామర్థ్యాన్ని ముందుగా అంచనా వేసి, బ్యాంకుల వడ్డీ రేట్లు, షరతులను సరిపోల్చి నిర్ణయం తీసుకోవాలి.

# తగ్గిన ఎస్‌బీఐ హోమ్‌లోన్ వడ్డీ రేట్లు



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణగ్రహీతలకు శుభవార్త చెప్పింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ హోమ్‌లోన్ వడ్డీ రేట్లు రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.50%కి చేర్చిన నేపథ్యంలో, ఎస్‌బీఐ తన హోమ్‌లోన్ వడ్డీ రేట్లను సవరించింది.

ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్‌ను 8.65% నుంచి 8.15%కి తగ్గించింది. ఈ కొత్త రేట్లు జూన్ 15, 2025 నుంచి అమల్లోకి వస్తాయి. ఈ మార్పు హోమ్‌లోన్ లు, ఎంఎస్‌ఎంఈ రుణాలు, మరియు ఆర్‌బిఐ సూచించిన కొన్ని ఇతర రుణాలకు వర్తిస్తుంది. రుణగ్రహీతల సిబిల్ స్కోరు ఆధారంగా హోమ్‌లోన్ వడ్డీ రేట్లు 7.50% నుంచి 8.45% మధ్య ఉంటాయి. ఈ తగ్గింపు ఇప్పటికే రుణాలు తీసుకున్నవారితో పాటు కొత్త రుణగ్రహీతలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. ఎస్‌బీఐ 2019 అక్టోబర్ 1 నుంచి రెపో రేటుతో గృహ రుణాలను అనుసంధానం చేస్తూ ఈబిఎల్‌ఆర్ విధానాన్ని అనుసరిస్తోంది.

**'అమృత్ వృష్టి' స్పెషల్ ఎఫ్‌డి స్కీమ్‌లో వడ్డీ రేట్ల తగ్గింపు**

హోమ్‌లోన్‌లతో పాటు, ఎస్‌బీఐ తన 'అమృత్ వృష్టి' స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డి ) స్కీమ్‌లో వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 444 రోజుల కాలవ్యవధి కలిగిన ఈ స్కీమ్‌లో సాధారణ పౌరులకు 6.60%, సీనియర్ సిటిజన్లకు 7.10%, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.20% వడ్డీ లభిస్తుంది. ఈ రేట్లు జూన్ 15, 2025 నుంచి అమల్లోకి వస్తాయి. ఇతర ఎఫ్‌డి స్కీమ్‌లపై 3.3% నుంచి 6.7% వరకు వడ్డీ రేట్లు అందిస్తోంది.

## రెండో స్థానం కోల్పోయిన జెఫ్ బెజోస్

ప్రపంచ కుబేరుల జాబితా విడుదల



అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్స్ జాబితాలో రెండో స్థానాన్ని కోల్పోయారు. ఈ స్థానాన్ని ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సొంతం చేసుకున్నారు. ఎల్లిసన్ 243 బిలియన్ డాలర్ల సంపదతో రెండో ధనవంతుడిగా నిలిచారు. మే 2025తో ముగిసిన త్రైమాసికంలో ఒరాకిల్ అంచనాలను అధిగమించి ఆదాయం మరియు లాభాలలో గణనీయమైన వృద్ధిని సాధించింది. దీంతో ఒరాకిల్ షేర్లు గురువారం ట్రేడింగ్ సెషన్‌లో 13 శాతం పెరిగి, మొదటిసారిగా 200 డాలర్ల స్థాయిని తాకాయి. ఈ రోజున ఎల్లిసన్ సంపద ఒక్క రోజులో 26 బిలియన్ డాలర్లు పెరిగి, మొత్తం 243 బిలియన్ డాలర్లకు చేరింది. ఫోర్బ్స్ రియల్-టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం, జెఫ్ బెజోస్ సంపద 228 బిలియన్ డాలర్లుగా, మెటా సీఈఓ మార్క్ జుకర్బర్గ్ సంపద 239 బిలియన్ డాలర్లుగా ఉంది. వీరిద్దరినీ అధిగమించి లారీ ఎల్లిసన్ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ జాబితాలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ 407 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 610 | ₹ 59.2 |
| వరంగల్ | ₹ 612 | ₹59.4 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹1,01,400 (24 క్యారెట్లు) | ₹ 92,950 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹ 99,200 (22 క్యారెట్లు) | ₹1,01,200 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,20,000

# దలాల్ స్ట్రీట్‌లో ఐపీఓల హడావిడి

## ఐపీఓ క్యాలెండర్: 6 సబ్స్క్రిప్షన్లు, 5 లిస్టింగ్లు

దలాల్ స్ట్రీట్‌లో ఐపీఓల హడావిడి కొనసాగుతోంది. వచ్చే వారంలో స్టాక్ మార్కెట్ ద్వారా నిధులు సమీకరించేందుకు ఆరు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను ప్రకటించాయి. ఇందులో ఒక కంపెనీ ప్రధాన బోర్డు నుంచి, ఐదు కంపెనీలు ఎస్ఎంఈ విభాగం నుంచి రానున్నాయి. అలాగే, సబ్స్క్రిప్షన్ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసుకున్న ఐదు కంపెనీలు వచ్చే వారంలో స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అవనున్నాయి.




**ఐపీఓ సబ్స్క్రిప్షన్లు**

**అరిస్ఇన్ఫ్రా సొల్యూషన్స్**
**విభాగం:** ప్రధాన బోర్డు
**సబ్స్క్రిప్షన్ తేదీలు:** జూన్ 18 - 20, 2025
**ధరల శ్రేణి:** రూ.210 - 222
**సమీకరణ లక్ష్యం:** రూ.499.60 కోట్లు
**వివరాలు:** జేఎం ఫైనాన్షియల్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా ఉన్నాయి.

**పాటిల్ ఆటోమేషన్**
**విభాగం:** ఎస్ఎంఈ
**సబ్స్క్రిప్షన్ తేదీలు:** జూన్ 16 - 18, 2025
**ధరల శ్రేణి:** రూ.114 - 120
**సమీకరణ లక్ష్యం:** రూ.69.61 కోట్లు
**వివరాలు:** 58 లక్షల తాజా షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణ.

**ఎప్పెల్టోన్ ఇంజినీర్స్**
**విభాగం:** ఎస్ఎంఈ
**సబ్స్క్రిప్షన్ తేదీలు:** జూన్ 17 - 19, 2025
**ధరల శ్రేణి:** రూ.125 - 128
**సమీకరణ లక్ష్యం:** రూ.43.96 కోట్లు
**వివరాలు:** 34.34 లక్షల తాజా షేర్ల జారీ.

**సమయ్ ప్రాజెక్ట్ సర్వీసెస్**
**విభాగం:** ఎస్ఎంఈ
**సబ్స్క్రిప్షన్ తేదీలు:** జూన్ 16 - 18, 2025
**ధరల శ్రేణి:** రూ.32 - 34
**సమీకరణ లక్ష్యం:** రూ.14.69 కోట్లు
**వివరాలు:** 43 లక్షల తాజా షేర్ల జారీ.

**ఇన్‌ఫ్లక్స్ హెల్త్‌టెక్**
**విభాగం:** ఎస్ఎంఈ
**సబ్స్క్రిప్షన్ తేదీలు:** జూన్ 18 - 20, 2025
**ధరల శ్రేణి:** రూ.91 - 96
**సమీకరణ లక్ష్యం:** రూ.58.57 కోట్లు
**వివరాలు:** 50 లక్షల తాజా షేర్లు, 11 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా జారీ.

**మాయాషీల్ వెంచర్స్**
**విభాగం:** ఎస్ఎంఈ
**సబ్స్క్రిప్షన్ తేదీలు:** జూన్ 20 - 24, 2025
**ధరల శ్రేణి:** రూ.44 - 47
**సమీకరణ లక్ష్యం:** రూ.27.28 కోట్లు
**వివరాలు:** తాజా షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణ.

**లిస్టింగ్ వివరాలు**
**ప్రధాన బోర్డు:**
**ఓస్వాల్ పంప్స్:** జూన్ 18, 2025
**సోలార్ పంప్స్:** జూన్ 20, 2025

**ఎస్ఎంఈ విభాగం:**
**సచీరోమ్:** జూన్ 16, 2025
**మోనోలిథిష్ ఇండియా:** జూన్ 17, 2025
**జైనిక్ పవర్ అండ్ కేబుల్స్:** జూన్ 19, 2025

## అమెరికాతో అణు ఒప్పంద చర్చలు అర్థరహితం: ఇరాన్



ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్ అణుస్థావరాలపై 100కు పైగా బాంబులతో దాడులు చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా టెల్ అవీవ్‌పై సమాన స్థాయిలో ఎదురుదాడులు నిర్వహిఒచింది. ఈ యుద్ధ వాతావరణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌ను అణు ఒప్పంద చర్చలకు ఆహ్వానిస్తూ, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దీనిపై ఇరాన్ స్పందిస్తూ, అమెరికాతో అణు కార్యక్రమంపై చర్చలు అర్థరహితమని, ఇజ్రాయెల్ దాడులకు అమెరికా మద్దతు ఇస్తోందని ఆరోపించింది.

ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘై, అమెరికా ఒకవైపు దాడులకు మద్దతు ఇస్తూనే, మరోవైపు చర్చలకు ఆహ్వానించడం సరికాదని విమర్శించారు. ఇజ్రాయెల్ దాడులకు అమెరికా అనుమతి లేకుండా సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒమన్ మధ్యవర్తిత్వంలో ఇరాన్, అమెరికా మధ్య అణు ఒప్పంద చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఐదు సార్లు చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆదివారం ఆరో దఫా చర్చలు జరగాల్సి ఉంది, కానీ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇవి జరుగుతాయా అనే సందేహం నెలకొంది.

శుక్రవారం ట్రంప్ మరోసారి ఇరాన్‌ను హెచ్చరిస్తూ, అణు ఒప్పందం చేసుకోకపోతే ఇజ్రాయెల్ దాడులు మరింత ఉధృతమవుతాయని, పరిస్థితి నియంత్రణలో ఉండగానే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇజ్రాయెల్ దాడుల గురించి తమకు ముందే తెలుసని, కానీ తాము నేరుగా పాల్గొనలేదని ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతీకార దాడులకు దిగితే, అమెరికా సెంట్రల్ కమాండ్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని, తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇజ్రాయెల్‌కు కూడా రక్షణ కల్పిస్తామని వ్యాఖ్యానించారు.

## తొలి మృతదేహం కుటుంబానికి అప్పగింత

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం సంభవించిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిని డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తిస్తున్నారు. డీఎన్ఏ మ్యాచింగ్‌తో నిర్ధారించిన తొలి మృతదేహాన్ని శనివారం బాధిత కుటుంబానికి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విషాద వాతావరణం నెలకొంది. దుఃఖంలో ఉన్న బంధువులు మృతదేహాన్ని స్వీకరించారు. గుజరాత్ మంత్రి జగదీష్ విశ్వకర్మ ఈ సమయంలో అక్కడ ఉండి, అధికారిక ఎస్కార్ట్‌తో మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులు, సిబ్బంది, నేలపై ఉన్నవారితో సహా 270 మందికి పైగా మరణించారు. విమానంలో మంటల కారణంగా చాలామంది సజీవ దహనమయ్యారు. ఈ నేపథ్యంలో మృతులను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, డీఎన్ఏ పరీక్షల ప్రక్రియను సమీక్షించారు. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), హోం శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మృతులను గుర్తిం చి, వీలైనంత త్వరగా మృతదేహాలను కుటుంబా లకు అప్పగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు సంఘవి తెలిపారు.

## ఇరాన్ కీలక అధికారుల మృతి

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ మరో ఇద్దరు ప్రముఖ అధికారులను కోల్పోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్ అణుస్థావరాలపై దాడులు జరుపుతోంది. ఈ దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ నిఘా డిప్యూటీ జనరల్ ఘోలామ్రేజా మెహ్రాబీ, ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మెహదీ రబ్బానీలు మృతిచెందినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ విషయంపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. గురువారం అర్ధరాత్రి ఇజ్రాయెల్ నిర్వహించిన ఈ దాడుల్లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ చీఫ్ మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, సైనిక దళాల పర్యవేక్షకుడు జనరల్ మహమ్మద్ బాఘేరి, క్షిపణి కార్యక్రమ అధిపతి జనరల్ అమీర్అలీ హాజీజదేలతో పాటు పలువురు అణు శాస్త్రవేత్తలు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ ఎదురుదాడులకు దిగింది. శనివారం కూడా ఇజ్రాయెల్ టెహ్రాన్‌ను లక్ష్యంగా దాడులు కొనసాగిస్తుండగా, ఇరాన్ టెల్ అవీవ్‌పై క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి.



దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. జన్‌పథ్ రోడ్డులో ఉన్న సీసీఎస్ భవనంలో శనివారం ఉదయం మంటలు చెలరే గాయి. ప్రమాద సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుంది. దాదాపు 13 ఫైరింజన్లతో మంట లను అదుపు చేశాయి

## ఒడిశాలో పేలిన ఐఈడీ..

### సీఆర్పీఎఫ్ అధికారి మృతి

భువనేశ్వర్ : ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో శనివారం ఉదయం ఘోరం జరిగింది. మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తుండగా ఐఈడీ పేలింది. ఈ పేలుడు ధాటికి సీఆర్పీఎఫ్ అధికారి ప్రాణాలు కోల్పోయాడు. అప్రమత్తమైన ఒడిశా పోలీసులు.. ఐఈడీ పేలిన పరిసర ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. మృతి చెందిన సీఆర్పీఎఫ్ ఆఫీసర్‌ను ఏఎస్ఐ సత్యబాన్ కుమార్ సింగ్(34)గా గుర్తించారు. తీవ్ర గాయాలపాలైన కుమార్ సింగ్‌ను రూర్కేలాలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. కుమార్ సింగ్ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఖుషినగర్ జిల్లా. రూర్కేలాలోని కే బాలంగ్ గ్రామ సమీపంలోని అడవుల్లో సీఆర్పీఎఫ్ జవాన్లు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీసులు కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా ఐఈడీ పేలింది. ఈ ఘటన శనివారం ఉదయం 6 గంటలకు జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

## నూనె శ్రీధర్ కేసులో కూపీ లాగుతున్న ఎసిబి

### ఉన్నతాధికారి ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు గుర్తింపు

**హైదరాబాద్,జూన్14(జనంసాక్షి) :** అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన కాళేశ్వరం ఎస్ఈసీ నూనె శ్రీధర్ వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నూనె శ్రీధర్ వ్యవహారంలో మరి కొంతమంది ఇరిగేషన్ అధికారుల పాత్ర ఉన్నట్టుగా ఏసీబీ దర్యాప్తులో బయటపడింది. 2024 జూన్ 27న నూనె శ్రీధర్‌ను ఇరిగేషన్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఆదేశించారు. అయితే ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలను కూడా నూనె శ్రీధర్ పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ కూడా ఏడాది పాటు చొప్పదండిలోనే ఈఈగా శ్రీధర్ పని చేస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈఎన్‌సీ అనిల్ ఆదేశాల మేరకే శ్రీధర్ అక్కడే పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూనె శ్రీధర్‌కు ఈఎన్‌సీ అనిల్‌కు ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఇరిగేషన్ చీఫ్‌గా ఉండి ప్రిన్సిపాల్ సెక్రటరీ చేసిన ట్రాన్స్‌ఫర్‌ను కూడా ఆపినట్టు- అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నూనె శ్రీధర్‌ను కస్టడీకి తీసుకుని విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అలాగే ఈఎన్‌సీ అనిల్ పాత్రపైనా ఏసీబీ విచారణ జరిపే అవకాశం ఉంది. అక్రమాస్తుల కేసులో నూనె శ్రీధర్‌ను ఏసీబీ అరెస్ట్ చేయగా.. ఆయన చంచల్ గూడ జైలులో ఉన్నారు. శ్రీధర్‌కు సంబంధించిన అంశాలపై ఏసీబీ అధికారులు చాలా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎవరెవరితో సత్సంబంధాలు ఉన్నాయి, ఇరిగేషన్ శాఖ అధికారులతో నూనె శ్రీధర్‌కు ఉన్న సంబంధాలు ఏంటి.. ఇతనికి ఎవరైనా సహకారం అందించారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల శ్రీధర్‌కు సంబంధించి సుమారు 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో కీలకమైన పత్రాలు, ఆస్తుల చిట్టాను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎంతో గ్రాండ్‌గా శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపించారు. హైదరాబాద్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్లు నిర్వహించగా.. థాయిలాండ్‌లో వివాహం జరిపించారు. ఇందుకోసం శ్రీధర్ కోట్లు కుమ్మరించినట్లు తెలుస్తోంది. అయితే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు ఇంత భారీ మొత్తంలో ఆస్తులు, ఆదాయం ఎలా సమకూరింది అనే అంశాలపై ఏసీబీ దృష్టి సారించింది.

# బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల అదనపు పరిహారం



- **బోయింగ్ 787 భద్రతా తనిఖీలు:**
- **ఎయిర్ ఇండియా విమానాలు ఆలస్యం**

**న్యూఢిల్లీ:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఎయిర్ ఇండియా అదనంగా రూ.25 లక్షల పరిహారం ప్రకటించింది. ఇది టాటా సన్స్ ఇప్పటికే ప్రకటించిన రూ.1 కోటి పరిహారానికి అదనమని తెలిపింది. "తక్షణ ఆర్థిక అవసరాల కోసం మరణించిన వారి కుటుంబాలకు మరియు బయటపడిన వారికి రూ.25 లక్షలు (సుమారు 21,000 జీబీపీ) మధ్యంతర చెల్లింపుగా అందిస్తాము. ఇది టాటా సన్స్ ప్రకటించిన రూ.1 కోటి (సుమారు 85,000 జీబీపీ)కి అదనం" అని ఎయిర్ ఇండియా ఎక్స్‌లో పేర్కొంది.

టాటా సన్స్, ప్రమాదంలో మరణించిన ప్రయాణికులు, సిబ్బంది, నేలపై ఉన్నవారి కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందజేస్తామని శనివారం పునరుద్ఘాటించింది. గాయపడినవారి వైద్య ఖర్చులను భరిస్తూ, దీర్ఘకాలిక సహాయం, సంరక్షణ అందిస్తామని తెలిపింది.

ఎయిర్ ఇండియా సీఈఓ విల్సన్, బాధిత కుటుంబాలకు సహాయం కోసం 200 మందికి పైగా శిక్షణ పొందిన సంరక్షకులు అందుబాటులో ఉన్నారని, కౌన్సెలింగ్, సహాయ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. విమాన ప్రమాద దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తామని, డీజీసీఏ ఆదేశాల మేరకు బోయింగ్ 787 విమానాల భద్రతా తనిఖీలు జరుగుతున్నాయని వెల్లడించారు.

ఎయిర్ ఇండియా తమ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలపై పూర్తిస్థాయి భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు శనివారం వెల్లడించింది. "డీజీసీఏ నిర్దేశించిన ఒకసారి భద్రతా తనిఖీలను పూర్తి చేసే ప్రక్రియలో ఉన్నాం. ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానాల్లో 9 విమానాల తనిఖీలు పూర్తయ్యాయి. రెగ్యులేటర్ గడువులోగా మిగిలిన 24 విమానాల తనిఖీలను పూర్తి చేస్తాం" అని ఎక్స్‌లో పేర్కొంది. ఈ అదనపు భద్రతా తనిఖీల వల్ల, ముఖ్యంగా సుదూర అంతర్జాతీయ మార్గాల్లో విమాన ప్రయాణాలు ఆలస్యం కావచ్చని ఎయిర్ ఇండియా సూచించింది. ప్రయాణీకులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు విమాన షెడ్యూల్‌ను తనిఖీ చేయాలని సలహా ఇచ్చింది. తనిఖీల వల్ల ఆలస్యం లేదా రద్దు అయిన విమానాల కస్టమర్లకు డబ్బు వాపసు లేదా ఉచిత రీషెడ్యూలింగ్ అందిస్తామని తెలిపింది. గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై డీజీసీఏ స్పందించింది. జెనెక్స్ ఇంజిన్‌లతో కూడిన బోయింగ్ 787-8, 787-9 విమానాల భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించింది. ఇంధన వ్యవస్థలు, క్యాబిన్ ఎయిర్ కంప్రెషర్‌లు, హైడ్రాలిక్ సిస్టమ్‌లు, ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్‌లు, ఇంజిన్ పరీక్షలు వంటి ప్రమాద నివారణ చర్యలను చేపట్టాలని సూచించింది. జూన్ 15 నుంచి తనిఖీలు ప్రారంభించి, నివేదికలను డీజీసీఏకు సమర్పించాలని ఆదేశించింది. అహ్మదాబాద్ విమాన ప్రమాద కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

# ఉగ్రమూకలకు ఎదురొడ్డి ప్రాణార్పణం

### మరణించిన ఆదిల్ షా భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

**శ్రీనగర్,జూన్14(జనంసాక్షి) :** జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడి ఉదంతంలో ఎదురొడ్డి నిలిచిన ధీరుడి ఆత్మకు శాంతి కలిగే సంఘటన ఇది. పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో చిక్కుకున్న పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో స్థానికుడైన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా మరణించిన సంగతి తెలిసిందే. అతని కుటుంబ సభ్యులను జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఇవాళ కలుసుకున్నారు. దివంగత హుస్సేన్ షా భార్య గుల్నాజ్ అఖ్తర్‌కు ప్రభుత్వ ఉద్యోగమిస్తూ దానికి సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు భారత సర్కారుకు ధన్యవాదాలు తెలిపారు. కాశ్మీర్ లోని ఒక పేద కుటుంబంలో జన్మించి, ఇంటర్ చదివిన ఆదిల్.. అమర్‌నాథ్ యాత్ర సమయంలో పహల్గాంకు వచ్చే పర్యాటకుల కోసం పోనీ గైడ్‌గా పనిచేసేవాడు. యాత్రికుల్ని గుర్రంపై తీసుకెళ్లి వాళ్లకి అక్కడి ప్రదేశాలు చూపిస్తూ, వాటి గురించి వివరించేవాడు. ప్రతీ రోజులానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రమూక పర్యాటకులపై కాల్పులు జరుపుతోంది. దీంతో ఆదిల్ ఎంతో ధైర్య సాహసాలతో ఉగ్రవాదుల నుండి తుపాకీని లాక్కొని పర్యాటకుల్ని రక్షించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. దీంతో ఉగ్రమూక ఆదిల్‌ని గన్‌తో కాల్చి పొట్టన బెట్టుకున్నారు.

కాగా, ఏప్రిల్ 22న పహల్గాంలో ఐదుగురు సభ్యుల ఉగ్రమూక, అక్కడి మైదానంలో విహరిస్తున్న పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టు-కున్న సంగతి తెలిసిందే. ఈ మారణహోమానికి ఆదిల్ అహ్మద్ థోకర్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహించినట్టు- గుర్తించారు. ఇతడు పాకిస్తాన్ లో శిక్షణ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి ఇతర ఉగ్రవాదులతో సమన్వయం చేసుకుని, పర్యాటకులపై దాడికి పాల్పడ్డట్టు- సమాచారం. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి దాదాపు100 మంది ఉగ్రవాదుల్ని మట్టుపెట్టడం, తర్వాత ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగాయి.

## 10 మందికి భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 14 (జనంసాక్షి) : వేములవాడలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శనివారం మరో పదిమందికి చెక్కులు పంపిణీ చేశారు. తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేస్తున్న క్రమంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు. శుక్రవారం 40 మందికి శనివారం పదిమందికి చెక్కులను పంపిణీ చేశారు.

## సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసిన శ్రీనుబాబు



మంథని, జూన్ 14 (జనంసాక్షి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం ఇచ్చిన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిల్ల శ్రీనుబాబు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో, పెద్దపల్లి జిల్లాలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానన్నారు. తను తనపై నమ్మకంతో తనకు రాష్ట్ర పార్టీలో అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రికి, టీపీసీసీ అధ్యక్షుడికి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## గోశాలలో సిబ్బంది కోసం ఇంటర్వ్యూలు

- 40 పోస్టులకు 200 మందిని ఇంటర్వ్యూ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 14 (జనంసాక్షి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలో సిబ్బంది నియామకం కొరకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజన్న ఆలయానికి సంబంధించిన వేములవాడలోని తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది నియమాకానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ పోస్టులకు దాదాపు 250 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ అధికారులు కలిసి నిర్వహించారు. విద్యార్హత, పని అనుభవం తదితర వివరాలను అభ్యర్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 40 మందిని ఎంపిక చేసి త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన సిబ్బంది నియామకంతో గోశాలలో కోడెల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయి.

## రహ్మాత్ హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్



కరీంనగర్ బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి) : పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రహ్మాత్ హుస్సేన్ కు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుభాంకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడుగా ఉన్న రహ్మాత్ హుస్సేన్ కు పిసిసి లో చోటు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నానని భవిష్యత్తులో ఇంకా పార్టీ కోసం పని చేసిన వారందరికీ పదవులు రావాలని కోరుకుంటున్నానని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, శ్రవణ్ నాయక్, మిరాజ్, సుదర్శన్, కీర్తి కుమార్, ఆమీర్, ఇమ్రాన్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ అనుభవం గొప్ప అనుభూతి

నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 14 (జనం సాక్షి) : నిజామాబాద్ లో దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించడం ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందని, జిల్లాతో ఏర్పడిన అనుబంధం ఎన్నటికీ మర్చిపోలేనిదని జిల్లా కలెక్టర్ గా పనిచేసి ఇటీవలే బదిలీ అయిన రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. తాను బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ను ఆదర్శంగా తీసుకొని, నూతన ఒరవడితో పనిచేస్తానని నూతన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన టి.వినయ్ కృష్ణారెడ్డికి ఇదే వేదికపై స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు బదిలీ అయిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పనితీరును, ఆయనతో కలిసి పని చేసిన అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీగా బదిలీపై వెళ్తున్న రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ కలెక్టర్ గా తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి కింది స్థాయి ఉద్యోగి మొదలుకొని ప్రతి శాఖకు చెందిన అధికారులందరూ అన్ని విషయాల్లోనూ ఎంతగానో సహకరించారని అన్నారు. వారి తోడ్పాటు కారణంగానే జిల్లాను ధాన్యం సేకరణ వంటి అనేక అంశాలలో ముందంజలో నిలుపగలిగామని, వరుసగా వచ్చిన శాసన సభ, పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికలను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించడంలో సఫలీకృతం కాగలిగామని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున నిజామాబాద్ జిల్లాలో పని చేయడం వల్ల ధాన్యం సేకరణ, పసుపు, ఎర్రజొన్న వంటి అంశాలతో పాటు, సాగు రంగంపై మంచి అనుభవం ఏర్పడిందని, మునుముందు నిర్వర్తించే విధులకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు ఎంతో మంచివారని, అన్ని వర్గాల వారు అందించిన సహకారంతోనే జిల్లాను ప్రగతి దిశలో ముందంజలో నిలుపగలిగామని అన్నారు. జిల్లా పాలనాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని తెలిపారు. జిల్లాకు సమర్థవంతమైన అధికారి కలెక్టర్‌గా వచ్చారని, ఆయన నేతృత్వంలో జిల్లా మరింతగా ప్రగతి దిశగా పయనిస్తుందనే పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తిస్తూ అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, తనకు తోడ్పాటును అందించిన రీతిలోనే నూతన కలెక్టర్ కు కూడా పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బదిలీపై వెళ్తున్న రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కలెక్టర్ గా తనదైన ప్రత్యేకతను చాటారని, ఆయన ఒరవడిలోనే ముందుకు సాగుతూ నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో నిలిపేలా కృషి చేస్తానని అన్నారు. తాను ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతానని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని సూచించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్ తదితరులు బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి పని చేసిన అనుభవాలను నెమరువేసుకున్నారు. ఈ వీడ్కోలు సమావేశంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు ఉద్యోగ సంఘాల జెఏసి చైర్మన్ అలుక కిషన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, టీఎన్జీఓ ల సంఘం అధ్యక్షుడు సుమన్, పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి వి.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగల గుట్టు రట్టు



శంకర్‌పల్లి, జూన్ 14 (జనంసాక్షి) : ద్విచక్ర వాహనాలు దొంగిలించి..నకిలీ ఆర్ సీలు,నంబర్ ప్లేట్లతో విక్రయిస్తున్న ముఠాను శంకర్‌పల్లి పోలీసులు శుక్రవారం రాత్రి 10 గంటలకు పట్టుకున్నారు.శనివారం నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ శంకర్ పల్లి పీఎస్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.మెహిదిపట్నానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్(42) వృత్తి రీత్యా డ్రైవర్. కొన్నళ్ల కింద శంకర్ పల్లిలోని స్థానిక డబుల్ బెడ్ రూంలో అయ్యాడు.ఇతను నివాసము ఉంటూ నాలుగు నెలలుగా శంకర్‌పల్లి, నార్సింగి, మెహిందీపట్నం, అత్తాపూర్, గుడిమల్కాపూర్,కోటి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నాడని ముందుగా తన బైక్ పై షాపింగ్ మాల్స్,మార్కెట్ పార్కింగ్ లు,పబ్లిక్ ప్లేసుల్లో పగలు,రాత్రి రెక్కీ చేసి ద్విచక్ర వాహనాలను గుర్తించేవాడు. బైక్ ను చోరీ చేసి.. సేమ్ కలర్, సేమ్ కంపెనీకి సంబంధించి మరో వాహనం నంబర్ ప్లేట్, ఛాసిస్ నంబర్ ఫోటోలు తీసి తర్వాత ఆర్ టీఐ కి సంబంధించిన ఎం వ్యాలెట్ యాప్ ద్వారా ఛాసిస్ నెంబర్ ఎంటర్ చేసి ఆర్ సీని డౌన్ లోడ్ చేసేవాడు.వీటి అధారంగా ఆర్ సీ కార్డు తయారు చేసి.. ఆ నెంబర్ ప్లేట్ ను దొంగిలించిన వాహనానికి బిగించేవాడు. ఆ తర్వాత ఈ ఫోటోలను కొండాపూర్ కు చెందిన బొల్లు నాగరాజు అలియాస్ రాజు (38)కు పంపేవాడు.నాగరాజు ఆ ఫోటోలను తన స్నేహితులు, బంధువులకు పంపించి.. ఆ వాహనాలు బ్యాంక్ సీజ్ చేసినవి, మార్టిగేజ్ లో ఉన్నాయని చెప్పి తన కమీషన్ కలుపుకొని ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఇలా వాహన చోరీలకు సంబంధించి శంకర్ పల్లి పిఎస్ లో 4, నార్సింగి పీఎస్ లో 2,కుస్లంపుర పీఎస్ లో 2, గుడిమల్కాపూర్ పీఎస్1, అత్తాపూర్ పీఎస్ లో 2 కేసులు నమోదయ్యాడు.ఈ కేసును చాలెంజింగ్ గా తీసుకున్న శంకర్ పల్లి పోలీసులు శుక్రవారం రాత్రి నిందితులను అరెస్ట్ చేసి... వారి నుంచి 11 మోటార్‌సైకిల్స్,నగదు రూ. 8,000ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని,మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు.

## నంది వనపర్తిలో అంగరంగ వైభవంగా ఓంకారేశ్వర స్వామి జాతర మహోత్సవ వేడుకలు



యాచారం, జూన్ 14 (జనంసాక్షి) : శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థానం నంది వనపర్తి నందు శ్రీ ఓంకారేశ్వర స్వామి శ్రీ కోదండ రామస్వామి గురు దత్తాత్రేయ స్వామి జాతర మహోత్సవాల ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించారు. కొంగళ్ళ రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ధ్వజస్తంభ ఇత్తడి కలశ కవచంను వారి కుటుంబ సభ్యులు కొంగళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట రెడ్డి, జోగి రెడ్డి అనూరాధ లు కమిటీ సభ్యులకు అందజేశారు. తండ్రి కోరికను ఈ విధంగా పరిపూర్ణం చేసినందుకు వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్య ప్రాప్తి కలగాలని భగవంతుని వేడుకుంటూ చివరి రోజు అగ్నిగుండాల కార్యక్రమం మరియు రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహం పొందారు. శనివారంతో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పరివార దేవతల సప్తమ త్రయాన్నిక జాతర మహోత్సవాల ముగింపుతో లోకా సమస్త సుఖినోభవంతు సర్వేజనా సుఖినోభవంతు సర్వం శ్రీ ఓంకారేశ్వర స్వామికి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పప్పు వెంకట శివ కుమార్ కాశ్యపన్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బత్తిన శ్రీనివాసరావు గ్రామస్తులు భక్తజన బృందం పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం కోసమే లోక్‌అదాలత్ సేవలు

- చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జీ దశరథ రామయ్య




చేవెళ్ల, జూన్ 14 (జనంసాక్షి) : పెండింగులో సత్వర కేసుల పరిష్కారం కోసమే లోక్‌అదాలత్ సేవలను నిర్వహించడం జరుగుతుందని చేవెళ్ల సీనియర్ సివిఎల్ జడ్జీ దశరథ రామయ్య తెలిపారు. శనివారం చేవెళ్ల కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తులు మాట్లాడుతూ...లోక్ అదాలత్లో భాగంగా మొత్తం 1,271 కేసులు పరిష్కరించి రూ.16 లక్షల 62వేల 690/- జరిమానాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్జీదారులు, కక్షిదారులు ఇరువురు కలిసి రాజీకి వచ్చే కేసులను లోక్ అదాలత్లో పరిష్కరించ బడుతుందన్నారు. ఇందులో చాలా వరకు మద్యం సేవించి వాహనాలు, నడపడం హెల్మెంట్ లేకుండా వాహనాలు డ్రైవ్ చేయడం కేసులు అధికంగా ఉన్నాయన్నారు. వాహనదారుల తమ వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వాహనదారుల తప్పని సరిగా ట్రాఫిక్ రూల్ పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. రాంగ్ రూట్లలలో వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్న కేసులను పరిష్కరించుకోవడమే ఉత్తమం అని చెప్పారు. లోక్ అదాలత్ లో పరిష్కరించిన కేసులను తిరిగి పై కోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాధి శ్యామ్కుమార్, విశ్రాంత న్యామూర్తి లక్ష్మణ్, బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షులు జి.కృష్ణగౌడ్, నర్సింలు, లీగల్ కౌన్సిలర్ కుమార్, చేవెళ్ల సీఐలు భూపాల్ శ్రీధర్, వెంకటేశం, ట్రాఫిక్ ఏఎస్పై చందర్ నాయక్, కోర్టు అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## స్కూల్ పిల్లల వాహనాలు మంచి స్థితిలో ఉండాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



సూర్యాపేట ప్రతినిధి, జూన్ 14 (జనంసాక్షి) : విద్యాసంస్థలు, పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా పాఠశాలలకు విద్యార్థులను రవాణా చేసే వాహనాలు మంచి కండిషన్‌లో ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ శనివారం ఒక ప్రకటనలో అన్నారు.వాహనాల నిర్వహణలో నియమ నిబంధనలు పాటించాలని, స్థితిగతులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలన్నారు. లోపాలు సవరించుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలను, వాహనాల యజమానులను ఆదేశించారు. విద్యాసంస్థలకు విద్యార్థులను రవాణా చేస్తున్నటువంటి బస్సులు, వ్యానులు, ఆటోలు, ఇతర రవాణ తరహా వాహనాలు ఏవైనా మంచి కండిషన్ లో ఉండాలని, వాటి నడిపే డ్రైవర్లు మంచి నైపుణ్యం కలిగి క్రమశిక్షణతో వాహనాలు నడపాలని పేర్కొన్నారు.వాహన సామర్థ్యానికి మించి పిల్లలను రవాణా చేయవద్దన్నారు. వాహనాల్లో మ్యూజిక్ పరికరాలు ఉపయోగించవద్దని తెలిపారు.అతి వేగంగా, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దన్నారు.రోడ్డు క్రాసింగ్ ల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.విద్యార్థులను తీసుకొచ్చే క్రమంలో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

# జపాన్ సకురా సైన్స్ ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థిని

కరీంనగర్ బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి) : స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ సి.బి.యస్.సి పాఠశాల కు చెందిన విద్యార్థిని ఎస్. శుభశ్రీ, రైతుల ప్రయోజనం కోసం వినూత్న ఆగ్రో మెషీన్‌ను రూపొందించడం ద్వారా ఇన్స్పైర్ మనక్ అవార్డులో భాగంగా ఈ నెల 15 వ తేదీ నుండి 21 వ తేదీ వరకు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ నిర్వహించనున్న సకురా సైన్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్ లో పాల్గొన నుందని పాఠశాల ప్రదానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం సి.బి.యస్.సి. 12 వ తరగతి చదువుతున్న శుభ శ్రీ, పారమిత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సమయంలో చేసిన ప్రాజెక్టు ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైంది. శుభశ్రీ తన గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూలమైన, మల్టిఫంక్షనల్, తక్కువ ధర , పోర్టబుల్ వ్యవసాయ యంత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసింది. శుభ శ్రీ రూపొందించిన యంత్రం నూర్పిడి



, ధాన్యాన్ని వేరు చేయడం, గడ్డిని కత్తిరించడం, విన్నోవింగ్ బ్యాగ్ కుట్టడం వంటి నాలుగు వేర్వేరు కార్యకలాపాలతో సమర్థవంతంగా పని చేస్తుంది, ఒకే ప్రక్రియలో మేతగా ఉపయోగించబడుతుంది. శుభ శ్రీ తయారుచేసిన మోడల్ సౌర శక్తితో పనిచేస్తుంది. తద్వారా అధిక విద్యుత్ వినియోగం , భారీ వ్యయం, యూనిట్ పనితీరు వంటి అంశాలను తొలగిస్తుంది. జిల్లాస్థాయి నుండి ఈ ప్రాజెక్టు అంచెలంచెలుగా అందరి ప్రశంసలు పొందుతూ నేడు జపాన్ సకురా ప్రాజెక్టుకి ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మొండయ్య, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ కార్యదర్శి స్వదేశ్ కుమార్, పారమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు శుభశ్రీ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ప్రసూన,అనూకర్ రావు,రశ్మిత, ప్రాచీ, రమణ, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, టి.యస్.వి.రమణ, హన్మంత రావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## నీట్ 2025 ఫలితాల్లో కరీంనగర్ నారాయణ విద్యార్థుల విజయకేతనం




కరీంనగర్ బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి) : కరీంనగర్ నారాయణ కాలేజ్ విద్యార్థులు నీట్ 2025 ఫలితాల్లో అఖండ విజయం సాధించారని నారాయణ జూనియర్ కాలేజ్ అసోసియేట్ డీన్ కె. రమేష్ రెడ్డి, ఏజీఎం. ఎస్. తిరుపతి తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... మా విద్యార్థులు ఎస్. సాయిచంద్ 487, ఎ. జగదీష్ 406, బి. సంస్కృత 376, కె. సంజీవ్ 362 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినారని తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ నారాయణ జూనియర్ కాలేజ్ అసోసియేట్ డీన్ కె. రమేష్ రెడ్డి, ఏజీఎం .ఎస్. తిరుపతి సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల జిఎం కాట్రగడ్డ శ్రీనివాసరావు, కోర్ డిన్. ఎన్. నటరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులని, అధ్యాపకలని అభినందించారు.

# డబ్ల్యూటీసీ విజేతగా సౌతాఫ్రికా..

- 27 ఏళ్ల కల సాకారం
- 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలుపు
- మార్క్రామ్ కీలక ఇన్నింగ్స్



**లండన్ (జనంసాక్షి) :** దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. శనివారం సౌతాఫ్రికా జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించింది. దక్షిణాఫ్రికా జట్టు క్రికెట్ ఏ ఫార్మాట్‌లోనైనా మొదటిసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఇది మాత్రమే కాదు, సౌతాఫ్రికా జట్టు 27 సంవత్సరాల తర్వాత ఐసిసీ టోర్నమెంట్‌ను గెలుచుకుంది. అంతకుముందు సౌతాఫ్రికా జట్టు 1998లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది.లండన్‌లోని లార్డ్స్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు భోజన విరామానికి ముందే దక్షిణాఫ్రికా 5 వికెట్లకు 282 పరుగుల లక్ష్యాన్ని చేరుకుంది. ఐడెన్ మార్క్రామ్ 136 పరుగులు చేయగా, టెంబా బావుమా 66 పరుగుల ఇన్నింగ్స్ ఆడారు. రెండో ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 218 పరుగులు చేసి దక్షిణాఫ్రికాకు 282 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 212 పరుగులు చేయగా, దక్షిణాఫ్రికా 138 పరుగులు చేసింది. ఇక్కడ కంగారూ జట్టు 74 పరుగుల ఆధిక్యాన్ని పొందింది. లార్డ్స్‌లో జరిగిన నాల్గవ ఇన్నింగ్స్‌లో, మొత్తం 200ం పరుగుల లక్ష్యాన్ని 4 సార్లు మాత్రమే ఛేదించినట్లు రికార్డులు చెబుతున్నాయి. దీని కారణంగా దక్షిణాఫ్రికాకు విజయం కొంచెం కష్టంగా అనిపించింది. సమస్య ఏమిటంటే, దక్షిణాఫ్రికా దీనికి ముందు 5 సార్లు మాత్రమే టెస్టుల్లో మొత్తం 250ం పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. అది కూడా, చివరిసారిగా 2008 సంవత్సరంలో అలా చేసింది. కానీ, ఐడెన్ మార్క్రామ్, టెంబా బావుమా బ్యాటింగ్ చేసిన విధానం తర్వాత, దక్షిణాఫ్రికాకు ఎటువంటి ప్రతికూలతలు ఎదురుకాలేదు. దీంతో విజయానికి మార్గం సులభం అయింది. ఫలితంగా దక్షిణాఫ్రికా చరిత్ర సృష్టించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా మూడో రోజునే 2 వికెట్లకు 213 పరుగులు చేసింది. దీనిలో టెంబా బావుమా, ఐడెన్ మార్క్రామ్ మధ్య మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించింది. అయితే, నాల్గవ రోజు ఆట ప్రారంభమైనప్పుడు ఆ భాగస్వామ్యంలో గణనీయమైన పెరుగుదల కనిపించలేదు. మూడవ రోజు 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన టెంబా బావుమా, నాల్గవ రోజు తన స్కోరుకు మరో పరుగు మాత్రమే జోడించగలిగాడు. పాట్ కమ్మిన్స్ అతన్ని పెవిలియన్ చేర్చాడు. మూడవ వికెట్‌కు బావుమా, మార్క్రామ్ మధ్య మొత్తం 147 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. టెంబా బావుమా, ఐడెన్ మార్క్రామ్‌ల భాగస్వామ్యానికి బ్రేకులు పడొచ్చు. కానీ, బ్రేక్ అవ్వడానికి ముందే, వారిద్దరూ తమ పనిని పూర్తి చేశారు. తమ జట్టును విజయ ఢంకా మోగించి డబ్ల్యూటీసీ టైటిల్‌ను కైవసం చేసుకునే స్థాయికి తీసుకువచ్చారు. మంచి విషయం ఏమిటంటే, బావుమా ఔట్ అయిన తర్వాత, మార్క్రామ్ ఒక చివరలో నిలిచి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. అయితే, మార్క్రామ్ అద్భుతమైన ఇన్నింగ్స్ విజయానికి 6 పరుగుల ముందు ముగిసింది. మార్క్రామ్ 136 పరుగులు చేశాడు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## రాబోయే మూడు టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ ఇంగ్లాండ్‌లోనే!!

- బీసీసీఐ ఆశలకు బ్రేక్ వేస్తూ ఐసీసీ కీలక నిర్ణయం!



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు బీసీసీఐ ఎన్నో ఆశలు పెట్టుకుంది. వాటికి బ్రేక్ వేస్తూ ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే మూడు టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌ను ఇంగ్లాండ్‌లోనే నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించినట్లు సమాచారం వచ్చింది. అసలు ఇది ఎంత వరకు నిజమనేది తెలియాల్సి ఉంది. దీని పై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. టెస్ట్ ఫార్మాట్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ ఎంతో ప్రతిష్ఠాత్మకం. ఈ టోర్నమెంట్ విశేష ప్రేక్షకాదరణను కలిగి ఉంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక పోరుకు ఆతిథ్యం ఇవ్వాలని బీసీసీఐ ఆసక్తి చూపిస్తోంది. బీసీసీఐ ఆశలకు ఐసీసీ బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్నట్లుగానే డబ్ల్యూటీసీ ఫైనల్‌ను వచ్చే మూడు సీజన్లలోనూ ఇంగ్లాండ్‌లోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై వచ్చే నెలలో అధికారికంగా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్స్‌ను 2021 నుంచి నిర్వహిస్తున్నారు. 2023-25 సైకిల్‌లో భాగంగా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆస్ట్రేలియా - దక్షిణాఫ్రికా మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతోంది. ఈ సీజన్‌తో కలిపి ఇప్పటివరకు మూడు ఎడిషన్లు ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లు ఇంగ్లాండ్‌లోని సౌతాంప్టన్, ఓవల్, లార్డ్స్ మైదానాల్లో నిర్వహించారు. అయితే భారత్‌లో కూడా ఈ ఫార్మాట్‌కు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌కు భారత్‌కు ఆతిథ్య హక్కులు ఇవ్వాలని బీసీసీఐ కోరుతుంది. కానీ, బీసీసీఐ విజ్ఞప్తి పట్ల ఐసీసీ సుముఖత చూపడం లేదని సమాచారం.రాబోయే 2027, 2029, 2031సంవత్సరాలలో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌లకు ఇంగ్లాండ్‌కే ఆతిథ్య హక్కులు ఇవ్వాలని ఐసీసీ నిర్ణయించింది. దీనిపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. జులైలో సింగపూర్ వేదికగా జరిగే ఐసీసీ వార్షిక సదస్సులో ఈ విషయం పై అధికారికంగా ఆమోదించి, ప్రకటనను విడుదల చేయనున్నట్లుగా క్రీడా వర్గాలు వెల్లడించాయి. ఈ విషయం పై పలు ఆంగ్ల మీడియాలలో కథనాలు వస్తున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజుకు చేరుకుంది. ఈ పోరులో దక్షిణాఫ్రికా విజయానికి మరింత చేరువైంది. 2025-27 సైకిల్ కూడా ఇంగ్లాండ్‌లోనే మొదలు పెట్టనున్నారు. జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లాండ్ మధ్య 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు రెండుసార్లు వెళ్లినా, విజయాన్ని అందుకోలేకపోయింది.

# మార్క్‌రమ్, బవుమా వల్లే ఓటమి

- ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్



**లండన్ (జనంసాక్షి) :** ఎయిడెన్ మార్క్‌రమ్, టెంబా బవుమా అసాధారణ బ్యాటింగ్‌తోనే తాము ఓటమిపాలయ్యామని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో భాగంగా సౌతాఫ్రికాతో శనివారం ముగిసిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ గెలుపుతో సౌతాఫ్రికా 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ఐసీసీ టైటిల్‌ను అందుకుంది. తమపై పడిన చోకర్స్ ముద్రను ఈ విజయంతో చెరిపేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన ప్యాట్ కమిన్స్.. సౌతాఫ్రికా జట్టుపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ విజయానికి వారు పూర్తి అర్హులని కితాబిచ్చాడు. కొన్ని విషయాల్లో తమ జట్టు విఫలమైందని, మార్క్‌రమ్, బవుమా తమకు అవకాశం ఇవ్వలేదని చెప్పాడు. 'పరిస్థితులు త్వరగా మారుతాయి. కానీ దురదృష్టవశాత్తు ఈ మ్యాచ్‌లో చాలా వేగంగా పరిస్థితి మా చేయి ధాటిపోయింది. మేం కొన్ని విషయాల్లో మెరుగ్గా రాణించలేదు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత ప్రత్యర్థిని త్వరగా ఔట్ చేయలేకపోయాం. నాలుగో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా మాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. మా టాప్-7లో కొన్ని సమస్యలు ఉన్నాయి. గత రెండేళ్లుగా మా ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. తొలి రెండు రోజులు మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. మేం ప్రతీది ప్రయత్నించాం. నాథన్ లయన్ బాగానే బౌలింగ్ చేశాడు. కానీ అతనికి వికెట్ దక్కలేదు. మార్క్‌రమ్, బవుమా మాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. సౌతాఫ్రికా జట్టు తమ సత్తా ఏంటో చాటి చెప్పింది. ఈ విజయానికి వారు పూర్తి అర్హులు. ఈ మ్యాచ్ అసాంతం వారు పట్టు వదల్లేదు. టెస్ట్ క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. ఫైనల్‌కు చేరడమే గొప్ప ఘనత. రెండేళ్ల పాటు సాగిన టోర్నీని షూటౌట్ తరహాలో ఒక్క మ్యాచ్‌తోనే ఫలితం తేల్చడం అద్భుతం. ఫలితం మాకు అనుకూలంగా లేదు. కానీ ఇదో గొప్ప వారం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.

# కమిన్స్ పై మాజీ క్రికెటర్ల విమర్శలు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌పై ఆ దేశ దిగ్గజ క్రికెటర్ మాథ్యూ హెడెన్‌తో పాటు సౌతాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ విమర్శలు గుప్పించారు. ప్యాట్ కమిన్స్ కెప్టెన్సీ సరిగ్గా లేదన్నారు. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సౌతాఫ్రికా విజయం ముంగిట నిలిచింది. 282 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 56 ఓవర్లలో 2 వికెట్లకు 213 పరుగులు చేసింది. ఎయిడెన్ మార్క్‌రమ్(159 బంతుల్లో 11 ఫోర్లతో 102 బ్యాటింగ్) సెంచరీతో చెలరేగితే.. టెంబా బవుమా(121 బంతుల్లో 5 ఫోర్లతో 65 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 143 పరుగులు జోడించారు. సౌతాఫ్రికా విజయానికి 69 పరుగుల అవసరం కాగా.. ఆస్ట్రేలియా గెలవాలంటే 8 వికెట్లు కావాలి.అయితే ఈ పరిస్థితికి ప్యాట్ కమిన్స్ చెత్త కెప్టెన్సీ కారణమని డేల్ స్టెయిన్, మాథ్యూ హెడెన్ అన్నారు. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ కాకుండా డిఫెన్సివ్ ఫీల్డింగ్‌తో మూల్యం చెల్లించుకున్నాడని విమర్శించారు. 'ఫీల్డ్ సెటప్ విషయంలో ఆసీస్ తప్పిదం చేసింది. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ కాకుండా డిఫెన్సివ్ ఫీల్డింగ్‌తో మూల్యం చెల్లించుకుంది. ర్యాన్ రికెల్టన్, మల్డర్‌లను ఔట్ చేసిన తర్వాత బవుమాపై ఆసీస్ ఒత్తిడి తేవాల్సింది. ముఖ్యంగా క్యాచింగ్ కవర్ ఏరియాస్‌లో తక్కువ డిఫెన్సివ్‌గా.. మరింత అటాకింగ్‌గా ఫీల్డ్ పెట్టాల్సింది. ఆరంభంలో బంతులు కాస్త పైకి లేచి ఉంటే సౌతాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయేది. ఆస్ట్రేలియా మ్యాచ్‌పై పట్టు సాధించేది. కానీ ఆసీస్ పెద్ద పొరపాటు చేసింది.ఆట స్వభావం మారడం వల్ల స్ట్రైక్ రొటేషన్ సులువైంది. భాగస్వామ్యం పెరగడంతో సఫారీ బ్యాటర్ల ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. మరోవైపు ఆసీస్ బౌలింగ్ లైనప్ ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. పిచ్ కండిషన్స్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయి. కానీ డబ్ల్యూటీసీ గెలవాలంటే ప్రత్యర్థిని ఆలౌట్ చేయాల్సిందే.'అని మాథ్యూ హెడెన్ చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా వ్యూహాలపై డేల్ స్టెయిన్ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. బంతి స్లిప్స్‌లోకి కూడా వెళ్లని పిచ్‌పై మెరుగైన క్యాచింగ్ పొజిషన్స్ పెట్టాల్సిందన్నాడు. 'ఆసీస్ ఫీల్డ్ సెటప్ నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆటకు అనుగుణంగా మన వ్యూహాలు మారాలి. ఈ రోజు బంతి ఎక్కువగా బౌన్స్ కాలేదు. స్లిప్ ఫీల్డర్ వైపు బంతి వెళ్లనే లేదు. భారత్ వంటి కండిషన్స్‌లో షార్ట్ కవర్, షార్ట్ మిడ్ వికెట్ ఫీల్డర్స్‌ను పెట్టవచ్చు. కానీ సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి కండిషన్స్‌లో కార్డన్ స్లిప్స్ బెటర్. బంతి వేగంగా వెళ్లని పరిస్థితుల్లో మెరుగైన క్యాచింగ్ పొజిషన్స్‌లో ఫీల్డర్స్‌ను పెట్టాలి.'అని డేల్ స్టెయిన్ అభిప్రాయపడ్డాడు.

# తెలంగాణలో స్థానిక సందడి

- మంత్రుల ప్రకటనలతో నేతల అలర్ట్
- గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి



**హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) :** తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతున్నాయని అనుకోవచ్చు. ఇటీవల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. పార్టీలన్నీ ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. నేతలంతా ఏదో ఒక కార్యక్రమంలో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కూడా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. బిఆర్‌ఎస్ దీనిని బాగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టిస్తోంది. తెలంగాణ సస్యశ్యామలం కావడమే గాకుండా బంగారు తునకగా మారిందన్న ప్రచారంతో నేతలు, అధినేతలు తరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు కూడా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నేరుగా ఓటరు వద్దకు వెళ్లుతున్నాయి. ఎమ్మెల్యేలు జనంలో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ తమ గెలుపునకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతిపక్ష ఆశావహులు సైతం గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో స్థానిక ఉన్నికల హడావిడి కనిపిస్తోంది. నిత్యం ఎదో ఒక పార్టీ నేత, ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల వద్దకు వస్తున్నారు. తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికి ఎన్నికల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు తమ దూకుడును పెంచుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హడావిడి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. విమర్శలు చేస్తున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సులు ఇతర కార్యక్రమాల్లో భాగంగా ఊరూవాడ చుట్టేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇతర ప్రజాప్రతినిధులు ప్రజలతో భాగస్వామ్యమై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపోతే విపక్ష బిఆర్‌ఎస్ గతంలో కెసిఆర్ సర్కార్ చేపట్టిన పథకాలను వివరించడం, లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయ నిధి వంటి పథకాలు అటకెక్కాయని విమర్శలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. స్థానిక నేతలు నియోజకవర్గాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన అందిస్తోందని విమర్శిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీలు ఇప్పుడు ప్రజల్లో ఉంటున్నాయి. తమ ఘనతను చాటుతున్నాయి. తామే బెటర్ అని చెప్పుకుంటున్నాయి.

# దేశానికి ఆదర్శం కాళేశ్వరం

- దానిని ఉపయోగించే పని చేయండి
- మాజీమంత్రి వేముల సూచన



**నిజామాబాద్, జూన్14 (జనంసాక్షి) :** తెలంగాణలో గత సిఎం కెసిఆర్ అనుసరించిన రైతు విధానాలను కాంగరెస్ పాటించివుంటే రైతులకు ఇన్ని కష్టాలు వచ్చివుండేవి కావని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంను ఎలా ఉపయోగించుకోవాలో కూడా వీరికి తెలియడం లేదన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలిచిందని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపించిన కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని ముందుకు నడిపించారని అన్నారు. అయితే కాంగ్రెస్ ఇవన్నీ పక్కన పెట్టి కాళేశ్వరంపై బురదజల్లే చర్యలకు ఉపక్రమించిందని అన్నారు. తెలంగాణ రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేసిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించామని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు కేసీఆర్‌ను కొనియాడాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. కాళేశ్వరంలో నీళ్లు ఎలా లిఫ్ట చేయాలో తెలియక పొలాలు ఎండబెట్టారని, ప్రాజెక్టుల్లో నీరు చేరకుండా చేశారని అన్నారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్దరణ కారణంగా జలకళను సంతరించుకున్నాయని అన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టాలని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని అన్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న దంపతులు

**వారితో పాటు మరో ఇద్దరి పట్టివేత**

**రాజమండ్రి, జూన్ 14 (జనంసాక్షి) :** అక్రమ గంజాయి నిల్వ ఉంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్న భార్యాభర్తలు, వీరికి సహకరిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి ఒక వ్యాన్, కారు, రెండు మోటారు సైకిళ్లను, రేకుల షెడ్ సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి కేసుకు సంబంధించిన వివరాలను రాజమండ్రి నార్త్ జోన్ డిఎస్పీ వై. శ్రీకాంత్ వెల్లడించారు. రాజానగరం మండలంలో కొండగుంటూరు కొండాలమ్మ గుడి సమీపంలో ప్రైవేట్ లే అవుట్ రేకుల షెడ్ లో వీరిని పోలీసులు పట్టు-కున్నారని తెలిపారు. ఒరిస్సా జిల్లా చిత్రకొండ రఘువీర్ రాయ్, ఇతని భార్య ప్రశాంతి రాయ్ గంజాయి అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్న కేసులో అరెస్టు చేశారు పోలీసులు. కారులో భార్యాభర్తలు గంజాయి తీసుకుని వచ్చినట్లు- తెలిసి పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వీరికి సహకరించిన ఒరిస్సా రాష్ట్రం మల్కాగిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగుడ పంచాయతీ సురేష్ చంద్ర కులదీప్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరు గ్రామానికి చెందిన చందన్ మండల్ ను అరెస్టు చేశారు. కారులో నుంచి 11 ప్యాకెట్లు 23.101 కేజీల గంజాయి దించుతుండగా దాడులు చేసి పట్టు-కున్నారు. గంజాయి, రవాణాకు ఉపయోగిస్తున్న ఒక వ్యాన్, కారు, రెండు బైకులను సీజ్ చేశారు. ఈ అక్రమ సంపాదనతో కొంతమూరులో విశాలమైన ఇల్లు కొనుగోలు చేసుకుని నివాసం ఉంటున్నారు నిందితులు. కొండ గుంటూరులో రేకుల షెడ్ సీజ్ చేశారు. కొంతమూరు ఇల్లు సీజ్ చేయడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు

# నైరుతి మందగమనంతో వర్షాలు ఆలస్యం

- రైతన్నన్నను కుంగదీస్తున్న వర్షాభావం
- తొలకరి ఆలస్యంతో రైతుల్లో ఆందోళన



**హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) :** ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం ఉందా లేక వానాకాలమేనా అన్నట్లుగా ఉంది. రుతుపవనాలు వచ్చి పక్షం రోజులు దాటినా పూర్తిస్థాయిలో వర్షాలు కురియడం లేదు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారంరోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండుటెండలు, వడగాల్పులు చూస్తుంటే మరో వారం దాకా తొలకరి చిలకరించే పరిస్థితి కానరావడం లేదు. ఇప్పటికే నైరుతి తొందరగా వచ్చింది. అయినా సకాలంలో వర్శాలు కరియడం లేదు. దీంతో సాగు భూములకు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. వర్షాలు లేకపోవడం వల్ల మొలిచిన మొక్కలు ఒక పక్క ఎండుతుండగా, మరో పక్క సాగు భూములు నెర్రలు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కనీసం ఒక్క చినుకైనా గట్టిగా కురియకపోతే విత్తులు మురిగిపోవడం ఖాయంగా కనినిస్తోంది.మృగశిర కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురియడం ఆనవాయితీ. అప్పుడే విత్తనాలు వేస్తారు. ఓ వైపు వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నా వినలేదు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఇక మొలచిన మొక్కలను బతికించుకొనేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షాధారంపైనే ఆధారపడిన రైతులు అష్టకష్టాలు పడుతన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలు వెంటాడుతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో ఎప్పుడు పడతాయోనని వాపోతున్నారు. నైరుతి రుతుపవనాలు మే నెలాఖరుకే రాష్టాన్ని తాకాయి. రెండు రోజుల్లో తెలంగాణలోని మరికొన్ని జిల్లాలకు, ఆ తర్వాతి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 జూన్ 2025

# కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపికి ప్రేమ

- మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) : కాంగ్రెస్, బిజెపిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చుకుంటే.. రాష్ట్ర బిజెపి నేతలకు నొప్పిలేస్తుందని అన్నారు. తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టులలో జరుగుతున్న నష్టాల మీద రాష్ట్ర బిజెపి నేతలు, ప్రజా ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నష్టాలపై ఎలాంటి కమిషన్లు వేయదని.. విచారణ కూడా చేయదన్నారు. శ్రీశైలం సొరంగం కూలినా.. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినా.. వట్టెం పంప్ హౌస్ మునిగినా.. కేంద్రం ఎందుకు కమిషన్లు పంపడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. వాటి మీద విచారణకు రాష్ట్ర బిజెపి నేతలు ఎందుకు డిమాండ్ చేయరని నిరంజన్ రెడ్డి నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చితే బీజేపీ నేతలకు నొప్పిలేస్తుందని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తే బీజేపీ నేతలు స్పందించారని తెలిపారు. ఏపీ జలదోపిడీ విషయంలో బీజేపీ నేతలు, కాంగ్రెస్ నేతలు నోరెత్తడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టులలో జరుగుతున్న నష్టాల మీద కేంద్రప్రభుత్వం స్పందించదు .. ఎలాంటి కమీషన్లు వేయదు .. విచారణ చేయదు .. బీజేపీ నేతలు, ప్రజా ప్రతినిధులు స్పందించరని తెలిపారు. శ్రీశైలం సొరంగం కూలినా, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినా, వట్టెం పంప్ హౌస్ మునిగినా కేంద్రం ఎందుకు కమీషన్లు పంపడం లేదు ? వీటి మీద కమీషన్లు వేయమని బీజేపీ నేతలు ఎందుకు డిమాండ్ చేయరు ? అని ప్రశ్నించారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీలు బద్ద శత్రువులు .. రాష్ట్రంలో వారు కలిసి ప్రయాణం చేస్తున్నారనడానికి వంద ఉదాహరణలున్నాయన్నారు. తెలంగాణలో విఫలమైన ప్రాజెక్టుల మీద బీజేపీ నేతలు ఎందుకు స్పందించరు ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం మీద చూపిన అత్యుత్సాహం బీజేపీ ప్రభుత్వం మిగతా వాటి మీద ఎందుకు చూపదు ? అని తెలిపారు. తెలంగాణ బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ ఆంధ్రా పర్యటనలో తెలంగాణ కంటే పదిరెట్ల నిధుల వరద పారించాం అని చెప్పుకోవడం సిగ్గుచేటు అని తెలిపారు. టీబీఎం సాధ్యం కాదు కాబట్టి ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నాం అని నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చావు కబురు చల్లగా చెప్పారని తెలిపారు. కొత్త టీబీఎం మిషన్ తెచ్చి మరో వైపు నుండి సొరంగం తవ్వుతామని చెబుతున్నారన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఒక సంస్థ మాత్రమే వీటిని తయారు చేస్తుంది .. మనం టీబీఎం మిషన్ కొలతల ప్రకారం తయారు చేయడానికే మూడేళ్లు పడుతుందని తెలిపారు. సొరంగమార్గం ద్వారా 3 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని సమైక్య రాష్ట్రంలో నిర్ణయం తీసుకుని పనులు మొదలుపెట్టారు .. తెలంగాణ ఉద్యమ సమయంలోనే తెలంగాణకు నీళ్లు ఇచ్చే పద్దతి ఇది కాదని అనేక సార్లు కేసీఆర్ వెల్లడించారని తెలిపారు. అటవీశాఖ అనుమతులు కీలకంగా ఉన్న నేపథ్యంలో అడిట్ సిస్టం ద్వారా పనులు చేపడితేనే సాధ్యం అవుతుందని అనేకమార్లు చెప్పామని తెలిపారు. వ్యవసాయరంగానికి, రైతాంగానికి మేలు జరగాలని అందరు మంత్రులను సమన్వయం చేసి కేసీఆర్ పనిచేయించేవారనా తెలిపారు. రేవంత్ మాట్లాడే మాటలు ప్రజలకు ఉపయోగపడేవా ? ఆయన బీజేపీ స్కూలు, టీడీపీ కాలేజీ, రాహుల్ ఉద్యోగం ఎవరికి ఏం ఒరుగుతుంది ? తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి పాలనలో చిత్తశుద్ది లేదు .. ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని అన్నారు .. కనీసం వారికి ఇప్పుడు జీతాలు కూడా ఇవ్వడం లేదు .. తమ ఇబ్బందుల పట్ల పంచాయతీ కార్యదర్శులు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చారని ,సమస్యలు, వైఫల్యాల నుండి ప్రజల ఆలోచనలను మరలించేందుకు కమీషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. మీడియా సమావేశంలో కార్పోరేషన్ మాజీ చైర్మన్ జి దేవీప్రసాద్ రావు, బీసీ కమీషన్ మాజీ సభ్యుడు కె .కిశోర్ గౌడ్ పాల్గొన్నారు.

# కాళేశ్వరం ముందు అంతా కాకమ్మ కబుర్లు

- అంచనాలు పెంచడంపై కమిషన్ నిజాలు రాబట్టాలి
- మాజీ ఎమ్మెల్సీ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్



హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) : కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు ఇటీవల హాజరైన వ్యక్తులు.. క్యాబినెట్ నిర్ణయం మేరకే అంతా జరిగిందని చెప్పారని భాజపా నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తప్పించుకోవడానికే ఇలా కాకమ్మ కథలు చెప్పారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బహిరంగ విచారణ వద్దని అనడంలోనే అసలు ఉద్దేశం తెలుస్తోందన్నారు. బండారం బయట పడుతుందని అలా అడిగారని చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ తప్పులు జరుగుతున్నా సరి చేయలేదని దుయ్య బట్టారు. కాళేశ్వరం బ్యారేజీలు కుంగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లొకేషన్‌ను రాజకీయ కారణాలతోనే మార్చారు. అంచనాలు పెంచడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాధానాలు రాబట్టాలన్నారు. గత ప్రభుత్వ అవినీతిని బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు. షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

# కాళేశ్వరం ఓ పనికిరాని ప్రాజెక్ట్

- దానికోసం డబ్బులు వృధా చేయరాదు
- అన్నీ తానే అన్న కెసిఆర్ ఇప్పుడు కేబినేట్ అంటున్నారు
- విమర్శలు గుప్పించిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని



హన్మకొండ, జూన్14 (జనంసాక్షి) : ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరానికి అన్నీ తానే అన్న మాజీ సిఎం కెసిఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఎల్లంపల్లి ద్వారానే పంటలకు నీళ్లు అందుతున్నాయని తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోందని, మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. తాజాగాకూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో.. తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిం చారు. నెలకు రూ.8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదా యం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

# చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు

- కూల్చేసిన రెవెన్యూ సిబ్బంది



హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) : గ్రేటర్ హైదరాబాద్ లో ఓ వైపు హైడ్రా,మరో వైపు రెవెన్యూ,జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొన్ని చోట్ల పర్మిషన్ లేకుండా ఇష్టారాజ్యంగా భవనాలు,బిల్డింగ్ లు కడుతున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. షాబాద్ మండల పరిధిలో హైతాబాద్ గ్రామం రెవెన్యూలోని సర్వే నెంబర్ 8 లో 42 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను షాబాద్ ఎమ్మార్వో, అధికారులు తొలగించారు. ఇష్టానుసారంగా హైతాబాద్ లో ఉన్నటువంటి బడా నాయకులు డబ్బుల కోసం వేరే వ్యక్తులకు షాపులు వేసుకొని నెలసరి మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం అధికారులకు తెలియడంతో అధికారులు ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఇలాంటివి జరగకుండా అక్రమ నిర్మాణాలను అరికట్టాలని గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను కోరారు. నాలాలు ఆక్రమించి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హైడ్రా వీటిపైనే ఫోకస్ పెట్టింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది.

# కావ్యతో పెళ్లి వార్తల పుకార్లు

- ఖండించిన అనిరుధ్ రవిచందర్

చెన్నై, జూన్14 (జనంసాక్షి) : కావ్యా మారన్‌తో పెళ్లి అంటూ వస్తున్న పుకార్లను సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఖండించారు. ఇలాంటి వార్తలను ప్రచారం చేసే ముందు ఆలోచించాలని అన్నారు. అలాగే ఈ పుకార్లకు వెంటనే ముగింపు పలకాలని అన్నారు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సీఈవోగా వ్యవహరిస్తున్న కావ్యా మారన్‌తో అనిరుధ్ కొంతకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కోలీవుడ్ మీడియాలో వార్తలు రావడం హాట్‌టాపిక్ అయింది. సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ జరిగింది. వీటిపై అనిరుధ్ స్పందించారు. 'పెళ్లా..? రూమర్స్ ప్రచారం ఆపండి' అంటూ సోషల్ మీడియా వేదికగా ఆ వార్తలను ఖండించారు.

# నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు

- వేగంగా పనులు పూర్తి చేయాలి: హైడ్రా కమిషనర్



హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) : నగరంలోని నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని, నాలా ఆక్రమణలుంటే తొలగించాలన్నారు. శుక్రవారం చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. చింతలబస్తీలో మూడ్రోజుల క్రితం తొలగించిన నాలా ఆక్రమణల కింద భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించాలన్నారు. శంకర్ పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూకాలనీ, షేక్ పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హకీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలటరీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వరదనీరును తీసుకువస్తుంది. చింతల్ బస్తీలో ఇటీవల హైడ్రా అధికారులు నాలాల కబ్జాలను తొలగించే సమయంలో ధ్వంసమైన వాటర్ బోర్డు మెయిన్ పైప్ లైన్ ను అధికారులు రిపేర్లు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ పనులను ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైడ్రా నాలా ఆక్రమణ తొలగింపు సందర్భంగా బంజారాహిల్స్ సంప్ ఔట్ లెట్ నుంచి మసాబ్ ట్యాంక్, ఏసీ గార్డ్స్ కు మంచినీటిని సరాఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతిన్నది. స్పందించిన అధికారులు రిపేర్లు పూర్తి చేసి సరఫరా పునరుద్ధరించారు. అంతకు ముందు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు.

## బిఆర్ఎస్ అధికారంలోకి రావాలంటే రేవంత్ సిఎంగా ఉంటేనే మేలు: కవిత



హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) : తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఒక ఉద్యోగి అని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి ముందు ఆయన ఉద్యోగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఆమె మీడియాతో చిట్ చాట్ సందర్భంగా, రేవంత్ రెడ్డికి పార్టీ అధినేతల అపాయింట్ మెంట్ దొరకట్లేదని తెలియజేశారు. బిఆర్ఎస్ మళ్లీ గెలవాలంటే రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగాలని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి తరపున పోరాటం చేశామని, ఈ నెల 17న మెదక్ లో బిసి రిజర్వేషన్లపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ధర్నాలు, రైల్ రోకోలు, అవసరమైతే బంద్ కు పిలుపు ఇస్తామని, ఎవరూ కోర్టుకు వెళ్లే అవకాశం లేదని సూచించారు. నరేంద్రమోడీని కలిసిన సిఎం రేవంత్ రెడ్డి బిసి బిల్లు గురించి కనీసం అడగలేదని, బిజెపికి కూడా బిసిలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వం దెబ్బతీసేలా పాఠ్యపుస్తకాలు మారుస్తున్నారని, కుమురంభీమ్ చిత్రపటం తొలగించి సైబర్ టవర్స్ ఫొటో ముద్రించారని కవిత మండిపడ్డారు.

## సిఎంపై ఫిర్యాదు చేస్తే చర్యలు ఉండవా?

- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, జూన్14 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫార్ములా ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేలాది కోట్ల రూపాయాల ఆదాయానికి గండి పడిందని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కానీ ఇంత వరకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కనీసం పోలీసులు ఫిర్యాదుదారునైన తనను విచారించకుండానే కేసు క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. సీఎం లేదా హోంమంత్రి మీద కేసు పెట్టకూడదని బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఉల్టా.. చేయని నేరానికి, ఫార్ములా వ్యవహారంలో ఒక తుఫైల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేటీ-ఆర్‌కు నోటీ-సుల మీద నోటీసులు పంపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? సీఎంకు ఒక రూల్.. సామాన్యులకు మరో రూలా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

# నీట్ - 2025 ఫలితాల్లో 'అల్ఫోర్స్' అఖండ విజయం

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి








కరీంనగర్ బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి) : శనివారం రోజు ప్రకటించబడిన నీట్ - 2025 ఫలితాలలో మా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యద్భుత మార్కులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మా విద్యార్థులు వి.శశాంక్ రెడ్డి 599 మార్కులు సాధించారు. బి. వర్షిత్ 556 మార్కులు, అదిబాపిర్దోజ్ 553 మార్కులు, జె. మైథిలి 535 మార్కులు, యమ్.డి. అఫ్నాన్ 513 మార్కులు, బి. భువనకృతి 508 మార్కులు, ఎ. సాత్విక 507 మార్కులు, జె. అనూష 500 మార్కులు సాధించారని చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. నీట్ కోచింగ్ లో డాక్టర్లు -30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ అందించిన మూడవ సంవత్సరంలో అల్ఫోర్స్ విజయపరంపర కొనసాగుతుందని 8 మంది విద్యార్థులు 500, అపై మార్కులు సాధించడం విశేషం అన్నారు. సుమారుగా 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించారని ఈ సందర్భంగా తెలిపారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అకుంఠిత దీక్ష, పట్టుదల, కృషి వల్ల ఇంతటి ఘన విజయం సాధించడం జరిగిందన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అధికముగా సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనమని నీట్ అయిన, ఐఐటి అయిన విద్యార్థులను విజయమార్గంలో నడిపిస్తున్న సంస్థ అల్ఫోర్స్ , ఇంతవరకు ప్రకటించబడిన అన్ని ఫలితాలలో అల్ఫోర్స్ ముందంజలో ఉండడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రములో విద్యాభివృద్ధికై కృషి చేస్తున్న అల్ఫోర్స్ తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ తమ పిల్లలను అల్ఫోర్స్‌లో చేర్పిస్తున్నందుకు వారికి మన స్ఫూర్తిగా కృతజ్ఞతాభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో అత్యధిక మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి, ఎన్.ఐ.టిలలో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భముగా తెలిపారు. ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ ఆణిముత్యాలు అభినందిస్తున్నాను. ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉగ్రమూకలకు ఎదురొడ్డి ప్రాణార్పణం

- మరణించిన ఆదిల్ షా భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

శ్రీనగర్, జూన్14 (జనంసాక్షి) : జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడి ఉదంతంలో ఎదురొడ్డి నిలిచిన ధీరుడి ఆత్మకు శాంతి కలిగే సంఘటన ఇది. పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో చిక్కుకున్న పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో స్థానికుడైన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా మరణించిన సంగతి తెలిసిందే. అతని కుటుంబ సభ్యులను జమ్మూ కాశ్మీర్ లెఫ్టనెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఇవాళ కలుసుకున్నారు. దివంగత హుస్సేన్ షా భార్య గుల్నాజ్ అఖ్తర్‌కు ప్రభుత్వ ఉద్యోగమిస్తూ దానికి సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు భారత సర్కారుకు ధన్యవాదాలు తెలిపారు. కాశ్మీర్ లోని ఒక పేద కుటుంబంలో జన్మించి, ఇంటర్ చదివిన ఆదిల్.. అమర్‌నాథ్ యాత్ర సమయంలో పహల్గాంకు వచ్చే పర్యాటకుల కోసం పోనీ గైడ్‌గా పనిచేసేవాడు. యాత్రికుల్ని గుర్రంపై తీసుకెళ్లి వాళ్లకి అక్కడి ప్రదేశాలు చూపిస్తూ, వాటి గురించి వివరించేవాడు. ప్రతీ రోజులానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రమూక పర్యాటకులపై కాల్పులు జరుపుతోంది. దీంతో ఆదిల్ ఎంతో ధైర్య సాహసాలతో ఉగ్రవాదుల నుండి తుపాకీని లాక్కొని పర్యాటకుల్ని రక్షించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. దీంతో ఉగ్రమూక ఆదిల్‌ని గన్‌తో కాల్చి పొట్టన బెట్టుకున్నారు. కాగా, ఏప్రిల్ 22న పహల్గాంలో ఐదుగురు సభ్యుల ఉగ్రమూక, అక్కడి మైదానంలో విహరిస్తున్న పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టు-కున్న సంగతి తెలిసిందే. ఈ మారణహోమానికి ఆదిల్ అహ్మద్ థోకర్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహించినట్టు- గుర్తించారు. ఇతడు పాకిస్తాన్ లో శిక్షణ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి ఇతర ఉగ్రవాదులతో సమన్వయం చేసుకుని, పర్యాటకులపై దాడికి పాల్పడ్డట్టు- సమాచారం. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి దాదాపు100 మంది ఉగ్రవాదుల్ని మట్టుపెట్టడం, తర్వాత ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగాయి.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370